183/184
జనవరి/ఫిబ్రవరి
1991

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

నీ ఇంట్లో
ఒక గదిలో నిప్పంటుకుంటే
మరో గదిలో
నిద్రపోగలుగుతావా?
నీ ఇంట్లో
ఒక గదిలో శవం పడి ఉంటే
మరో గదిలో
పాడగలుగుతావా?
నీ ఇంట్లో
ఒక గదిలో శవాల కుప్పలు కుళ్ళుతోంటే
మరో గదిలో
ప్రార్థన చేయగలుగుతావా?
నువ్వట్లా
నిద్రపోగలిగితే
పాడగలిగితే
ప్రార్థన చేయగలిగితే
నీతో ఇంక నాకు
మాట్లాడవలసిందేమీ లేదు.

— సర్వేశ్వర్ దయాల్ సక్సేనా

నిర్వహణ
'సాహితీమిత్రులు'

సృజన
ఆధునిక సాహిత్యవేదిక

183/184 మాసపత్రిక జనవరి/ఫిబ్రవరి 1991

ఈ సంచికలో....

నిర్వహణ

'సాహితీమిత్రులు'

సంవత్సర చందా రు. 40 ఈ సంచిక రు. 4

Edited, Printed and Published by P. Hemalatha, Flat 11, Block 2, MIG II, Baghlingampalli, Hyderabad 500 044 and Printed at Nagendra Press, Vijayawada - 520 002

Working Editor : Vara Vara Rao

సంపాదకీయం :

ఖషోగ్గి - గద్దర్

రెండు దృశ్యాల సాదృశ్యాలు చూద్దాం.

అంతర్జాతీయ ఆయుధాల దళారీ సౌదీ అరేబియాకు చెందిన ఖషోగ్గి ఒక భారతీయ జనతా పార్టీ ఎం.పి. ఆహ్వానంపై భారతదేశానికి వచ్చాడు. లేదా ఆయన అతిధిగా వచ్చాడు. ఎప్పటి సంగతో కాదు — దేశంలో రామజన్మభూమి, బాబ్రీ మసీదు వివాదంపై వందలాదిమంది తాము చంపుకొని, పోలీసుల చేతుల్లో చచ్చాక విశ్వ హిందూపరిషత్ బాబ్రీమసీదు కమిటీ చారిత్రక పత్రాల ఆధారంగా చర్చలు జరుపుతున్న సమయంలో - కువైట్‌ను విముక్తంచేసే నెపంతో అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచాన్నంతా యుద్ధంలో దించి ప్రకృతినంతా అణురక్తసిక్తం చేసిన సమయంలో - మానవరక్తం తాగి బయల్దేరిన అమెరికా యుద్ధ విమానాలకు బొంబాయిలో భారత ప్రభుత్వం 'ఉతారు' తాగించిన సమయంలో - అరబ్బుల రక్తమాంసాలు తప్ప రుచించని అమెరికా బుష్‌కు అరేబియా సముద్రతీరాన ఆయన అనుచరుడు చంద్రశేఖర్ ఇంధనపు 'సూపు' తాగించిన సమయంలో.

ఆ సమయంలో వచ్చిన ఖషోగ్గికి ఎల్.కె. జైన్ ఇచ్చిన విందుకు చంద్రస్వామి ఆశీస్సులతో హాజరయ్యాడు. 'సతి' మంత్రి కాల్వీ హాజరయ్యాడు. చంద్రస్వామి ముందు భారతప్రభుత్వ న్యాయశాఖ మంత్రి సుబ్రహ్మణ్యస్వామి (కె.కె. తివారీ 'దేశభక్తుడు' అని సర్టిఫికెట్ ఇచ్చిన సి.ఐ.ఎ. ఏజెంటు) ఖషోగ్గికి పూలమాల వేసాడు. వారు వీరు అననేల స్వయంగా ఆ విందుకు భారత ప్రధాని చంద్రశేఖరుడే హాజరయ్యాడు.

ఇది సామ్రాజ్యవాదంతో, సౌదీ అరేబియాతో, ఆయుధాల దళారీలతో కుమ్మక్కవడం అని, మరీ ముఖ్యంగా గల్ఫ్ యుద్ధ సంక్షోభంలో ఇంతకన్నా దేశాన్ని తాకట్టుపెట్టే ద్రోహచర్య వుండదని ఎం.జె. అక్బర్, కె.కె. తివారీ (సుబ్రహ్మణ్యస్వామికి 'దేశభక్త' సర్టిఫికెట్ యిచ్చినవాడే) ఢిల్లీలో ఇల్లెక్కి అరుస్తుండగా అదే ఢిల్లీలో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు, జవహర్‌లాల్ నెహ్రూ మనుమడు, ఇందిరా ప్రియదర్శినీ గాంధీ తనయుడు, మాజీ ప్రధాని, ప్రస్తుత డిఫ్యాక్టో ప్రధాని రాజీవ్‌గాంధీ ఖషోగ్గిని రెండుసార్లు కలుసుకున్నాడు.

ఆధ్యాత్మిక స్వాముల ఆయుధాల దళారీ వ్యాపారంతో సామ్రాజ్యవాదులు ప్రధానులను మారుస్తున్నారు. ప్రభుత్వాలను మారుస్తున్నారు. దశాబ్దాలుగా మూడో ప్రపంచ దేశాలను పరస్పరం యుద్ధాలు చేయించారు. వాళ్ళు వివేకానికి వచ్చి మానుకుంటే తామే యుద్ధంలో దిగారు.

బి.జె.పి., జనతాదళ్(ఎస్), కాంగ్రెస్ పార్టీలే కాదు, ఈ దేశ సంస్కృతికి ప్రాతినిధ్యం వహించే ఆధ్యాత్మిక స్వాములే కాదు, స్వయంగా ప్రభుత్వాధినేతల దేశభక్తి, ఈ దేశభక్తులు సామ్రాజ్యవాదుల దళారులకు, సామ్రాజ్యవాద యుద్ధ విమానాలకు పలికిన స్వాగతవచనాలు, వడ్డించిన ఇంధన బిందులు – ఆరిపోని పెట్రోల్ ఆయిల్ తీసే దృశ్యం.

నాగపూర్‌లో ఒక కాలేజి ఆవరణలో పంజాబ్‌రావ్ దేశ్‌ముఖ్ హాల్ బయట రోడ్డు మీద చిందిన ఇంకా ఆరిపోని ప్రజల రక్తదృశ్యం మరొకవైపు. మహారాష్ట్ర ఆవాన్ నాట్యమంచ్ ఆహ్వానంపై ఫిబ్రవరి 13న గద్దర్, ఆయన జననాట్యమండలి సహచరులు నాగపూర్‌కు వెళ్ళారు. గద్దర్ తన ఒక జననాట్యమండలి సహచరునితో పాటు ఆవాన్ నాట్యమంచ్, దళిత్ రంగభూమి కళాకారులు సాంస్కృతిక ప్రదర్శన లిస్తున్న స్థలానికి చేరుకున్నాడో లేదో వందల సంఖ్యలో ఆ రోడ్డంతా మోహరించిన పోలీసులు ఆయనపైబడి అరెస్టు చేసారు. గద్దర్ రాక చూసి ఉత్సాహ ఉద్వేగాలతో కేరింతలు కొడుతూ వస్తున్న జనంపై నిర్విచక్షణగా లాఠీచార్జ్ జరిపారు. పోలియోతో కాళ్ళు పడిపోయిన ఒక స్త్రీని పోలీసులు కొడుతూవుంటే ఫొటో తీయబోయిన ఒక పత్రికా ఫొటోగ్రాఫర్‌ను తలమీద లాఠీతో కొట్టారు. కిందపడవేసి బూట్లతో తొక్కారు. పడిపోయిన కార్మికుల సైకిళ్ళ మధ్యన చిక్కుకొని ఎటూపోలేని స్థితిలోవున్న వృద్ధులను, స్త్రీలను కొట్టారు.

సరే శంభోజీ భగత్‌నో, సంజీవ్ జీవానీనో కొట్టడానికి తగినంత కక్ష వాళ్ళకుంది. ఆ కక్ష వెనుక వున్న నేపథ్యం మనం మన మాతృభూమికీ, భూమధ్యరేఖ కక్షకు మధ్యన ఎంత దూరంలో వున్నము ఎంత దగ్గరలో వున్నము అనే దాని సారాంశాన్ని బయటికి తెస్తుంది.

జనవరి 14వ తేదీన గద్దర్ ఆయన జననాట్యమండలి సహచరులు నాగపూర్‌కు విదర్భలోని బండారా జిల్లామీదుగా (సౌదీ అరేబియా నుంచో, అమెరికా నుంచో కాదు) వస్తున్నారనే తప్పుడు సమాచారం ఆధారంగా జిల్లా కలెక్టర్ నిషే

ధాజ్ఞలు జారీచేసాడు. గద్దర్, ఆయన 24 మంది జననాట్యమండలి సహచరులను నాగపూర్ జిల్లాలో ప్రవేశించనివ్వనిన్నాడు. ఎందుకు అని ఎవరూ అడుగకుండానే ఆయన నక్సలైటుకాకున్న నక్సలైటు రాజకీయాలు, సాయుధ పోరాట రాజకీయాలు ప్రచారం చేస్తున్నాడు అన్నాడు. గడ్చిరోలీ, చంద్రపూర్, బండారా, బస్తర్ జిల్లాల్లో ఆదివాసుల పోరాటాలను ఆయన తన 'జంగ్ కెపునార్' అనే పాటల ద్వారా ప్రచారం చేస్తున్నాడు అని అన్నాడు. అంతా సత్యమే. అయితే ఈ సత్యంలో దోషమేమిటి, నిషేధమేమిటి ?

నిజానికి జననాట్యమండలి పర్యటన విదర్భలో ఫిబ్రవరి 13 న ప్రారంభం కావలసింది. కనుక జనవరి 14 మొదలుకొని ఫిబ్రవరి 13 దాకా నాగపూర్‌లో విదర్భలో, మహారాష్ట్రలో ఒక నెలరోజులపాటు బౌద్ధిక ఆందోళన సాగింది. కళా కారులు, సాహిత్య సాంస్కృతిక వేత్తలు, మేధావులు, పత్రికా రచయితలు, అఖిల మహారాష్ట్ర కార్మిక సంఘాలు, ప్రజాతంత్రవాదులు, విప్లవోద్యమ కార్యకర్తలు, ఆ ప్రాంతపు ఎంఎల్ఎలు, ఎంపీలుకూడ ఈ నిషేధాజ్ఞలను ఖండించారు. 'దళితరంగ భూమి' కళాకారులయితే సంజీవ్ జీవానీ నాయకత్వంలో గద్దర్‌ను నిషేధిస్తే ఆ వేషం మేం కడతాం, ఆ పాటలు మేం పాడుతాం అని ఫిబ్రవరి 9 వ తేదీ నుంచి నాగపూర్‌లో ప్రత్యక్ష సాంస్కృతిక చర్యకు పూనుకున్నారు. (ఫ్రాన్స్‌లో 1968 డీగాల్‌కు వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమ కాలంలో మావోయిస్టు విద్యార్థుల పత్రికను నిషేధించి నలుగురు మావోయిస్టు విద్యార్థులను అరెస్టు చేస్తే, వాళ్ళ పత్రిక నేను పంచుతాను, వాళ్ళు చేసిన పని, వాళ్ళ సిద్ధాంతాలను బలపరుస్తానా లేదా అనే అంశంతో సంబంధం లేకుండా, వాళ్ళకున్న ప్రజాస్వామిక హక్కుగా గుర్తించి నేను చేస్తాను-నన్ను అరెస్టు చేయండి అని కార్యాచరణలోకి దిగాడు జీన్ పాల్‌సార్త్.) సంజీవ్ జీవానీని అతని అనుచరులను రెండు మూడు రోజుల ప్రదర్శనల తర్వాత అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి కేసుపెట్టి విడుదల చేసారు.

13 వ తేదీ మధ్యాహ్నానికి గద్దర్, అతని జననాట్యమండలి 24 మంది సహచరుల నిషేధపు ఉత్తర్వులను రద్దుచేస్తూ బొంబాయి హైకోర్టు నాగపూర్ బెంచీ తీర్పు యిచ్చింది. 13 సాయంత్రానికి జననాట్యమండలి అక్కడికి చేరుకున్నది. అయినా సరే పోలీసులు కార్యక్రమం జరగాల్సి వున్న హాల్‌కు, ఆ హాల్ వున్న కాలేజి గేటుకు తాళం పెట్టారు. రోడ్డు పొడవునా సాయుధ పోలీసు పహారా పెట్టారు.

రోడ్డు పక్కన అవాన్ నాట్యమంచ్, దళిత రంగభూమి వందలాది మంది ప్రజల ముందు ఒక గంటసేపు సాంస్కృతిక ప్రదర్శన లిచ్చింది. నాగపూర్‌లోని రచయితలు, కళాకారులు, బుద్ధి జీవులంతా అక్కడున్నారు. ప్రపంచ ప్రజాస్వామిక పరిరక్షక పోలీసుననుకుంటున్న అమెరికా మొదలు, విదర్భ రేంజిలో గద్దర్‌ను గళం విప్పనివ్వనన్న డిఐజి చక్రవర్తి దాకా అందరి పాత్రల గురించీ అక్కడ పాటలు పాడారు. రామజన్మభూమి రథయాత్రకు లింకు ఎక్కడున్నదో అషోగ్గి-జైన్‌ల (ఈ జైన్‌కు వీడియోక్యాసెట్ల ఉత్పత్తి కంపెనీ కూడ వుంది. అయోధ్యపై అక్టోబర్ 30 వీడియోక్యాసెట్ తీసి విడుదల చేసింది ఈ రామభక్తుడయిన దేశభక్తుడే) సాహచర్యంలో దాగిన డాలర్-దీనార్-ఏకత్మతల అద్వైతంలో చూడమన్నారు.

అందుకే పోలీసులు సంజీవ్ జీవానీని ఆసుపత్రి పాలయ్యేలా కొట్టారు. శంభోజీ భగత్‌ను తీవ్రంగా కొట్టి అరెస్టు చేశారు. అనురాధ గాంధీ, షోమా సేన్, చంద్ర మొదలయిన స్త్రీలను అరెస్టు చేశారు.

ఈ సంపాదకీయం రాస్తున్న సమయానికి గద్దర్‌ను పోలీసులు ఏం చేసింది తెలియదు. అరెస్టయిన వారినుంచి వేరుచేసారు. జిల్లా బయటికి, బహుశా రాష్ట్రం బయటికి అంటే ఆంధ్రప్రదేశ్‌కు పంపిస్తారని ఒక ఊహ : లేదా ప్రభుత్వాధికారుల, విధి నిర్వహణలో అడ్డుపడ్డాడని 'దేశద్రోహకర' ఉపన్యాసాలు, పాటలు, ప్రదర్శన లిచ్చారని కేసుపెట్టి జైలుకు పంపవచ్చు. ఫిబ్రవరి 15, 16, 18 లలో చంద్రపూర్, వార్ధా, అమరావతిలలో వున్న జననాట్యమండలి ప్రదర్శనలు జరుగకుండా చేయవచ్చు. చంద్రపూర్ జిల్లాలో కూడ గద్దర్, అతని 25 మంది జననాట్య మండలి సహచరుల ప్రవేశాన్ని నిషేధిస్తూ అక్కడి మెజిస్ట్రేట్ ఫిబ్రవరి 12న ఉత్తర్వులు జారీ చేసాడు.

ఇంతకూ ఈ గద్దర్, ఇతని 24 మంది జననాట్యమండలి సహచరులు ఎవరు? ఈ 25 మంది అక్టోబర్ నెల మొదటి వారంలో ఒక అఖిల భారత సాంస్కృతిక పర్యటన తలపెట్టి మధ్యప్రదేశ్‌లోని భిలాయ్‌లో ప్రవేశించారు. భిలాయ్, రాయపూర్, దుర్గ్‌లలో వీధి ప్రదర్శనలిచ్చారు. ఆ ప్రదర్శనలు బస్తర్ అడవుల్లోని ఆదివాసుల పోరాటాలకు సంఘీభావాన్ని ప్రకటించేవిగా వున్నవని

(తరువాయి 14వ పేజి)

యుద్ధ కవిత

సెలయేటి పాట ముగుస్తుంది

పాబ్లో నెరూడా

ఒకప్పుడు నేను భయం భయంగా దాటిన ఆ నేలలో
రహస్య ధ్వనులతో, అడవి నిండిన చీకటితో
రాత్రి కదిలిపోతుండేది
ఆ విచిత్ర ప్రపంచంలోకి నేనొక ట్రక్కులో పాకిపోయాను-
నల్లని ఆసియా, చీకటి అరణ్యం, పవిత్ర భస్మం
అనిశ్చిత రాజ్యాల మధ్య అటూ ఇటూ ఎగిరే
ఈగ రెక్కల్లా వణుకుతుండిన నా యవ్వనం.
హఠాత్తుగా చక్రాలాగిపోయాయి. అపరిచితులు నేలమీద దిగారు
అక్కడ నేను, ఒక విదేశీయుణ్ణి, అడవి ఒంటరితనం మధ్య
అక్కడే, రాత్రివేళ చిక్కుబడిపోయిన ట్రక్కులో బందీనై
ఇరవై ఏళ్ళ వాణ్ణి, మృత్యువుకోసం నిరీక్షిస్తూ, నా భాషలోకి నేను ముడుచుకు
పోతూ.

హఠాత్తుగా ఒక డోలు మోగింది, ఒక కాగడా వెలిగింది,
ఒక కదలిక సాగింది

వాళ్ళు కచ్చితంగా నా హంతకులే ననుకున్నాను
అడవిలో చీకటి గోపురం కింద వాళ్ళు నాట్యం చేశారు
సుదూర ప్రాంతంలో చిక్కుబడిన బాటసారి ఆనందం కోసం
అట్లా, ఎన్నెన్నో శకునాలు నా జీవితాంతాన్ని సూచించే వేళ
పొడవాటి డోలు, పూలు వికసించే కొప్పులు, తళుక్కుమనే పిక్కలు
అన్నీ ఒక పరదేశి కోసం ఆడుతున్నాయి పాడుతున్నాయి చిర్నవ్వులు
వెదజల్లుతున్నాయి

ప్రియతమా, ఆ పాఠం, మానవీయ పాఠం
విచిత్ర రూపాల్లో వెలుగులీనుతోంది గనుకనే
నేన్నీకి కథ చెపుతున్నాను
అక్కడే నాలో ప్రభావ ఆదర్శాలు పాదుకొందాయి
మానవులందరూ సోదరులని నా మనసుకక్కడే తెలిసింది

అది వియత్నాం, 1928 నాటి వియత్నాం
నలభై సంవత్సరాల తర్వాత
నా సహచరుల సంగీతం మీద
హంతక వాయువు ప్రసరించింది
పాదాల్నీ వదాల్నీ మండిస్తూ
గడ్డకట్టిన అరణ్య నిశ్శబ్దాన్ని తగులబెడుతూ
ప్రేమను పేల్చేస్తూ శైశవ శాంతిని ధ్వంసిస్తూ
ఆ చిన్నారి దేశాన్ని ప్రతిఘటన బంధంలో ఏకం చేస్తూ
'దుర్మార్గ దురాక్రమణదారు నశించాలి' అని నినదిస్తోంది దోలిప్పుడు
నా ప్రియతమా, సముద్రంలో ఏం జరిగిందో, పగటిపూట
ఏం జరిగిందో చెప్పాను నేను

నా సెలయేటి పాటలా నీటిలో చంద్రుడు కునికిపాట్లు పడుతున్నాడు
నా క్రమశిక్షణా కాంక్షతో
సముద్ర వసంతపు తొలిముద్దు పులకింతతో
అట్లా రూపొందించాను
చెప్పాను గదూ-నా యాత్రా ప్రపంచంలో నీ కళ్ళచూపుల సాహచర్యంలో
నా హృదయంలో గులాబీ తన సొంత పాదును రూపొందించుకుంటుంది
దుర్మార్గుల జ్ఞాపకాలూ వీరుల జ్ఞాపకాలూ అన్నీ నీకిస్తానన్నాను గదూ
ప్రపంచ మేఘ గర్జనలన్నీ నా ముద్దులలో ధ్వనిస్తాయి—
నా సెలయేటి పాటలో పడవ గింగరాలు తిరిగిన పద్ధతి అది
కాని, మనం జీవిస్తున్న ఈ సంవత్సరాలు మచ్చపడిన సంవత్సరాలు
సుదూరాన మనుషుల రక్తం నురుగుమీద చెల్లాచెదరవుతుంది
అలలు మనమీద నెత్తుటి మరకలద్దుతాయి
చంద్రుడూ రక్తం మరకల మయమవుతాడు
ఈ సుదూర వేదనలూ మన వేదనలే
అణగారిన వాళ్ళకోసం పోరాటం నా స్వభావంలో రక్తతంత్రి
బహుశా ఈ యుద్ధం కూడ మనను విడదీసిన
ఇతర యుద్ధాలలాగే సాగొచ్చు

మన శవాల్నే మిగల్చొచ్చు
మననూ మన హంతకుల్నీ కూడ చంపెయ్యొచ్చు
కాని ఈ కాలపు పరాభవం మన ముఖాల మీద తన
మండే వేళ్ళు పెడుతుంది
అమాయక రక్తంలో దాగిన నిర్దాక్షిణ్యాన్ని తుడిచెయ్యగల వాళ్ళెవరు ?
నా ప్రియతమా, ఈ విశాల తీరం పొడవునా
ఒక పువ్వు నుంచి మరో పువ్వుకు భూమి సువాసనల్ని నింపుతోంది
ఇప్పుడిక ఈ వసంత చిహ్నాలు, క్షణికమైనందుకు బాధపడుతూనే
మన శాశ్వతత్వాన్ని ప్రకటిస్తున్నాయి.
బంధనాలు వదిలేసుకున్న ఓడ ఒకవేళ రేవుకు తిరిగి రాకపోతే
గర్జించే సముద్రంలో సెలయేటి పాట దాని దారిన సాగిపోతే
నీ బంగారు నడుము నీ చేతుల్లో అందంగా తిరుగుతుంటే
మనమిక్కడ మన భవిష్యత్తుకు, సముద్రాల పునరాగమనానికి లొంగిపోదాం
ఎక్కువ మారాం చెయ్యకుండా, దాని ఆటలతో సరిపెట్టుకుందాం.
ప్రవాహంలో కొనసాగింపులో దాగి ఉన్న రహస్యాల్ని మీటగల వాళ్ళెవరు?
ఆ రహస్యాలే గదూ మనను వరుసగా వెలుగుతో వేదనతో నింపేవి !
ఒక చిటారుకొమ్మ మీది ఆకు మహత్తర భూమి వేపు వంగుతుంది
ఒక ఆగమనానికి ప్రతీకగా పసుపచ్చ గాలిలో రాలిపోతుంది
మనిషి తన కుట్రలలోకి వెళిపోయి
తన కళాఖండాలనూ, తన చిత్తరువులనూ
తన కాంక్ష నిండిన తీగల శిల్పాలనూ
మెరుపుల్ని అబద్ధీకరించేందుకు రాసిన పుస్తకాలనూ
అసహ్యకరం చేశాడు
వరిపొలాల మాగాణిలో నెత్తుటి మరకలతో
వ్యాపార ఒప్పందాలు తయారయ్యాయి
అనేకానేక ఆశల ఫలితంగా అస్థిపంజరపు ఛాయ మిగిలింది -
ఆకాశంలో, శతాబ్దాంతం మనకు పడిన అప్పు చెల్లిస్తోంది.
ఇక వాళ్ళు చంద్రుడిపై పాదం మోపి బంగారు పనిముట్లక్కడ పారేస్తే

కొత్తగా కనిపెట్టినది ఒక నూత్నగ్రహమో, ఒక నూత్న మృత్యురూపమో
గ్రహించలేక పోయాం, మనం మందకొడి అర్ధసంధ్య వారసులం.
నేనయినా నువ్వయినా, మనం సరిపెట్టుకుంటాం
మన ఆశలనూ నిరుత్సాహాలనూ పంచుకుంటాం
మనం గాయపడినది జరామరణాలున్న శత్రువులతో మాత్రమే కాదు
జరామరణాలున్న మిత్రులతోకూడ (అదే అన్నిటికన్న చేదు నిజం).
ఈ మధ్యలో రొట్టె మధురంగా అనిపించదు. నా పుస్తకమూ మధురంగా
అనిపించదు.

బతుకుతూ మనం బాధ గణాంకాల కొరత తీరుస్తాం
మనం ప్రేమను ప్రేమిస్తూనే ఉంటాం మనదైన మొరటు పద్ధతిలో
అబద్దాలకోర్లను సమాధిచేస్తూ నిజం చెప్పే వాళ్ళమధ్యనే జీవిస్తాం
నా ప్రియతమా, ప్రపంచ వైశాల్యం పైన పడుగుతీస్తూ
రాత్రి మనమీద దిగింది
నా ప్రియతమా, సముద్రపు జాడల్ని, ఓడల తెరకొయ్యల్ని
తుడిచేసిన రాత్రి ప్రశాంతంగా ఉంది
నా ప్రియతమా,
రాత్రి తన చుక్కల సామ్రాజ్యాన్ని వెలిగించింది
నిద్రపోతున్న పురుషుడి పక్కకు
మెలకువలో స్త్రీ ఎగిరి వచ్చింది
స్వప్నాలలో వాళ్ళిద్దరూ నదుల మీదినుంచి
శోకతప్తుల దగ్గరికి దిగిపోయారు
మళ్ళీ ఒకసారి చీకటి జంతువుల మధ్యా
నీడలు నిండిన వరుసల మధ్యా
పెరిగి పెరిగి
రాత్రివేళ రంగులేని రాళ్ళలా మారిపోయారు
ప్రియతమా సమయమిదే
ఆ విచారగ్రస్తమైన గులాబీని తెంపాలి
నక్షత్రాల్ని మూసేయాలి

భస్మాన్ని నేలలో సమాధి చేయాలి;
అప్పుడిక వెలుగు వెల్లువవుతోంటే
మేలుకున్నవాళ్ళలో కలిసిపోవాలి
లేదా స్వప్నంలో కొనసాగాలి
ఇంత తీరంలేని సముద్రపు తీరం చేరాలి.

* * *

హిందీ కవిత

పద పోదాం

బ్రజ్ మోహన్

పదపోదాం గుండెలలో గాయంతోనే పదపోదాం
పద రక్తసిక్త పాదాలతో అడుగులేస్తు పదపోదాం
కలసి మెలసి నడవాల్సిన రోజిది పోదాంపద
జీవిత వేదనలన్నీ రద్దయ్యేందుకు పదపోదాం
ఇలను కలను బతుకును భావనను విడదీసి
వాళ్ళు అసహాయ మానవుడు లొంగాలని చూస్తారు
జీవితాన వెలుగు తెలియకుండాలని కోరుతారు
ఒక్కరొక్కరినే చేసి ప్రతిపట్నం అగ్గిమంట చేస్తారు
కాలిన ఇళ్ళలోని కలలన్నీ ఏరుకుని పదపోదాం
హృదయాకాంక్షలన్నిటినీ చీల్చాలని చూస్తారు
మన బతుకు బిడారులను విరవాలని చూస్తారు
కోరికల వరుసలన్ని బుగ్గి చేయ జూస్తారు
ఈ దోపిడీ కోటలన్ని కూలొద్దని కోరుతారు
ఈ ప్రశ్నల జవాబుతో పదపోదాం
కులాలకూ భాషలకూ కొట్లాటను కోరుతారు
మత విధ్వంసాలన్నీ మినహాయింపులంటారు

బతుకునిండా మోసం, అబద్ధం కోరుతారు
ఎట్లాగయినా దోపిడి కొనసాగాలని కోరుతారు
తలమీద మిగిలిన ఛాయనైనా తీసుకుని పదపోదాం
పదపోదాం గుండెలలో గాయంతోనే పదపోదాం

* * *

'హంతః' కలహాలు

వసీరా

మంచురేఖల సూర్యపరిమళంతో
పొత్తిళ్ళలో వికసించే బోసినవ్వుల మీద
కత్తులతో రామకోటి రాసి
రాజ్యాధికారం వైపు రథం నడిపేవాడు
సంఘవ్యతిరేక శక్తి కాదు
విఖ్యాతైన జాతీయవాది
జీవన బోధివృక్షానికి పండిన
మునెమ్మ ముఖాన్ని
నైపుణ్యంతో
మాంసఖండాలుగా చెక్కేవాళ్ళూ-
గూండాల్ని సాకే పాలకులూ-
విచ్ఛిన్నకర శక్తులు కాదు
అఖండ భారత భాగ్య విధాతలు
నెత్తుటి సంచులుగా మూటగట్టిన
పసిపాపల ఛిద్ర అవయవాలను
జనానికి కానుకగా ఇస్తూనే
సుభాషితాలు వల్లించేది
హంతకరాజ్యం కాదు
21వ శతాబ్దపు రామరాజ్యం

ఎక్కడైనా, ఏ పేరైనా
హంతక రాజ్యం భాష ఒక్కటే

× × ×

మీ పల్లెల పెదవులకి
హరిత హాసాల రంగులువేశాం
కాళ్ళకింద నేలను తొలిచేసి
రూపాయల మీద రూపాయలు సాగు చేసి
అప్పులకు డాలర్లు కాయించాం
రైతుల తాటతీసి, పల్లెల్ని గుడిగుచ్చి
గెద్దల మెళ్ళో మువ్వలుగా కట్టాం
ఆకలితో దరిద్రంతో
మీరు ఆత్మహత్యలు చేసుకుంటే
అది మీ 'కర్మఫలమే' తప్ప
మా తప్పెలా అవుతుంది?
మీ పల్లెలు నిలువుదోపిడీ అయిపోయి
నగరాల మురికివాడల్లో తేలితే
అది మా తప్పెలా అవుతుంది?
ఎంత మందికని ఉద్యోగాలిమ్మంటారు
పనిమంతులకి
అధికార అనధికార హత్యాకాండలో
పూర్తి శిక్షణ ఇస్తూనే ఉన్నాం
అలగా జనాభా పెరిగిపోయి
మీలో మీరు పొడుచుకు ఛస్తే
అది మా తప్పెలా అవుతుంది?
మేమెప్పుడూ
చేతికి మట్టి అంటకుండానే కలహించుకుంటాం
మా తగాదాలు పీటముడి పడితేనే తప్ప
ఉత్తప్పుడు గూండాల చేత

మీ పిల్లల్ని చంపించామా?
మీ బతుకుల్ని
గన్ పౌడర్లో పులియబెట్టామా?
అక్కడికి
మీ చితాభస్మ కలశాలను
మేళతాళాలతో ఊరేగిస్తున్నామా లేదా!
ముందుగా మా ముఠాకే
అధికార పీఠం చిక్కితే
మీ పసిపాపల, వృద్ధుల
మృతదేహ శకలాలు చల్లిన
రెడ్‌కార్పెట్లు పరుచుకుని
మేం ఓదార్పు యాత్రలూ
సామరస్య యాత్రలూ
చేసే శ్రమ తప్పేదికదా
అయినా మా తగాదాలు
అంతరంగికం, రాజ్యాంగ సమ్మతం

× × ×

ఉద్రిక్త నగరం ఊపిరి తీసినపుడల్లా
కత్తిపోట్లూ బులెట్లూ వీస్తూంటే-
మీ జీవితం సర్వాంగాలూ తెగి
గిలగిలా కొట్టుకుంటూంటే-
మీరు సంఘవ్యతిరేక శక్తులు కావటం వల్లేమోగానీ
మా తప్పెలా అవుతుంది
నీళ్ళూ పాలూ దొరకని కర్ఫ్యూలో
ఏడ్వలేక బిగబట్టిన నోళ్ళలాగ
ఉగ్గబట్టిన తలుపు సందుల్లోంచి
నెత్తురు బొటబొటా వచ్చేస్తూంటే-
కర్ఫ్యూ సర్పం చాచిన నాలుకలు

ఇళ్ళ చూరుల్లోంచి దిగి
బిక్కచచ్చిన శరీరాల మీంచి
జరజరా పాకుతూ మీ పెదవుల్ని
గరుకు గరుకుగా నాకుతూంటే-
మీరు సంఘవ్యతిరేక శక్తులు
కావటం వల్లే మోగానీ
మా తప్పెలా అవుతుంది?
గుక్కపెట్టిన పాపాయి ముఖంలాంటి నిశ్శబ్దం మీద
మృత్యు పదఘట్టనలతో పోలీసులూ సైన్యాలూ
అందిన వాళ్ళను అందినట్టు తన్నుకుపోతుంటే-
బంజారాహిల్స్ వెండికొండల మీద
వెలిసిన మహాసౌధాల జోలికి పోకుండా
సైన్యాలు మీ ఒంటిగుమ్మం ఇళ్ళ జీవనాన్ని మాత్రమే
బీభత్స వేదికచేసి
మానాభిమానాలు డిసెక్ట్ చేసి
సోదా చేస్తే-
విచ్ఛిన్నకర శక్తులకోసమే తప్ప
అది తప్పెలా అవుతుంది?

× × ×

ఎక్కడైనా హంతకభాష ఒక్కటే
హత్యారాజ్యం ఇచ్చే కానుకలు
తూట్లుపడ్డ జీవన శకలాలే
శవాల గుట్టలే!
పాలుగారే పసిపాపల
పచ్చినెత్తుటి మడుగులే
ఎక్కడైనా
చెరచబడ్డ పల్లెలూ-
కాంక్రీటు నిశ్వాసాల స్వర్ణపిశాచాలూ-

ఆకలి-
కన్నీళ్ళూ-
బులెట్లూ-
నేర్పే పాఠం ఒక్కటే
ఎక్కడైనా ఎప్పుడైనా
హంతక రాజ్యాన్ని అంతం చేయడానికి
ఉరితాళ్ళుగా మారేది
ఏకతాటిగా పెనవేసుకున్న జనం చేతుల వేళ్ళే

(4వ పేజీ తరువాయి)
అక్కడి బిజెపి ప్రభుత్వం వీళ్ళను అదే బస్తర్ అడవుల మీదుగా భద్రాచలం దగ్గర తీసుకవచ్చి వదలి వెళ్ళింది. మధ్యప్రదేశ్ నుండి బహిష్కరించింది. ఇప్పుడు మహారాష్ట్రలోని కాంగ్రెస్ ప్రభుత్వం అదేపని చేసింది. ఖషోగ్గిని ఆహ్వానించిన పాలకవర్గ రాజకీయాలు, అమెరికా యుద్ధ విమానాలకు బొంబాయిలో ఇంధనం సమకూర్చిన ప్రభుత్వ రాజకీయాలు గద్దర్‌ను, జననాట్యమండలిని ఇప్పటికే ఒకటి రెండు రాష్ట్రాల్లో ప్రకటితంగా నిషేధించాయి. ఆంధ్రప్రదేశ్‌లో అప్రకటిత నిషేధం పునః ప్రారంభమై చాల రోజులయింది.

పాలస్తీనాలో పాలస్తీనియన్లను నిషేధించి ఇజ్రాయిల్‌ను ప్రవేశపెట్టిన సామ్రాజ్యవాద నీతికి ప్రజల్లో ప్రజా కళాకారులను నిషేధించి ఖషోగ్గిలకు, యుద్ధ విమానాలకు స్వాగతం పలుకుతున్న నీతికివున్న సంబంధమేమిటి ? ఒక్కమాటలో ఇది సామ్రాజ్యవాద భూస్వామ్య దళారీ నీతి.

పాలస్తీనా పోరాటం నుంచి నిలబడడానికి నేలలేనిచోట తమ తల్లి గర్భంలో ఆశ్రయం తీసుకొని మాతృభూమి కోసం పోరాడుతున్న యుద్ధంగా ప్రజలు ఉత్తేజం పొందుతారు.

భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడుతున్న ప్రజల పక్షాన నిలిచి, ఆడి, పాడి ప్రదర్శనలిస్తున్న కళాకారులకు వాళ్ళ దేశంలోనే ప్రవేశం నిషేధిస్తున్న వాళ్ళ గద్దెలకిందికి మంటలొస్తాయని, వాళ్ళ కాళ్ళకింద పరచిన ఎర్ర తివాచీ ఆహ్వానాలే కాదు, కాళ్ళకింది నేలకూడ కరిగిపోయే ఉప్పెన వస్తుందని హెచ్చరించదంకన్నా ఈ సాదృశ్యాలనుంచి చరిత్ర చూడనేర్వని ఉష్ట్రపక్షులకేం చెప్పగలం.

14 ఫిబ్రవరి, 91.

—సంపాదకుడు

బోరింగ్

—కాడి

ఎర్ర జీపు "తెల్ల" దుమ్మును లేపుతూ ఊరి మధ్యలో వచ్చి ఆగింది. ఆ జీపులో ఇరవై నాలుగు ఇరవైఅయిదు సంవత్సరాల వయస్సు యువకులు నలుగురు, దాదాపు 35 సంవత్సరాల వయస్సు మరో వ్యక్తి ఉన్నారు. అందరూ ఎర్ర చొక్కాలు తొడుక్కున్నారు. జీపుపైన కూడా ఎర్రజెండాలు ఎగురుతున్నవి. అందరి కంటె వయస్సు ఎక్కువ ఉన్న వ్యక్తి వారికి నాయకుడులా ఉన్నాడు. ఫోజు కూడా అలాగే ఉన్నది. జీపు ఎర్రరంగు, జెండాల ఎర్రరంగు వెలిసిపోయి ఉన్నది వారి విప్లవతత్వంలా.

జీపు ఆగగానే ఒక ఎర్రచొక్కా యువకుడు విసురుగా దిగాడు ముఖం చూస్తేనే అర్థం అవుతున్నది జీపు ఈ రెండు మూడు రోజుల నుండే ఎక్కి తిరుగు తున్నట్లు. ఏదో పుష్పక విమానం ఎక్కి తిరుగుతున్న ఫీలింగ్ ఆ ముఖంలో-ఒకసారి ఆ యువకుడు తన హిప్పీకటింగ్ జూలును అటూ ఇటూ విదిల్చి ఎవరైనా కన్పిస్తా రని చూశాడు అటూ ఇటూ-కాని నవంబర్ నెలలో బస్తర్ ఆదివాసులు ఇళ్ళలో ఎవరూ సరిగా ఉండరు. అందరు పొలాల దగ్గరి పాకల వద్దనే ఉంటారు. ముసలి వారు పిల్లలు మాత్రమే ఊరిలో వుంటారు. వీధులలో ఎవరు కనిపించక పోయేసరికి జీపు దిగిన యువకుడు జీపులోకి చూస్తూ "కామ్రేడ్‌సాబ్ ఊరిలో జనాలు ఎవరు ఉన్నట్లు లేరు ఎలాగ" అన్నాడు. మన ఓట్లు ఎలాగ అనే అర్థం ఆ మాటల్లో స్పష్టంగా అర్థం అవుతున్నది. ఆ భావం అర్థం చేసుకున్న కామ్రేడ్ సాబ్ "అయ్యో! కామ్రేడ్ ఎందుకు తొందరపడతావు ఆ రెండిళ్ళ అవతల పిల్లల మాటలు విన్పిస్తు న్నాయి వెళ్ళి చూడు" అంటూ జీపులో కూర్చునే హుకుం జారీ చేశాడు.

తనకెందుకు వినపడలేదు నిజమా అబద్దమా అని మనసులోనే అనుకుంటూ ఆ ఎర్రచొక్కా యువకుడు కామ్రేడ్ సాబ్ చెప్పిన దిక్కు వెళ్ళి చూశాడు. నిజంగానే అక్కడ పిల్లలు ఆడుకుంటున్నారు. ప్రక్కనే ఒక ముసలి రైతు కూర్చున్నాడు వెదురు తడక అల్లుతూ. తాగుబోతుకు కల్లుపాక చూస్తే కలిగినంత ఆనందం కలిగింది ఎర్రచొక్కా యువకునికి. అంతే ఆలస్యం చేయకుండ "లాల్‌సలాం కామ్రేడ్" అంటూ ముసలి రైతుకు అభివాదం చేశాడు. ఒక ఓటు దొరికిందోచ్ అన్నట్లు ఉన్న ఆ లాల్‌సలాం శబ్దం విని "అమ్మయ్య దొరికారు జీపు కూడా ఆపే పోసీయ్"

అంటూ డ్రైవర్‌కు ఆదేశం ఇచ్చాడు కామ్రేడ్ సాబ్. అప్పటివరకు కామ్రేడ్ సాబ్‌కు కూడా ఎవరూ జనాలు దొరకరేమో అని భయంభయంగా ఉండె.

కామ్రేడ్ సాబ్ కూడా జీపు దిగి ముసలిరైతు దగ్గరికి వచ్చేసరికి ఎర్రచొక్కా యువకుడు జనాలందరు ఎక్కడికి వెళ్ళిన విషయం తెలుసుకుంటున్నాడు. ఇంతలో కామ్రేడ్ సాబ్ కూడా అక్కడికి రావడంతో వివరాలు తెలుసుకోవడం ఆపి కామ్రేడ్ సాబ్‌కు రిపోర్టు ఇచ్చాడు. "ఊరి వాళ్ళందరు పొలాల వద్ద ఉన్నారట" అని.కామ్రేడ్ సాబ్ ఒక్క నిమిషం ఆలోచించి "సరే ఈ ముసలోన్ని రైతులందరిని మీటింగ్ కోసం రమ్మనమని పొలాల వద్దకు పంపు. అలాగే థానాగుడి (చావడి) ఎక్కడో తెలుసుకో అందరు వచ్చేవరకు అక్కడే కూర్చుందాము. మీటింగ్ కూడా అక్కడే చేద్దాం" అంటూ మొత్తం ప్రోగ్రాం అంత గుక్క తిప్పుకోకుండా చెప్పేశాడు.

ఆ ఎర్రచొక్కా యువకుడు కామ్రేడ్ సాబ్ ఆదేశాన్ని ఉన్నదున్నట్టు రైతుకు అప్పచెప్పేసి "థానాగుడి ఎక్కడా" అంటూ అడిగాడు. కాని ఊరిలో థానా గుడి కూలిపోయి మూడు సంవత్సరాలు అవుతున్నది. ఊరిలో సంఘంపుట్టి పట్వారు లకు, గార్డులకు దేహశుద్ధి చేయడం ఆరంభం అయ్యాక థానాగుడిని శుభ్రం చేయడం అంతం అయ్యింది. అందుకే అది కూలి దానిచుట్టూ, వాకిట్లో పిచ్చి చెట్లు పిచ్చిగా పెరిగాయి. కూలకుండా కొద్దిగా మిగిలిన భాగాన్ని గొడ్లు, పందులు వాడుకుంటున్నవి. సంఘం పుట్టక ముందు థానాగుడులు మూడుపువ్వులు ముప్పయికాయలగా వర్థిల్లు తుండేవి. ఆ రోజుల్లో థాణాగుడి పొయ్యి ఆరిన రోజు, కోడిపుంజు తెగనిరోజు, కల్లు సీసాల శబ్దం వినపడని రోజు అంటు ఉండపోయేవి. కాని ఈ రోజు థాణాగుడిలో పందుల గురగురలు గొడ్ల పేడ తప్ప ఏమిలేదు. అందుకే థాణాగుడి పేరు వినే సరికి ముసలి రైతు ఆశ్చర్యపోయాడు ఒకసారి ఆ యువకున్ని ఎగాదిగా చూసి "ఇల్లే బాబు మా ఊరిలో థాణాగుడి లేదు. ఊరి వాళ్ళు అందరు వచ్చేవరకు ఇక్కడే కూర్చోండి. మీటింగ్ ఇక్కడే చేయవచ్చు" అంటూ ఇంట్లో నుండి ఒక మంచం తెచ్చి కూర్చోవడానికి ఇచ్చి పొలాలవైపు బయలుదేరాడు ఊరి వాళ్ళందరిని పిలవ డానికి. అంతకంటే మించి చేసేది ఏమీ లేక కామ్రేడ్లు అందరు వచ్చి మంచంలో కూల బడ్డారు.

ముసలిరైతు ముందుగా గ్రామ సంఘం అధ్యక్షుడు మూఖాల్ ఖేతుల్ (పాక) కాడికి బయలు దేరాడు. వెనకటికాలం అయితే ఇటువంటి కబుర్లు ముందుగా పటేల్‌కు

సర్పంచ్ కు చేరేవి. కాని కాలం మారింది బలం సంఘానికి చేరింది. మూఖాల్ అప్పుడే అన్నం తిని కాసేపు ఒరుగుదామని కూర్చున్నాడు. గ్రామంవైపు నుండి ముసలి రైతు తన పాకవైపే వడివడిగా రావడం చూసి అనుమానంగా లేచి నిల్చున్నాడు. ఈ మధ్య పోలీసులు మూఖాల్ గురించి తిరుగుతున్నారు. అప్పటి నుండి జాగ్రత్తగా ఉంటున్నాడు. ఊరిలోకి పోలీసులు రాలేదు కదా కొంపదీసి అని అనుకుంటుండగానే ముసలిరైతు దగ్గరికి రానే వచ్చాడు. "బాత పేపి (ఏంటి పెద్దనాన) ఊరిలోకి పోలీసులు వచ్చిండ్లా ఏంది" అంటూ మూఖాలే ముందు ప్రశ్నించాడు ఆతృతగా. "లేదు కాని ఎవరో చూస్తే పైకాల్ (ఉద్యోగులు) లెక్క ఉన్నారు కాని లాల్ సలాం అంటున్నారు. వాళ్ళు వచ్చిన జీపు మీద కూడా మన ఎర్రజెండాలు ఉన్నవి. ఊరి వాళ్ళందరికి కబురు పెట్టు మీటింగ్ చేయాలి అంటున్నారు. మన అన్నల మనుషులేమో ?" అంటూ మూఖాల్ ప్రశ్నకు సమాధానంతో పాటు తన అనుమానపు అభిప్రాయాన్ని కూడా వ్యక్తపరిచాడు ముసలి రైతు. ఆ ఎర్రచొక్కా యువకుడు లాల్ సలాం అన్నకాడి నుండి తైతు వాళ్ళు ఎవరైనది తేల్చుకోలేక సతమతమవుతున్నాడు.

కాని మూఖాల్ కు అంతా అర్థం అయ్యింది అందుకే వెంటనే "వాళ్ళు అన్నగాళ్ళు కాదు బొన్నగాళ్ళు కాదు. వాళ్ళు ఓట్ల కోసం వచ్చిండ్లు. అసలు బాబాల్ (తండ్రి) భీమారై మూలకు పడి నేను పొలం పని మీద పడేసరికి మీటింగ్ ఆలస్యం అయ్యింది. మొన్ననే ఊరి వాళ్ళందరికి మీటింగ్ చేసి ఈ ముచ్చట చెప్పేది ఉండె." అన్నలు మొన్న ప్రక్క ఊరికి పిలిపించుకుని చెప్పిన విషయాలను గుర్తుచేసుకుంటు అన్నాడు మూఖాల్. మళ్ళీ ఒక్క నిమిషం ఆగి "సరే నువ్వు దేవాల్ వద్దకు వెళ్ళి ఈ విషయం చెప్పి ఆ పక్కపాకల వద్ద రైతులందరిని తీసుకుని అలా రండి. నేను ఈ పక్క వాళ్ళందరిని తీసుకుని వస్తాను" అంటూ గుంజకు ఉన్న చొక్కా తీసుకుని భుజం మీద వేసుకుని ఇవ్వాళ వీళ్ళను ఆట పట్టించాలి అని మనసులో అనుకుంటూ బయలుదేరాడు.

ముసలిరైతు దేవాల్ వద్దకు వెళ్ళి మూఖాల్ చెప్పిన విషయం అంతా చెప్పాడు. దేవాల్ సంఘం గ్రామ కార్యదర్శి. దేవాల్ కూడా చురుకైన యువకుడే, గ్రామంలో సంఘం పుట్టినకాడి నుండి సంఘంలో పని చేస్తూ వస్తున్నాడు. పెద్ద

మనుషులు ఎన్ని అడ్డంకులు కల్పించినా ఎన్నడూ సంఘాన్ని వదలలేదు. దొంగ కమ్యూనిస్టుల మాట వినేసరికి దేవాల్‌కు కూడా ఒళ్ళు మండింది. ఎందుకంటె వీళ్ళు ఓట్లు అప్పుడు, తునికి ఆకు కాంట్రాక్టర్ల వద్ద చందాలు వసూలు చేసేటప్పుడు తప్ప ఎన్నడూ గ్రామాలకు రారు. ఎన్నడూ ఏ సమస్య పట్టించుకోరు. పైగా అన్నలం (దళం) మేము ఒకటేనంటూ ఓట్లు దండుకుంటు, షావుకార్ల వద్ద చందాలు వసూలు చేస్తూ బతుకుతున్నారు. దేవాల్ కూడా ఇవ్వాళ వీళ్ళ సంగతేందో తేల్చుకోవాలి అనుకుంటూ బయలుదేరాడు రైతులను జమచేయడానికి.

చూస్తూ చూస్తూ ఉండగానే "కామ్రేడ్లు" కూచున్న ముసలి రైతు ఇంటి చుట్టూతా ఉన్న ఇండ్ల వద్ద రైతులు జమకావడం మొదలైంది కాని రైతులెవరు కామ్రేడ్ల దగ్గరికి మాత్రం పోవడం లేదు. రైతులు జమకావడం చూచి కామ్రేడ్ సాబ్‌కు ఎంతో సంతోషమైంది. ఒక ఎర్రబొక్కా యువకుడు ఒక్క ఓటు రెండు ఓట్లు అంటూ ఓటు వయస్సు ఉన్న వారిని లెక్కపెడుతున్నాడు. మిగతా కామ్రేడ్లు కుంభకర్ణ నిద్రలో ఉన్నారు. చాలా మందే వస్తున్నారు కాని వేరే ఇండ్ల వద్ద జమ అవుతున్నారు. దగ్గరికి రావడం లేదు లాల్ సలాం అనడం లేదు ఏంటి అని ఆశ్చర్యపోయాడు కామ్రేడ్ సాబ్. ఇక తనే చొరవ చేయాలనుకున్నాడు "అందరికి లాల్ సలాం దాద" అంటూ బిగ్గరగా అరిచాడు కాని ఎటువంటి ప్రతిస్పందన కనిపించ లేదు. ఇంతలో మనస్సులో తళుక్కున ఒక ఆలోచన మెరిసింది. వెంటనే పడు కున్న వాళ్ళను లేపి "ఏయ్ కామ్రేడ్స్ ఆదేదో అన్నగాళ్ళ పాట కొంత కొంత వస్తది కదా ఆ పాట పాడండి పాట విని అయినా జనం దగ్గరికి వస్తారు" అన్నాడు.

లేచిన యువకులు నిద్ర మత్తులోనే జోగుకుంటూ ఆ వచ్చీరాని పాటను గార్దభరాగంలో ఎత్తుకున్నారు. పాట విని జనం రావడం ఏమోకాని కొద్ది దూరంగ ఉన్న పిల్లల గుంపు పగలబడి నవ్వేసరికి పాడేవాళ్ళ గొంతులకు సడెన్‌బ్రేక్ పడ్డది. ముఖాలన్ని సిగ్గుతో వాడిపోయినయి. ఇక లాభం లేదని కామ్రేడ్ సాబ్ తనే లేచి "కామ్రేడ్స్ అందరు ఇక్కడికి రండి నేను మీటింగ్ చేస్తాను. మేము ఎవరమోకాదు మేము వాళ్ళు ఒకటే రండిరండి" అంటు అన్నలు మేము ఒకటే అనే అర్థంలో అన్నాడు. అయినా జనంలో ఉలుకు లేదు పలుకు లేదు. పాపం కామ్రేడ్ సాబ్‌కు తెల్వదు వారు ఎవరి గురించి ఎదురు చూస్తున్నారో. వాళ్ళంత సంఘం కమిటీ, గ్రామరక్షణ దళం రాక గురించి ఎదురు చూస్తున్నారు. సంఘం కమిటీ, గ్రామరక్షణ

దళం ఎవరెవరు ఏ పని చేయాలో పనివిభజన చేసుకుని వచ్చేసరికి కొద్దిగా ఆలస్యం అయ్యింది.

మూఖాల్ వస్తూనే కామ్రేడ్ సాబ్ కూర్చున్న దగ్గరికి వచ్చి అతను కూర్చున్న మంచంలో ఎక్కి నిలబడ్డాడు. ఒకసారి అటూ ఇటూ చూసి "కామ్రేడ్స్ అందరు దగ్గరికి రావాలి" అంటూ బిగ్గరగా పిలిచాడు. ఆ ఇంటి వద్ద ఈ ఇంటివద్ద కూర్చున్న రైతులు కమిటీ వాళ్ళు రావడం చూస్తూనే లేచి అంతకు ముందు కూర్చోవడానికి పరుచుకున్న తువ్వాలలు తీసి దులుపుకుని భుజాలపై వేసుకుని మూఖాల్ వైపు బయలుదేరారు. మిగతా కమిటీవాళ్ళు గ్రామరక్షణ దళం వాళ్ళు మూఖాల్ పక్కకు వచ్చి నిలబడ్డారు "అల్లాట్ ఒంది పాట పాసకల్ మున్నె" (సరే ఒక పాట పాడుదాం ముందు) అని మూఖాల్ అనేసరికి ప్రక్కన నిల్చున్న కమిటి వాళ్ళు, ఇంతకు ముందు ఎర్రచొక్కాల వాల్లు గతుక్కుంటు పాడిన పాటనే ఎంతో శ్రావ్యంగా ఎత్తుకున్నారు. దూరంగ ఉన్న పిల్లల గుంపు ఉరికి వచ్చి పాడు తున్న వారి వెనక నిలబడి కోరస్ ఇవ్వడం మొదలుపెట్టారు. ఎర్ర చొక్కాల వాళ్ళకు అప్పుడు అర్థం అయ్యింది. ముందు పిల్లలు ఎందుకునవ్వారో —

కామ్రేడ్ సాబ్‌కు మాత్రం అంతా గందరగోళంగా ఉంది. ఈ మంచం ఎక్కినవాడు ఎవడోకాని చెయ్యికలపబోతే చెయ్యి కలపడంలేదు. లాల్‌సలాం అంటే కూడా చప్పుడు చేయడం లేదు. అసలు మేము ఇక్కడ ఉన్నాము అన్న విషయం ఎరగ నట్లే ప్రవర్తిస్తున్నారు ఏమన్నా చేస్తారా ఏంటి అని ఆలోచించసాగాడు. కామ్రేడ్ సాబ్‌కు సన్నగా భయం ప్రారంభం అయ్యింది. అయినా ధైర్యం కూడ తీసుకుని ఈ పాట అయిపోగానే ఈ మంచం స్టేజి ఎక్కి తన వాగ్ధాటితో ఈ జనాన్ని అంతా ఆశ్చర్యపరిచి ఆఖరికి ఓట్ల విషయం చెప్పేస్తే సరిపోతది అని అనుకున్నాడు. ఇక ఎర్రచొక్కా యువకులకు ఏమి అర్థం కావడం లేదు. ఈ ఏరియా అంతా మనదే అంటూ పూల మాలలతో స్వాగతమిస్తారు అనే విధంగా చెప్పాడు కామ్రేడ్ సాబ్ ఇక్కడ చూస్తే స్వాగతాలు ఏమోకాని సాపు చేసే విధంగా కనిపిస్తున్నది అని మనసులోనే అనుకుంటూ భారమంతా భగవంతుని మీద వేసి కూర్చున్నారు భయం భయంగా.

ఇంతలో పాట అయిపోయింది ఒక్క క్షణం నిశ్శబ్దం నెలకొన్నది. ఇదే అదను అనుకుని కామ్రేడ్ సాబ్ మంచం ఎక్కడానికి మంచంపై ఒక కాలువేసి మీదికి లేవబోయాడు కాని మంగ్లు వెంటనే సాబ్ కాలర్ పట్టుకుని కిందికి లాగి

"జామ్ కొట్టోమస్ ఓరు తిరియితోర్" (కొద్దిసేపు మొదలకుండా ఉండు అతను మాట్లాడుతాడు) అన్నాడు కోపంగా. తను ఆలోచించినట్లుగానే జరిగేటట్టు ఉంది అనుకునేసరికి భయం కొస్త వణకుగా మారింది. అసలే మంగ్లు భుజానికి ఒక బర్మార్ కూడా ఉంది అతను గ్రామ రక్షణదళ కమాండర్.

మూఖాల్ గొంతు సవరించుకుని "కామ్రేడ్స్ నేడు బాత మీటింగ్ ఇత్కె" (ఇవ్వాళ ఏమి మీటింగ్ అంటె) అంటు మొదలుపెట్టి ప్రభుత్వ ఎన్నికల ప్రకటన గురించి చెప్పి ఎన్నికల బూటకత్వం వివరిస్తూ ఎన్నికలను బహిష్కరించాలని రైతులను కోరాడు. దోపిడి వర్గ పార్టీల బూటకపు వాగ్దానాలను ఎండగడ్తూ వాళ్ల ఆచరణను ఉదాహరణలతో అర్థం చేయించాడు ప్రజలకు ఎన్నో ఏండ్లనుండి ఓట్లు వేస్తున్నా, అన్ని సంపదలు ఉన్న బస్తర్ ఎందుకు వెనకబడి ఉందో చెప్తూ పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గం అంటూ వివరించాడు. ఈ ఉపన్యాసం అంతా వింటున్న కామ్రేడ్ సాబ్‌కు మతిపోయినంత పని అయ్యింది. బస్తర్‌లో ఈ మారుమూల గ్రామంలో ఒక ఆదివాసి యువకుడు ఈ విధంగా ఉపన్యసించడం నమ్మలేకపోతున్నాడు. ఇక ఇక్కడ ఓట్లు అడగడం అంటే తన్నించుకోవడమే అవుతుంది. కిమ్మనకుండా పోవడమే మేలు అని కామ్రేడ్ సాబ్ అనుకుంటుండగానే "అయితే ఇప్పుడు వీళ్ళు మనల్ని ఓట్లు అడగడానికి వచ్చారు. కాబట్టి ఇన్ని సంవత్సరాల నుండి ఎన్నికలలో పాల్గొంటు మనకోసం ఏమేమి చేశారో వీళ్ళను అడుగుదాం. సరిగ్గా చెప్పితే మీటింగ్ చేసుకోనిద్దాం లేకపోతే ఇక్కడి నుండి తోకపీకాల్సిందే మీరంతా ఏమంటారు" అంటూ మూఖాల్ జనాన్ని అడగడం కామ్రేడ్ సాబ్‌కు వినపడ్డది పిడుగుపడ్డట్టుగా. ఇంకా జనం అంతా అంతే అనడంతో సాబ్‌కు గుండె గాభరా ఎక్కువైంది.

మీటింగ్ పెట్టుకోనియ్యకపోతె పోనియ్ జీపెక్కి ఈల పాట పాడుకుంటు హాయిగా పోతాం కాని ఏమేమి చేశామో చెప్పాలంటున్నాడు వీడు. ఎక్కడ తలనొప్పిరా నాయనా ఎరక్కపోయి వచ్చి ఇరుక్కున్నట్లు అయింది. అన్నలం మేము ఒకటే అన్నా వినే రకంగాలేరు వీళ్ళు. ఇప్పుడు ఏం చేయాలి అనుకుంటు ఆలోచనలలో సతమతమవుతుండగానే కామ్రేడ్ సాబ్‌ను "ఏయ్ కామ్రేడ్ నిన్నే ఇప్పుడు మీరు రైతుల బతుకుల కొరకు ఏమేమి చేశారో చెప్పండి" అన్నాడు కామ్రేడ్ అనే పదాన్ని వ్యంగ్యంగా పలుకుతు మూఖాల్. ఏం చెప్పాలో తేల్చుకోక ముందే ప్రశ్న

వచ్చి మీద పడడంతో ఆపద్ధర్మంగా ఏదో ఒకటి చెప్పక తప్పక "ఆఁ ఆఁ ఏంటి మేం ఏం చెయ్యలే దనుకుంటున్నారో మేం చెయ్యబట్టే జంగలోళ్ళు, (ఫారెస్టు డిపార్టుమెంటు) మీరు అడవి నుండి ఎన్ని కట్టెలు తెచ్చుకున్నా, కొత్త కొత్త ఇండ్లు కట్టుకున్నా రూపాయలు వసూలు చేయడం లేదు. మేం చెయ్యబట్టే పట్వార్లు మిమ్మల్ని తిప్పలు చేయడం లేదు. మేం— చెయ్యబట్టేఅంటూ ఇంకా ఏదో కొనసాగించ పోబోయాడు కాని ఇంతలో ఒక రైతు లేచి అడ్డు తగులుతు "ఎహె ఎవడ్రా నువ్వు ఎన్నడూ నీ మొఖం కూడా కనిపియ్యలేదు. యాడకూచోని నువ్వు ఇవన్ని చేసి నవ్‌రా" అంటూ కోపంగా అడిగాడు. జనాలంతా కూడా తలా ఓ మాట తిట్టడం మొదలుపెట్టారు. సాబ్‌కు చెమటలు కారడం మొదలుపెట్టింది. అటూ ఇటూ బిత్తర చూపులు చూస్తూ ఉండగా దూరంగా ఒక బోరింగ్ కనిపించింది. వరదలో కొట్టుక పోయే చీమకు దుంగ దొరికినట్లు అయ్యింది సాబ్‌కు. వెంటనే "ఆఁ మీ ఊర్లో బోరింగ్ ఎవరు వేయించిండ్లు అనుకుంటున్నారు మేమే కలెక్టర్‌తో ఎంత గొడవ పడితే కాని ఈ ఊర్లన్నిటికి బోరింగ్‌లు రాలేదు తెలుసా" అన్నాడు తన తెలివికి తనే మురిసిపోతూ, కలెక్టర్‌తో గొడవపడ్డది లేనిది అయితే జనానికి తెల్వదు అనేది సాబ్‌ధీమా కాని సాబ్ మాటలు విన్న జనం పగలబడి నవ్వడం మొదలు పెట్టారు.

నవ్వులను ఆపుతూ మూఖాల్ అందుకున్నాడు "ఏయ్ బోరింగ్ ఎవరు వేయిం చింది. ఎందుకు వేయించింది కూడా మాకు తెల్సు. అయినా కొద్దిసేపు నువ్వే వేయిం చావు అనుకుందాం అయితే ఏంది నీ బోరింగ్‌తో మా కడుపు నిండిందా ? లేకపోతే బోరింగ్ ఉంటె అన్నం తిననక్కర లేదా ? ఈ ఊర్లో ఇంతకుముందు బోరింగ్ లేకున్నా బతికాము చావలేదు. కాని భూమి లేకుండా మేము బతకలేము. ఆ భూమి కోసం ఇక్కడ మేము ఇండ్లు వేసుకున్నప్పుడు, మేం అడవి నరికి పోడు చేసు కున్నప్పుడు నువ్వు ఎక్కడ ఉన్నావు? ఫారెస్టు వాళ్ళు వచ్చి మా ఇండ్లు కాలబెట్టి మేం నరికిన భూమిలో ప్లాంటేషన్ వేసినప్పుడు ఎక్కడఉన్నావు? మేం సంఘంలో సంఘటిత పడి ఫారెస్టు వాళ్ళ జులుంను తిప్పికొట్టినప్పుడు ఎక్కడ ఉన్నావు ? నువ్వు ఎప్పుడు ఎక్కడా కూడా మా అసలు సమస్యను పరిష్కరించడంలో లేవు. నీ సమాధానం మాకు ఒప్పదు. ఇక మా ఊరు బోరింగ్ విషయానికి వస్తే అది పని చేయడం బంద్ అయ్యి ఎనిమిది నెలలు అవుతున్నది. ఇప్పుడు వాగులో తీసిన

చెలిమలోని నీరే తాగుతున్నాము మేము. బోరింగ్ పేరు మళ్ళీ చెప్పితే తన్నులు తింటావు" అన్నాడు తన దీర్ఘమైన సమాధానాన్ని ముగిస్తూ-

కామ్రేడ్ సాబ్‌కు అప్పుడు అర్థం అయ్యింది తను బోరింగ్ మేమే వేయిం చాం అనేసరికి జనాలంత ఎందుకు నవ్వారో. అంతేకాదు ఇక చేతులెత్తి ఓటమిని అంగీకరించి తిరోగమించడమే ఉత్తమమని కూడా అర్థం అయ్యింది. అంతే వెంటనే "కామ్రేడ్స్ మేం తెలవక వచ్చాము. మిమ్ములను ఓట్లు అడిగేందుకు మాకు ఎలాంటి అర్హత లేదు. మేము మీ ఊరిలో మీటింగ్ చెయ్యం ఇక వెళ్ళిపోతున్నాము" అంటు ప్రకటించాడు నీళ్ళు నములుతూ విత్తరచూపులు చూస్తూ-

× × ×

ఒక్కొక్క ఊరు దాటుతున్న కొద్ది ఒక్కొక్క డిగ్రీకోపం పెరుగుతున్నది మన్యూరాం సోడిలో. జీపులో ముందు సీట్లోనే కూర్చున్నాడు కాని ముందుకు చూడ డం లేదు. ఏదైనా ఊరు రాగానే కుడి ఎడమలకు వంగి వంగి చూస్తున్నాడు జీపులో నుండే. ఎక్కడా ఒక్క నినాదం కనిపించడం లేదు. ఒక్క పోస్టర్ ఒక్క జెండా కూడా కనిపించడం లేదు. మనసులోనే పండ్లు నూరడం మొదలుపెట్టాడు సోడి "దొంగ వెధవలు వేలకువేల రూపాయలు దొబ్బారు. ఒక్క పోస్టర్ కూడా వేయించ లేదు. అప్పారావుగాడు ఎంత మోసం చేశాడు. ఇవ్వాళ వీడి సంగతేంటో తేల్చు కోవాలి" అని అనుకుంటుండగానే "సార్ గొల్లపల్లి వచ్చింది ఎన్నికల ఆఫీసు కాడికి పోనియ్యమంటారా జీపును" అంటు ప్రశ్నించాడు డ్రైవర్ "ఆఫీసు కాడికా ? వద్దు అప్పారావు ఇల్లు తెలుసు కదా అక్కడికే పోనియ్" అంటు డ్రైవర్‌ను ఆదే శించాడు. అప్పారావును ఏమేమి ప్రశ్నలు అడగాలో మనసులోనే తయారవుతుసోడి.

అప్పారావు అప్పుడే టిఫిన్ ముగించి టీ తాగివచ్చి ముందుగదిలో కూర్చు న్నాడు. బుర్రుమంటు సోడి జీపువచ్చి అప్పారావు ఇంటిముందు ఆగింది. అప్పారావు కూడా రెండు రోజులనుండి సోడి గురించే ఎదురుచూస్తున్నాడు. ఎదురు చూడడమే కాదు రెండు రోజులనుండి సోడివచ్చి అడిగే ప్రశ్నలను ఊహించుకుంటూ వాటికి సమాధానాలను తయారు చేసుకుంటున్నాడు. జీపును చూడగానే లేని ఆదరాబాదరాను తెచ్చిపెట్టుకుని జీపు దగ్గరికి వెళ్ళి "రండి రండి చాలా ఆలస్యం అయ్యింది మీకోసమే ఎదురు చూస్తున్నాను" అంటూ ఇంట్లోకి ఆహ్వానించాడు అప్పారావు. ఎందుకు మరో రెండు మూడు వేలకు గాలం వేద్దామనా ? అని మనసులోనే కసిగా అనుకున్నాడు.

మీదికి మాత్రం "అ ఏంలేదు. చాలావని ఉండడంవల్ల ఆలస్యం అయ్యింది" అంటూ జీపు దిగి అప్పారావును అనుసరించాడు సోడి. ఎంత కనబడనీయ వద్దనుకున్నా చిర్రు బుర్రు బయట పడుతూనే ఉంది సోడిలో -

ఇద్దరు ఎదురెదురుగా కుర్చీలలో కూలబడ్డారు. ఆలస్యం చేయకుండా అప్పారావు లేని అప్యాయతను అంత ఒలకపోస్తూ "టిఫిన్ చేశారా లేదా సార్ ఏం తీసుకుంటారు"....,అంటూ ఇంకా ఏం తాగుతావు అని కాబోలు అడగబోయాడు. కాని కళ్ళనిండ ఎన్నికలే నిండి ఉన్న సోడి ఎన్నికల ప్రచారం గురించే తేల్చుకోవాలనుకున్నాడు అందుకే అప్పారావు మాటలను మధ్యలోనే తుంచేస్తూ "ఇప్పుడు నాకు టిఫిన్‌లు టీలు తాగే తీరిక లేదుకాని నీ ఏరియాలో ఎక్కడ ఎన్నికల ప్రచారం కనిపించడం లేదేం ? ఎక్కడ ఒక్క పోస్టర్, జెండా కూడా కనిపించడం లేదు. అసలు నేను ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నావా ఓడిపోవాలనుకుంటున్నావా" అంటు గుక్కతిప్పుకోకుండా కోపాన్నంత వెళ్ళగక్కాడు సోడి- తీసుకున్న డబ్బుల గురించి కూడా అడుగుదామనుకున్నాడు. కాని ఈ ఏరియాలో సోడికి ఉన్న ఒకే ఒక అధారం అప్పారావు. అందువల్ల డబ్బు విషయంలో గట్టిగా పట్టుబడితే అప్పారావు వ్యతిరేకంగా మారినా మారవచ్చు అప్పుడు మొదటికే మోసం వస్తుందని డబ్బు మాట ఎత్తలేదు- చిర్రుబుర్రులాడో చివాట్లుపెట్టో పని నడిపించుకోవాలికాని పని కుంటుపడేలా చేసుకోవద్దు అనేది సోడి విధానం.

కాని అప్పారావుకు ముందు నుయ్యి వెనక గొయ్యిలా ఉంది. ఇక సోడి ఏమనుకున్నా పర్వాలేదనుకుని అసలు విషయంలోకి దిగాడు. అప్పారావు గొంతు సవరించుకుంటు "చూడండి సార్ మీరు ఎంత చిర్రు బుర్రులాడినా కొరాలు మిరియాలు నూరినా నేను ఏమి చేయలేను. ఇది నక్సలైట్ల ఏరియా అని మరిచిపోతున్నారు. జనం తెలివి అయిపోయినారు. వెనకటిలాకాదు, ఇప్పుడు ఓట్లు అడగపోతే ఎందుకు వేయాలి, మీరు మాకేం చేశారు అంటు నిలదీస్తున్నారు జనం. ఇక సంఘాల నాయకులైతే ఉద్యోగాలకోసం పోయిన వాళ్ళను ఇంటర్‌వ్యూ చేసినట్లు చేసి జనంలో సిగ్గు తీస్తున్నారు. మీరే చెప్పండి జనాలకు ఏం చెప్పి ఓట్లు అడగమంటారు" అంటూ తన బాధనంత సోడిముందు పరిచాడు.

సోడి ముందు తత్తరపడి అపైన గుర్తుకు వచ్చి యురెకా అనుకుంటు "అ(జనానికి మనం ఏమి ఎందుకు చేయలేదు. ఊరూరుకు బోరింగ్ ఎవరు వేయించారు.

మనం బోరింగ్‌లు వేయించకపోతే జనం నీళ్ల లేక చచ్చేవాళ్ల తెలుసా? జనం అడిగినప్పుడు ఈ విషయం ఎందుకు చెప్పలేవు" అంటు ఎదురు ప్రశ్న వేశాడు. తను కనుగొన్న ఈ కొత్త విషయానికి నోబుల్ ప్రైజ్ వస్తదన్నంత సంతోషపడిపోతూ. కాని అప్పారావు మాత్రం విచిత్రంగా నవ్వాడు. అ నవ్వి ఓరి దద్దమ్మా ఆ చచ్చు విషయం నాకు తెలివదనుకుంటున్నవా అన్నట్లుంది.

ఒకసారి దీర్ఘంగా శ్వాస తీసుకుని మొదలుపెట్టాడు అప్పారావు "అయ్యో సొదు బోరింగ్ విషయం చెప్పితే జనాలు మన తలలో బోరింగ్ వేస్తారు. బోరింగ్‌ల సిద్ధాంతం జనానికి బోర్ కొట్టింది. ఇప్పుడు జనాలు బోరింగ్‌లు, స్కూళ్ళు, అంగన్ వాడీలు, బ్యాంక్ రుణాలు కాదు ముఖ్యంగా అడిగేది. వాళ్ల భూములు అడుగుతున్నారు అడవి నరికి చేసుకున్న భూములకు పట్టాలు అడుగుతున్నారు. భూమి లేకుండా మిగతావన్ని మాకు దండుగే అంటున్నారు. గతంలో గిరిజనులందరు అడవి కొట్టి చేసుకున్న భూములకు పట్టాలు కావాలని దరఖాస్తులు ఇస్తే పోలీస్ సేషన్‌కు పంపిస్తామని మన ప్రభుత్వం, ఫారెస్టు డిపార్ట్‌మెంట్ వాళ్ళు బెదిరించారు. అదే నక్సలైట్లు వచ్చి సంఘాలు పెట్టి గిరిజనులను ఏకం చేసి భూమి లేని వారిని అడవి కొట్టుకుని భూమి చేసుకోండని పోరాటం మొదలుపెట్టారు. భూమి సమస్యకు పరిష్కారం చూపించారు. సంఘాల బలం ముందు రేంజర్లు, పట్వార్లు పిక్కబలం చూపించారు. అందుకే గిరిజనులు అన్నల మాటే వింటున్నారు. బోరింగ్ అంటు మొదలుపెడితే బుర్ర బద్దలు కొడతారు జనం" అంటూ ఆగకుండా ఒక చిన్న ఉపన్యాసం దంచేశాడు సోడిని అదరగొడుతు. అప్పుడు కాని అర్థం కాలేదు సోడికి, ఫూల్ చాప్ (బి. జె. పి.) కశ్యప్ ఉత్తర బస్తర్‌లో అడవికొట్టి భూములు చేసుకోండి మేము అధికారానికి వస్తే పట్టాలు ఇస్తామంటు ఎందుకు ప్రచారం చేస్తున్నది.

సోడి అయోమయంలో పడిపోయాడు "అయితే ఈ ఏరియాలో ఓట్లమీద ఆశ వదులుకోవల్సిందే అంటావా? మరి సిపిఐ వాళ్ళు ఎలా చేస్తున్నారు" అంటు అనుమానంగా అడిగాడు. 'సిపిఐ వాళ్ళా? మొన్న ఈ ఏరియాలో ఓ గ్రామంలో గ్రామ రక్షణ దళానికి దొరికి చావు తప్పి కన్ను లొట్టపోయి పారిపోయినారు. ఇప్పుడు వాళ్ళు సుక్మ ఏరియాలో నక్సలైట్లు తిరగని గ్రామాలలో నక్సలైట్లు మేము ఒకటే అన్నలు మాకే ఓటు వేయమన్నారు అంటు ఓట్లు దండుకునే ఉపాయం చేస్తున్నారు. అంతగా తెలియని జనాలు నమ్ముతున్నారు కూడా. అందువల్ల సుక్మ ఏరియాలో

సిపిఐ వాళ్ళు లాభపడవచ్చు కాని ఈ కుంట ఏరియాలో మాత్రం జనం, ఎవరికి ఓట్లు వేయరు" అంటూ సిపిఐ వాళ్ళ కథ అంత ఏకరువు పెట్టాడు అప్పారావు. ఆశ చావని సోడి "మరి ఎలా చెయ్యటం" అంటూ మళ్ళీ అడిగాడు. సోడి పరిస్థితిని అర్థం చేసుకున్న అప్పారావు "వచ్చే బుధవారం గొల్లపల్లి సంతకు చుట్టు పక్కల ఊర్ల నుండి గిరిజనులు వస్తారు. సంతలో బహిరంగంగా మీటింగ్ చేయలేను కాని విడి విడిగా పెద్దమనుషులను కలిసి మనకే ఓటు వేయించమని చెప్పి చూస్తాను". అంటూ ఓదార్పుగా చెప్పాడు. మనవడు జీవగంజి పోసిన తరువాత బొమ్మ ప్రాణం తృప్తిగా పోయినట్లుగ సరే అలాగే కానివ్వు" అంటూ కుర్చీలో నుండి లేచాడు సోడి.

× × ×

1989 నవంబర్. స్కూలు బిల్డింగ్‌లో ఎస్.ఐ. అటు ఇటు తిరుగుతున్నాడు. చేతులు గట్టిగా గుద్దుకుంటు. ఎన్నికల అధికారి, సిబ్బంది బ్యాలట్ పెట్టెల ముందు కూర్చుని దోమలను తిట్టుకుంటు కొట్టుకుంటున్నారు. హవల్దార్ ఇద్దరు సిపాయిలు బీడీలు ముట్టించి దోమలపైకి పొగను ఊదుతున్నారు. ఊరేగింపుల మీద టియర్ గ్యాస్ వదిలినట్లు. పన్నెండు కావడానికి దగ్గర పడుతున్నది కాని ఇంతవరకు ఓటు వేయడానికి ఒక్కరు కూడా రాలేదు. జనాలు అందరు ఊరిలోనే ఉన్నారు. స్కూలు ముందు నుండె అటు ఇటు తిరుగుతున్నారు. కాని స్కూలు దిక్కు చూడనైనా చూడడం లేదు. అసలు ఇవ్వాళ ఎన్నికలు అనే విషయం ఎరగనట్లే ప్రవర్తిస్తున్నారు.

టైము పెరుగుతున్న కొలది, జనం ప్రవర్తన చూస్తున్న కొలది ఎస్.ఐ. కి కోపం విపరీతంగా పెరిగిపోతున్నది. గతంలో ఊరిలోకి పోలీసులు వస్తే ఎంత ఆర్భాటం జరిగేది. మంచాలు, కోళ్ళు, కల్లు సీసాలు పరుగెత్తుకుంటు వచ్చేవి. ఇప్పుడు ఒక్కడు నమస్తే సార్ అనికూడా అనడం లేదు. తలుచుకున్న కొలది ఒళ్ళు మండిపోతున్నది ఎస్.ఐ. కి. "దొంగ లంజకొడుకులు తినేది మొగడిసొమ్ము పాడేది రంకుమొగని పాట. సర్కారేమో బోరింగులు అవి వేయిస్తది. వీళ్ళేమో నక్సలైట్ల మాట వింటరు" అంటూ పోలీసుల భాష మొదలుపెట్టాడు ఎస్.ఐ.

"అసలు ఊరి బయట ఆ ఎన్నికలను బహిష్కరించండి అనే పోస్టరును చూచినప్పుడే అనిపించింది నాకు ఈ ఊరిలో ఓట్లు పడేటట్లు లేవని" అన్నాడు

ఎన్నికల అధికారి తనకు అన్ని విషయాలు ముందే తెలుస్తవి అన్నట్లు ఫోజు పెడుతు హవల్దార్ ఇద్దరు సిపాయిలు మాత్రం తక్కువ ఫోర్సు వచ్చాము కనుక ఏ గొడవ లేకుండ ఇక్కడి నుండి సురక్షితంగ పోతే చాలునని ఆలోచిస్తున్నారు. కాని ఎస్.ఐ. వాలకం చూస్తే హవల్దార్‌కు భయం ఆవుతున్నది. వీడు జనంతో గొడవ పెట్టుకుని అందరికీ తన్నులు తినిపించడు కదా అని హవల్దార్ అనుకుంటుండగానే "ఏయ్ హవల్దార్ నువ్వు ఈ ఇద్దరు పోలీసులను తీసుకెళ్ళి ఊరి వాళ్ళందరిని తీసుకురండి స గతేందో తేల్చుకుందాం" అన్నాడు కోపంగా హుకుం జారీచేస్తూ ఎస్.ఐ. హవల్దార్‌కు ఎస్.ఐ. మాటలు వింటె ఏం జరుగుతుందో అర్థం ఆయిపోయింది. జరగబోయే ప్రమాదాన్ని నివారించడం కోసం ధైర్యం తెచ్చుకుని "సార్ ఊరిలో పరిస్థితి మంచిగ లేదు. ఒత్తిడి చేస్తే ఓట్లు వేసేలా లేరు జనం. అందరు ఒక్కమాట మీద ఉన్నారు. నేను అప్పుడు కటూల్ (మంచం) కోసం కాంప్రేడ్ అనాల్సి వచ్చింది. ఇంతకు ముందే మన సిపాయి వెళ్ళి లాల్‌సలాం దాద అంటె కాని ఖిందెడు నీళ్ళు దొరకలేద. మనం ఒత్తిడిచేస్తే జనం తిరగబడవచ్చు. జనం వెనకటిలా లేరు. మనం నలుగురమే ఉన్నాము మరోసారి ఎక్కువ ఫోర్సు తీసుకువచ్చి వీళ్ళ సంగతి తేల్చుకోవచ్చు. ఇప్పుడు కామ్‌గా వెళ్ళిపోతేనే మంచిది సార్" అంటూ హవల్దార్ పరిస్థితిని తన అంచనాను, అనుభవాన్ని అంత రంగరించి ఎస్.ఐ.కి అర్థం చేయించడానికి ప్రయత్నించాడు.

హవల్దార్ సర్వీస్‌కంటె తక్కువ సర్వీస్ ఉన్న ఎస్.ఐ.కి హవల్దార్ మాటల్లో నిజం ఉన్నట్లు అనిపించలేదు. హవల్దార్ కావాలని తనను భయపెట్టాలని చూడడం లేదుకదా అని అనుకుంటుండగానే "అవునండి హవల్దార్ చెప్పినదాంట్లో నిజం ఉన్నది. అయినా ఇంటింటికి వెళ్ళి తీసుకువచ్చి ఓట్లు వేయించడం మన డ్యూటీ కాదు కదా. ఎవరైనా ఓటు వేయడానికి వస్తే వేయించే బాధ్యత మాది. ఈ బ్యాలట్ పెట్టెల రక్షణ బాధ్యత మీది" అంటూ ఎన్నికల అధికారి కూడా అనేసరికి ఎస్.ఐ. అనుమానంలో పడ్డాడు.

ఏమి చేయాలో తోచడం లేదు కాని అవమానం మాత్రం దహించివేస్తున్నది. జనం సంగతి తర్వాత చూసుకున్నా వెంటనే మాత్రం ఏదో ఒకటి చేయాలను కున్నాడు ఎస్.ఐ. చేతులు ఇంకా గట్టిగా గుద్దుకుంటూ ఇంకా వేగంగా అటూఇటూ తిరగడం మొదలుపెట్టాడు. అప్పటికి సాయంత్రం నాలుగున్నర కావస్తున్నది.

ఇంతలో కిటికీలో నుండి స్కూలు ముందర కొద్దిదూరంలో బోరింగ్ కనిపించింది ఎస్.ఐ.కి వెంటనే మంత్రం వేసినవాడిలా నిలబడిపోయినాడు. కొద్దిసేపు తీవ్రంగా ఆలోచించి "దేఖియే (చూడండి) ఇంకా ఓట్లు వేయడానికి ఎవడు రాడు కాని మీరు ఆ పెట్టెలు తీసుకుని వెళ్ళి జీపులో కూర్చోండి" అని ఎన్నికల అధికారులకు చెప్పి పోలీసుల వైపు తిరిగి "ఒరేయ్ మీరు ఆ బోరింగ్ వద్దకు నడవండి మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్నికలలో వీళ్ళు పాల్గొనకపోతే మన ప్రభుత్వం వేయించిన బోరింగ్ నీళ్ళు కూడా వీళ్ళు తాగవద్దు దాన్ని విరగ్గొట్టాలి నడవండి" అంటూ ఆదేశించి ఎస్.ఐ. తనే ముందు కదిలాడు మిగతా పోలీసులు వస్తున్నారా లేదా అనేది కూడా చూడకుండానే. హవల్దార్ మిగతా ఇద్దరు పోలీసులు ఇక తప్పదురా నాయనా అనుకుంటు బయలుదేరారు. ఎలాగు టైం కూడా ముగియ వస్తున్నందున బ్యాలట్ పెట్టెలు తీసుకుని వెళ్ళి జీపులో కూర్చున్నాడు ఎన్నికల అధికారి మిగతా ఎన్నికల సిబ్బందితో కలిసి.

ఎస్ ఐ. వెనుక వెనుక పోలీసులు కూడా బోరింగ్ వద్దకు చేరుకున్నారు దేనితో విరగ్గొట్టాలి అని అటుఇటు చూచేసరికి ఎస్.ఐ.కి దగ్గర్లోనే వెనకట ఎప్పుడో మోరి కట్టడానికి తెచ్చి కట్టకుండ అలాగే ఉండిపోయిన పెద్ద పెద్ద రాళ్ళకుప్ప కనిపించింది. అంతే ఆలస్యం చేయకుండా రాళ్ళకుప్ప దిక్కు ఒకసారి బోరింగ్ వైపు ఒకసారి చెయ్యితో చూపుతూ "ఒరేయ్ ఆ రాళ్ళు తెచ్చి దీనిమీద ఎత్తేయ్యండిరా" అంటూ ఆదేశించాడు. ఎప్పుడో శారీరక శ్రమకు దూరమైన పోలీసులకు ఆ రాళ్ళు లేపడం చాలా కష్టమనిపించింది. అందుకే ఊరివాళ్ళను, ప్రభుత్వాన్ని, ఎస్ ఐ ని మనసులోనే తిట్టుకుంటు ఊఁఊఁ అంటు మూల్గుకుంటు ఒక్కొక్క బండ ఎత్తుక వచ్చి బోరింగ్ మీద దడామ్ ధడామ్ ఎత్తేస్తున్నారు. ఎస్ ఐ కి ఆలస్యం అవుతున్నట్లు అనిపించింది. తను కూడా చేతులపై అంగీని పైకి జరుపుకుంటు వెళ్ళి మోస పోస్తూ రాళ్ళను ఎత్తుకవచ్చి కసిగా ఎత్తేస్తున్నాడు లాకప్‌లో పెట్టి ఊరి వాళ్ళందరని కొడుతున్నట్లు ఫీలౌతూ. ఎన్నికల అధికారి మిగతా సిబ్బంది భయంభయంగా చూస్తున్నారు జీపులో నుండి జనాలు ఏమన్నా చెయ్యరు కదా అనుకుంటు.

ఊరి జనం అందరు ఒకరొక్కరే దూరంగా గుమిగూడారు ఈ చోద్యాన్ని విచిత్రంగా చూస్తూ. గుంపులో చిన్నగా గుసగుసలు మొదలయ్యాయి. గుసగుసలు నవ్వులుగామారాయి. పిచ్చివాళ్ళను చూసి నవ్వుతున్నట్లుగా నవ్వుతూ అందరు ఎటు→

అనువాద కథ

ఒక తల్లి కొడుకు

అజీత్ కౌర్

కన్ను పొడుచుకొన్నా కానరానంత కటిక చీకటిగా వుంది బయట. చీకటి తెరలు చీల్చుకొంటూ కుక్కల అరుపులు వినొస్తున్నాయి.

ఎంత ప్రయత్నించినా కునుకు పట్టటంలా. మా అన్నయ్య కేవల్‌ని ఎవరో హత్యచేశారు. అప్పటి నుంచి అమ్మకీ, నాకూ నిద్రే కరువైంది. అమ్మ మూర్తీభవించిన శోకదేవతలా నోటమాటేలేక మూగవోయినట్లుంది. ఒకరికొకరం నిద్రపోతున్నట్లు నటిస్తున్నాం — అలాగైనా ఎవరో ఒకరం నిద్రలోకి జారుకోవచ్చని —

అన్నని ఉగ్రవాదులు చంపారనుకొంటున్నారు. మాకైతే ఏమీ తెలియదు. తెలిసినంతలో కేవల్ ఎవరినీ నొప్పించే మనిషైతే కాదు. ఎవరైనా మరి ఎందుకు చంపుతారో ?

→వాళ్ళు అటు వెళ్ళిపోయారు. అటుఇటు చేసి చివరికి బోరింగ్ విరిగింది. ఎస్.ఐ.కి తృప్తి కలిగింది. చేతులు దులుపుకుంటు "ఇక పదండిరా" అంటు జీపులో వెళ్ళి కూర్చున్నాడు. మిగతా పోలీసులు కూడా వెళ్ళి కూర్చున్నారు.

జేబులో నుండి దస్తీ తీసి కారుతున్న చెమటను తుడుచుకుంటు "దొంగ లంజ కొడుకులు ఇప్పుడు ఎక్కడి నీళ్ళు తాగుతారో చూద్దాం" అన్నాడు గొప్ప విజయం సాధించిన వానిలా ఎస్.ఐ. వెంటనే హవల్దార్ అందుకుంటు "సార్ ఇప్పుడు వాళ్ళు బోరింగ్ నీళ్ళు తాగడంలేదు. అది చెడిపోయి ఎనిమిది నెలలు అయ్యిందట. రిపేరు కోసం దరఖాస్తు ఇచ్చి ఆరు నెలలు అయ్యిందట. ఊరివాళ్ళు చెలిమలోని నీళ్ళే తాగుతున్నారు. అందుకే అప్పుడు బిందె నీళ్ళ కోసం లాల్‌సలాం చెప్పాల్సి వచ్చింది" అన్నాడు. అంతే ఎస్.ఐ. నోరు తెరుచుకుని ఉండిపోయింది. ఊరివాళ్ళు అదోలా నవ్వుతూ దూరం నుండే వెళ్ళిపోవడం కండ్ల ముందు మెదిలింది. జీపు కదిలింది.

చంపింది ఉగ్రవాదులో.... మరొకరో.... మరొకరో.... ఎవరైనా కావచ్చు. అయినా ఒక మనిషిని చంపాలనుకొంటే దానికెంత సేపు పట్టాలి ?

కాని అదే మనిషి జీవంపొంది మానవాకృతి పొందాలంటే తల్లి కడుపులో కొన్ని నెలలు పెరగాలి. పెంచి పెద్దచేయను సంవత్సరాలు పడతాయి. జీవకోటిలో పెరిగి పెద్దవయే ఎదిగే క్రమానికి ఎక్కువకాలం పట్టేది మనిషికే. అయితేనేం.... ఒకే ఒక్క లోహపు తూటా.... క్షణం కన్నా తక్కువ కాలంలో సర్వాన్ని నాశనం చేస్తుంది. సూదిమొనతో గుచ్చీ గుచ్చగానే గాలిబుడగ పగిలిపోయినట్లు, ఆ జీవితం ఆరిపోతుంది.

రెండు కాళ్ళపై తిరుగాడుతూ, ఊపిర్లు పీలుస్తూ.... ఎముకల గూడు మధ్య వొదిగిన ప్రాణం లయబద్ధంగా శ్వాసవిడుస్తూ.... మనుగడ సాగించే ఈ జీవితం: ఒకే ఒక్క లోహపు తూటా దాన్ని తుంపులు తుంపులుగా ఎగరకొట్టేస్తే, చిమ్మిన ఎగసి నేలపడేది నెత్తుటి మడుగే. ప్రాణంతో కళకళలాడిన శరీరం శవమై కుప్ప కూలిపోతుంది. వీలైనంత త్వరగా ఆ శవాన్ని స్మశానానికి తరలించను అందరూ తొందరపడుతుంటారు. 'అంతా అయిపోయింది. పిడికెడు మట్టిలో కలిసిపోతుంది. శవాన్ని సాగనంపండి" అంటారంతా. పిడికెడు బూడిదై మట్టిలో కలిసిపోయే యీ శరీరం. ....

ఆ హత్య జరిగి సరిగ్గా నాలుగు వారాలైంది. మాకు నాలుగు శతాబ్దాలయి నట్లుంది.

ఉషోదయంలో పిట్టల కూతలకి లేవాలనిపించటంలా. అవి యింకా యిక్కడ అలా ఎలా పాడుతున్నాయోనని ఆశ్చర్యంగా వుంది. ఇద్దరికిద్దరం నిద్రపోతు న్నట్లు నటిస్తుంటాం. అయినా లేచి చేసేదేముంది కనుక. ఎప్పటికుండే దినచర్యేగా. అన్నం వండుకోవాలని వుండదు. కానీ వండితే బలవంతానైనా రెండు ముద్దలు అమ్మ నోట్లోకి పోతాయేమోనని ఆశ. అమ్మకి అంతే. తను తిన్నట్లు చేస్తే నేను తింటానని. ఒకరి నొకరం అలా మభ్యపరుచుకొంటుంటాం.

అన్నయ్యని చంపిందెవరైనా తలుచుకొంటేనే వింతగా వుంటుంది. అన్న సరళని ప్రేమించాడు. వాడు ఆమె ఒకే కాలేజీలో కలిసి చదువుకొంటున్నారు. సరళ అన్నతమ్ములు కేవల్‌ని చంపుతామని లోగడ చాలాసార్లు బెదిరించారు.

బ్రాహ్మల్లో పుట్టిన సరళని తక్కువ కులంలో పుట్టిన కేవల్‌కి ప్రేమించే హక్కు లేదని వాళ్ళ వాదన. మాది బట్టలకి రంగులు అద్దే కంభో (Kamboh) కులం.

అసలు వృత్తిని బట్టి మాది నీచకులం ఎలానో ఎప్పటికీ అర్థంకాదు రంగు రంగుల బట్టలు నేసి, ఇంద్రధనుస్సుల్లాంటి రంగులు అద్ది, వాటి నెంతో అందంగా కుట్టి అలంకరించే వాళ్ళు, ముక్కలు ఐద్దలయ్యే కంపుకొట్టే జంతు చర్మాలని శుద్ధి చేసి మృదువైన కాలి జోళ్ళగానో, మధురమైన సంచులగానో తయారు చేసే వాళ్ళు, సాదా సీదా మట్టితో కళాత్మకమైన పాత్రలుగా మలిచేవాళ్ళు.... సహస్ర వృత్తుల సమస్త జీవులు నీచజన్ములు ఎలా అవుతారో ? ఊహూ ! నాకెన్నటికి అంతుబట్టదు.

మా నాయన సాంప్రదాయకమైన రంగులద్దే వృత్తిని వదిలి, స్కూలు టీచరుగా జీవితం ప్రారంభించాడు. ఆ తర్వాత తపాలాఫీసులో ఉద్యోగం. కేవల్‌ని, నన్నూ పైచదువులు చదివించాలని ఆరాటపడ్డాడు. మా నాన్న ఎప్పుడంటుండే వాడు "బిడ్డా ! మనిషి పుట్టుకలో ఉచ్ఛ నీచాలంటూ ఏమీ లేవమ్మా. ఈ కులమతాలన్నీ మానవ కల్పితాలే. ఒకప్పుడు యివి మంచి చేసుండచ్చేమోగాని' యిప్పుడవి నిష్ప్రయోజకమైనవి తల్లీ ! ఎవరైనా చేసే పనిలోని మంచి - చెడులు, ఆ విజయాలు.... దానిలోని మానవతా విలువలు.... యివేనమ్మా మనిషి ఉచ్ఛనీచాలు తెలియ చెప్పేవి...."

ఇవే మాటలు మా స్నేహబృందంతో అన్నప్పుడు వాళ్ళు అవునన్నట్లుగా నవ్వేవాళ్ళు. మా ఆప్తబృందం వెలుపలి వాళ్ళు యీ మాటలు విన్నప్పుడల్లా — 'ఆ ! తక్కువ జాతి వాళ్ళంతా యిట్లాగే లాగుతారు. అలా అనుకొంటూ వాళ్ళని వాళ్ళే మోసం చేసుకొంటుంటారు. ఈ మాటలతో వాళ్ళు మమ్మల్ని మోసం చేయ లేరు...." అని వెటకారంగా అంటుండేవాళ్ళు.

వాళ్ళ ప్రతిస్పందనని నేను అంతగా పట్టించుకొనే దాన్నికాను జీవిత కాలా నికి సరిపడా చదవను ఎన్నో మంచి పుస్తకాలు.... అంతులేని ఆప్యాయతలు ప్రేమ.... అప్పుడే అనుభవంలోకి వస్తున్న జీవితానందం, సరికొత్తగా తెలుసు కొంటున్న జీవన రహస్యాలు.... ఈ వాతావరణాన్ని వదిలి ఆ పనికిమాలిన ఆలో చనలతో కాలాన్ని వ్యర్థం చేసుకోదలచలా.

మా నాన్న యీ ప్రపంచంలో వున్న నాన్నలందరికన్నా చాలా మంచివాడు.

అమ్మ అనురాగాల వొడి. అన్నయ్య నేను ఒకే ఆట మాట పాటగా వుండేవాళ్ళం. నేను హాయిగా స్కూల్లో చదువుకొంటున్నా. ఇంకేం కావాలి యింతకన్నా.

కానీ కేవల్ హత్య తర్వాత మా మెదళ్లు మొద్దుబారిపోయాయి. ఏమీ తోచక.... అంతా శూన్యంగా, అర్థరహితంగా మారిపోయింది. పోనుపోను ఏడుపు కూడా రావటంలేదు.

మా నాన్న చెప్పిందాన్నిబట్టి మా తాతలు రాజా రంజిత్‌సింగ్‌గారి తల పాగాలకి రంగులద్దేవారట. ఆయన మెచ్చి కొంత భూమి యిచ్చాట్ట. మా వాళ్ళు క్రమంగా వ్యవసాయంలో స్థిరపడ్డారు. కుటుంబం రానురాను పెద్దది కావడంతో భూమి ముక్కలు చెక్కలయింది. మిగతా వాళ్లు పొలం పనులు చూసుకుంటుంటే, మా నాన్న తన వంతు భూమిని కౌలుకిచ్చాడు. కౌలుదారులిచ్చే ఆదాయం మా నాన్న జీతపు రాళ్ళకి వేన్నీళ్ళకి చన్నీళ్ళుగా ఆధారంగా వుండేది. నా స్కూలు చదువు, కేవల్ కాలేజీ చదువు నిరాటంకంగా సాగిపోతుండేది.

మా నాన్న చనిపోయేనాటికి స్కూల్లో ఆఖరి సంవత్సరం చదువుతున్నా. కేవల్ డిగ్రీలో వున్నాడు. అన్నయ్య చదువాపి ఉద్యోగం చేస్తానంటే అమ్మే వద్దన్నది. 'నాన్న కలలు నువు నిజం చేయాలిరా' అనంటే అన్నయ్య కాదనలేక పోయాడు. ఆ వూళ్ళో పై చదువులకి వసతి లేకపోవటంతో అన్నయ్య పై వూరికి పోయి వస్తూండేవాడు. అన్నయ్య వచ్చేదాకా ఎదురుచూపులు చూస్తుండే వాళ్ళం. వాడు వచ్చీ రాగానే చెప్పే కబుర్లతో కాలం గడిచిపోయేది. మేమిద్దరం చాలా ఆత్మీయంగా వుండేవాళ్ళం మరి యిప్పుడో.... వాడు లేడు. బతుకులో పెద్ద ఖాళీ ఏర్పడింది. అమ్మకి అంతే. ఎందుకు బతకాలో తెలియక, బతకాలని లేనపుడు కూడా మనుషులింకా ఎందుకిట్లా బతుకీడుస్తుంటారో ?

× × ×

ఆ రాత్రి ఎందుకో మనసు కీడుని శంకిస్తోంది. ఏదో ఉపద్రవం విరుచుకు పడుతుందానిపిస్తోంది. ఈ మధ్య తరుచూ యిలానే అనిపిస్తోంది. అయినా అర్థ రహితమైన భయాలతో సతమతమవుతూనే వున్నా.

మళ్ళ ఏం ముంచుకురానుందో ? కేవల్ బతికున్న రోజుల్లో ప్రమాదం మమ్మల్ని వెన్నాడుతున్నట్లే వుండేది. ప్రతిరోజూ ఉదయం వాడు కాలేజీకి వెళ్ళగానే

మా గొంతుల్లో ఏదో అడ్డంపడి గడ్డ కట్టుకుపోయి నానా సతమతమయ్యేవాళ్ళం. సాయంత్రం వాడు తిరిగొచ్చాకగాని ఆ గడ్డ కరిగేది కాదు.

ఇప్పుడు కేవల్ కూడా లేడు. మరింకేం మిగిలుంది మమ్మల్ని భయపెట్టను? చావుకన్నా ప్రమాదకరమైందేదీ లేదు. ఆ 'చావు' యీ వరకే యీ ఇంటి తలుపు తట్టి వెళ్ళింది.

దూరంగా కుక్కలు మొరుగుతుంటే, ఆ ఏడుపు మా యింటి గురించేనేమో ననిపించింది.

చప్పుడు కాకుండా మునివేళ్ళపై యింట్లో మూడు గదుల్లో అటూ యిటూ తిరిగా. మోకాళ్ళమీద వొంగి మంచాలకింద చూచాను. కేవల్ ఫొటో ముందు మసక మసకగా వెలుగుతున్న దీపపు వెలుతురులో మంచం నీడలు కన్పిస్తున్నాయి. ఆ నీడలు ఏదో కీడుని స్ఫురిస్తున్నాయి. కేవల్ పోయాక యింక ముంచుకొచ్చే ముప్పే ముంది గనక అని నాలో నేను సమాధానపడ్తున్నా కూడా, ఎందుకో ఆ నీడలని చూస్తుంటే, వొళ్ళు జలదరిస్తోంది.

ఇంటివెనక పెరడులోకి నడిచా. ఒక మూల బొట్టుబొట్టుగా నీళ్ళు కింద గచ్చుమీద పడి వింత శబ్దం చేస్తున్నాయి. అక్కడే రోజూ వంటగిన్నెలు, మాసి పోయిన బట్టలు శుభ్రం చేస్తుంటాం. ఆ భయానక నిశీధిలో నీటిబొట్టు చప్పుడు కూడా విపరీతమైన గుండెదడ పుట్టిస్తోంది.

చీకటంటేనే ఎన్నో విచిత్రమైన భయాలు కల్గిస్తుంటుంది. మూలనున్న యిత్తడి బిందె మోకాళ్ళ సందున తలపెట్టుక్కూచున్న మనిషిలా వుంది. ఆ పక్క బకెట్‌లో ఎవరైనా దాక్కొన్నారేమో.... ఆ గడ్డిమోపు కిందెవరైనా.... ఆ కట్టెల మోపు వెనకో.... అమ్మో!

పెరటి గోడ నుంచి బయటకుపోయే ద్వారం వుంది. దాన్నానుకొని చిన్న గది వుంది. పనికిరాని సామాను గట్రా అందులో పడేస్తుంటాం. ఒక మూల పొలం మీద వచ్చిన పంటలో వాడకానికి పోను మిగతాది అక్కడే పడేస్తాం. పాత పడ్డ ట్రంకుపెట్టెలు పడేసి, వాటిమీద పాడైపోగా మేం వాడుకోని పాత దుప్పట్లు, గుడ్డలు, పరుపులు పడేస్తాం. ఈ పాత ట్రంకులంటే నాకు చాలా అసహ్యం. గతించిన యుగాలని, కాలంచేసిన పూర్వీకులని అవి గుర్తుకు తెస్తుంటాయి.

ఈ కాళరాత్రిలో.... జనం నిద్రలో జోగుతూ పీడకలల్లో సతమతమవు

తూంటే.... వూరంతా కాపలా కాస్తున్న కుక్కలు పిచ్చిగా మొరుగుతుంటే.... అమ్మలాంటి, నాలాంటి నిర్భాగ్యులు కొందరు నిద్రకు వెలియై, వొంటరులై గది లోపలి చీకటి వెలుగుల్లో ఏదో ఎక్కడో పోగొట్టుకొన్న ఆత్మల్లా చావు బతుకుల మధ్య వూరేగుతుంటాం. మాలాంటి అనాధలెవరైనా బతికి చచ్చిన శవాలమే. చావు బతుకులన్నవి ఎంత ఖచ్చితమైనవైనా, మేమా పరిధి దాటిపోయాం.

ఒక ఉజ్వల వుదయం కోసమో, కలిసొచ్చే మంచి కాలం కోసమో, ఆశా జనకమైన రేపటి వేకువ కోసమో, మంచి జీవితం కోసమో.... ఆశగా ఎదురుచూసే విరాశోపహతులవలె మేమేమీ దేనికై ఎదురుచూడ్డం లేదు. మా వరకూ అంతా అయిపోయింది. ఒక అధ్యాయం ముగిసింది.

అనాలోచితంగా గది తలుపుతోసి లోపలికి తొంగిచూశా. చిమ్మ చీకటి.... వెతికి లైటువేసా. మసక మసకగా గుడ్డి బల్బు వెలిగింది. వెలగదేమో అనుకొన్నా వెలిగేసరికి ఆశ్చర్యమేసింది. తప్పీదారి అనుకోని అతిధి ఎవరైనా వస్తే ఆ గదిలో మూల పరుపేసి పడుకోబెడతాం. నాన్న చనిపోయాక అదీ లేదు. ఇటుగా ఎవరూ రాక గది వాడటంలేదు.

అతిధులెవరూ రాని గడిచిన కాలాన్ని నెమరేసుకొంటూ చికాగ్గా అటూ యిటూ తిరుగుతుంటే.... ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించే తీగ తగిలి షాక్‌కొడితే ఎలా వుంటుందో అలా అనిపించి వణికిపోయా.... ఎదుట కనపడ్డ దృశ్యంతో.

మొదటగా అతని కళ్ళు కనిపించాయి. పులికోరల మధ్య చిక్కొని విల విల్లాడుతున్న జింక కళ్ళల్లా వున్నాయవి. చావు, చావు భయం కలగలసి ఆ కళ్ళలో ఘనీభవించాయనిపించింది.

షాక్ నుంచి తేరుకొని చూస్తే, ఆ కళ్ళు చాలా అమాయకంగా కనిపించాయి. ఆ కళ్ళని మొహాన్ని పోల్చి చూశాను. ఆ మొహంలో తీవ్ర భయాందోళనలు కన్పిస్తున్నాయి. అతని పొట్టి గడ్డం కూడా భయంతో అదురుతున్నట్టుంది.

నన్ను చూసి అతను అదిరిపడ్డాడు.

అతన్ని చూసి నేను భయపడ్డాను.

మాలో ఎవరం అటూ యిటూ కదిలేలా లేం. నా కాళ్ళు గజగజ వణుకు తున్నాయి.

ఎవరో ?.... అతనెవరో ?.... మా యింటికెలా వచ్చాడో ?.... ఇక్కడేం చేస్తున్నట్లు ?.... మా నుంచేం ఆశిస్తున్నట్లు ?.... మమ్మల్ని చంపను వొచ్చాడా ?.... అపును వాళ్ళెవరో కేవల్‌ని చంపినట్లుగా....

నా ఆలోచనల్లో సతమత మవుతూనే అతన్ని పరికించి చూశాను. రెండు చేతుల్తోటి కాలు పట్టుకూర్చున్నాడతను. కాలిమీద అయిన ఎర్రని గాయం నుంచి విపరీతంగా రక్తం కారిపోతోంది.

అతను సన్నగా మూలిగాడు.

"నీళ్ళు ...."

రెండు విషయాలు వెంటనే అర్థమయ్యాయి.

అతను తీవ్రంగా గాయపడ్డాడు.

అతను నీళ్ళకోసం ప్రాధేయపడుతున్నాడు.

మరింకే యితర విషయాలు ఆ క్షణాన అవసరమనిపించలా.

అంతే! వెంటనే వంటింట్లోకి వెళ్ళి గ్లాసునిండా నీళ్ళు తెచ్చాను. వణికే నా చేతుల్లోంచి ఒక్క వుదుటున గ్లాసు లాక్కొన్నాడు.

ఏం! నేనింకా అతనంటే భయపడుతున్నానా? ఏమో....కావచ్చు! అతను ఆ క్షణాన నా దయాదాక్షిణ్యాలమీద ఆధారపడ్డాడని తెలిసినా....మనసింకా పీచు పీచు మంటూనే వుంది.

ఒక్క వుదుటున నీళ్ళు తాగేసి యింకా కావాలన్నట్లు చేయి చాచాడు. మళ్లా యింకో గ్లాసునిండా నీళ్ల తెచ్చిచ్చా! ఈసారి తాపీగా నీళ్ళు తాగాడు.

అతను నావంక చూశాడు. అప్పటిదాకా ఆ కళ్ళల్లో వున్న తీవ్ర భయాం దోళనలు తగ్గి నెమ్మదిగా స్థిమిత పడుతున్నట్లున్నాడు. నల్లని మౌన సరస్సుల్లా వున్న అతని రెండు కళ్ళల్లో అక్కడక్కడ కోపాన్ని వ్యక్తం చేస్తున్నట్లుగా నెత్తుటి చుక్కలు తేలుతున్నాయి. ఆ కోపం నామీద కాదనే అనిపిస్తోంది. అది తన నిస్సహాయత పట్ల కోపం .... నెత్తురోడుతున్న గాయం పట్ల అసహాయత కోపం—

"భయపడకమ్మా! కాస్త కాలు కదపను వీలు కాగానే, యిక్కడ నుంచి వెళ్ళిపోతాను. ఆందోళన పడకమ్మా. — ఎవరికీ తెలియకుండా వెళ్ళిపోతాను"— అన్నాడు.

అతని మాటలతో మామధ్య మంచు దిబ్బ కరిగిపోసాగింది. నా గొంతులో గడ్డ కట్టిన వుద్రిక్తత కూడా మెత్తపడింది. పక్కటెముకల్లోకి చొచ్చుకుపోయిన భయం నెమ్మదిగా తగ్గింది.

వంటింట్లోకి నడిచాను. కాలి చల్లారుతున్న పిడకల మధ్యన రాత్రంతా అమ్మ వుంచే పాలల్లోంచి కాసిని పాలు గ్లాసులో పోసుకొని వచ్చి అతని కిచ్చాను. ఒక్కొక్క గుటక వేస్తూ ఆ పాలన్నీ తాగాడు.

"కాలి దెబ్బకి కట్టు కట్టుకోవాలి. చిన్న గుడ్డముక్కుందామ్మా —"

పాత చెక్కపెట్టె తెరిచి పాత దుప్పటిలోంచి గుడ్డముక్క చించి యిచ్చా. గాయం చుట్టూ దాన్ని చుట్టి ముడి వేసుకోను సతమతమవుతున్నాడు. ఆ చేతులు వణుకుతూ పట్టు తప్పుతున్నాయి. ఇక నేనే గుడ్డముక్క చివర్లు పట్టుకొని లాగి ముడివేశాను.

"తుపాకీ తూటా దూసుకుపోయి దెబ్బ తగిలిందమ్మా" అన్నాడు.

"తూటా దెబ్బా" అదిరిపోయాను.

"అవును — ఆ పోలీస్ కుక్కలు —"

"పో—లీ—స్—" వణుకు పుడుతోంది.

"అపార్థం చేసుకోకమ్మా—దయచేసి. నేను దొంగని కాను. స్మగ్లరుని కాను. నేను—"

"తీవ్రవాదివా—" వణక్కుండా అడగాలని విశ్వ ప్రయత్నం చేశా కాని పీలుకొలా.

"తీవ్రవాది?—హుం—అదో ప్రత్యేకమైన జాతా తల్లీ?" —నవ్వాడతను.

ఉన్నట్లుండి అతని మొహం వంకర్లుపోయింది. పళ్ళు గిట్ట కరిచాడు. గవదలు నొక్కుకుపోయాయి. అతని కళ్ళలో సుళ్ళు తిరిగే బాధ కన్పించింది. కాలి దెబ్బకి పైన రెండు చేతులతో వొత్తుకున్నాడు.

నిస్సహాయురాలినయిపోయా

"వెళ్ళమ్మా! వెళ్ళి నిద్రపో చెల్లీ. కాస్త నొప్పి తగ్గగానే నేవెళ్ళిపోతాను."

"ఉహూ! మీరెటూ వెళ్ళద్దు" అన్నా. ఎందుకో అనుకోకుండా అతనికి బాధ్యత వహించాలనిపించింది. దాదాపుగా ఆజ్ఞాపిస్తున్నట్లే వెళ్ళద్దన్నా.

"ఈ పరిస్థితిలో యిక్కడి నుంచి ఎటూ వెళ్ళద్దు". గది బయటికి వచ్చే శాను. ఎప్పటిలా బయటనుంచి తాళం పెట్టి మంచం మీదకి వొరిగిపోయాను.

వీధిలో జరిగేది గమనిస్తున్నా. ఆ రాత్రి గడుస్తున్నట్టే లేదు. రాత్రి— భయంతో చప్పుడు కాకుండా నడిచే నల్లపిల్లి నడకలా గడుస్తోంది.

చాలా సేపటికి తెల్లారుతుందని పించింది. పూర్తిగా ఎక్కడ తెల్లవారి పోతుందోనని హడావుడిగా పెరడులోకి పోయా. నీళ్ళ చెంబు తీసుకొని గదిలోకి వెళ్లా. వినపడీ వినపడనట్లు అతని మూలుగు వినస్తోంది. చల్లని గాలి లోపలికి జొర బడింది.

"తెల్లారవస్తోంది. లేవండి — పొద్దున్నే అవతలికి ఎట్లా పోయొస్తారు మరి—సరే! నీళ్ళివిగో— —కొంచెం లేచి నిలబడితే బయటకు తీసుకువెళతాను. గోడ అవతల కాపలా కాస్తూ ఎవరొచ్చి పోయేది చూస్తుంటా. ఈ వేళలో యిప్పుడే యిటుగా ఎవరూ రారనుకో— —" అన్నా.

లేచి నిలబడను ప్రయత్నిస్తుంటే, చేతకాక బాధతో వొంగిపోతున్నాడు. చేయి పట్టుకొని వెనక తలుపు గడి తీశాను. ఆ గోడ నీడ పడే చోటొకటి చూపించి అక్కడ కూచోమన్నా. నీళ్ళు దగ్గిర పెట్టా. చీర చెంగు పరదాగా లాగి పట్టుకొని వెనక్కి తిరిగి నిలబడ్డాను.

ఆకాశంలో నెత్తుటి కళ్ళతో ఆహారం కోసం వేటాడే డేగల నుంచి, అప్పుడే రెక్కలు మొలుస్తున్న కోడిపిల్లలని కాపాడుకొనే కోడితల్లిలా వున్నాననిపించింది. గాయపడ్డ కొడుకుని సాదుకొంటున్న తల్లిననిపించింది. నా గుండెల్లో మృదువైన ఆర్ద్రిత భావం రెపరెపలాడింది.

నీళ్ళ చప్పుడుతోపాటు, అతను లేచి నించున్న అలికిడి అయింది. చేయి పట్టు కొని లోపలికి నడిపించాను. మళ్ళ గడి పెట్టేశాను. లోపలి చెక్క పెట్టెల వెనకాల కూచోపెట్టాను. పెట్టెలోంచి బొంత తీసి మడతలు పెట్టి దెబ్బ తగిలిన కాలికింద పెట్టా. రెండు దిళ్ళు ఆనుకోను అమర్చి, కప్పుకోను దుప్పటి యిచ్చాను.

పూర్తిగా తెల్లవారింది.

పొద్దున్నే ఇంటికి యిద్దరు పోలీసులొచ్చారు. వాళ్ళు వచ్చిపోవడంలో వింతేమీ లేదు. కవల్ హత్య జరిగిన తర్వాత నుంచి పోలీసులు అప్పుడప్పుడు డ్యూటీ మీద

వచ్చి పోతున్నారు. కానీ ఆ రోజు యూనిఫారంలో వచ్చిన వాళ్ళిద్దరినీ చూస్తుంటే భయమేసింది.

"నిన్నరాత్రి పోలీసులకి ఉగ్రవాదులకి మధ్య ఎదురెదురు కాల్పులయ్యాయి. అవి వూరి పొలిమేరల్లో జరిగాయి. మీకు మా కాల్పులు వినపడేవుండాలి" అన్నారు.

అవును. విన్పించాయి. అందులో వింతేమీలేదు. నక్కలో....కుక్కలో.... కప్పలో....ప్రతిరాత్రి ఏవో ఏవేవో అరుపులు విన్పిస్తూనే వుంటాయి.

"మేమనుకోవటం....వాళ్ళు లోగడ కేవల్‌ని హత్య చేసిన ముఠావాళ్ళేనని, నిన్నటి ఎదురెదురు కాల్పుల్లో ఎవరూ చనిపోలా. చీకటి ముసుగులో వాళ్ళు తప్పించుకుపోయారు. అయితే వాళ్ళలో ఎవడో ఒకడైనా తూట దెబ్బతినుండచ్చని, పొలిమేరలనుంచి వూళ్ళోకి వచ్చే దారిపొడుగునా రక్తపు మరకలు కన్పిస్తున్నాయి. వాడెవడో మొత్తానికి వూళ్ళోనే ఎక్కడో దాక్కొనుండచ్చనుకొంటున్నాం. మీరేం భయపడకండి. ఇవాళరేపట్లో వలపన్ని వాణ్ణి పట్టేస్తాం. కేవల్ హత్యకి సంబంధించిన భోగట్టా అంతా సంపాదిస్తాం. ఎవరు ఎందుకు చేసింది కనుక్కొంటాం. ఏమైనా ఆ వెధవని యీసారిపోనివ్వం...."అన్నారు.

"అసలు రక్తపు మరకలు యీ వీధి మొదలుదాకా కన్పిస్తున్నాయి. ఆ పైన....' "అనంటుంటే, మరో పోలీస్ "ఐనా మీకేం భయ్యాలా! మీరు లోపలినుంచి తలుపేసుకోండి. ఈ సందులోని ప్రతి యిల్లూ అంగుళం అంగుళం సోధిస్తాం" అన్నాడు.

నా చెవుల్లో పిడుగులు కురిశాయి. సుడిగాలిలా ఆ మాటలు నన్ను చుట్టి ముట్టి వుక్కిరి బిక్కిరి చేశాయి నిశ్చేష్టనయి అలానే తలుపు నానుకొని నిలబడిపోయా. నా నాళాల్లో రక్తం సుళ్ళు తిరుగుతూ పరవళ్ళు తొక్కటం వినవస్తోంది.

మధ్యాహ్నమవుతోంది. సూర్యుడు అనల నేత్రం తెరిచినట్లుంది. అమ్మ ఒక గదిలోంచి మరోగదిలోకి పచార్లు చేస్తుంటే, నాకు పెరటి గదిలోకి వెళ్ళను వీలే కాలా. కేవల్ పోయిన నాటి నుంచి, ఏదో పోగొట్టుకొని దిక్కుతోచనిదానిలా అటూ ఇటూ తిరుగుతోంది. ఏమిటీ అంటే ఏమీ చెప్పలేదుకాని, మొత్తానికి ఏదో వెతికి పట్టుకోవాలన్నట్లు తిరుగుతుండేది.

అన్నం తిన్నట్లు చేశాక, అమ్మ మంచం మీద కూచొని భగవద్గీత తెరిచేది. ఆ అక్షరాలన్నీ గాలిలోకి ఎగిరి చుట్టూ తిరుగుతుంటే, తెరిచిన పేజీలోని ఖాళీలో అమ్మకి కేవల్ కనిపించేవాడు. పేజీ తిప్పకుండా, అమ్మ అలా చూస్తూనే వుండేది.

పెరటి గదిలోని ఆగంతకునికోసం అవసరంగా మరో నాలుగు రొట్టెలు చేశా. వాటి మీద వంకాయకూర, ఆలుగడ్డలు పెట్టుకొని చెంగుచాటున తీసుకెళ్ళాను.

పగటి వెలుతురులో అతను కుర్రవాడిలా కనిపించాడు. దిండు మీద తల పెట్టుకొని కళ్ళు మూసుకొని పడుకొనున్నాడు. ఆ మొహంలో అమాయకత్వం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. నిస్సహాయస్థితిలో బాధలో ముడుచుకొని పడుకొనున్నాడు.

అతని మోచేయిని మృదువుగా తాకా. కళ్ళు తెరిచాడు. ఆ కళ్ళల్లో తీవ్రంగా బాధపడుతున్న ఛాయలున్నాయి. కనురెప్పలు వాచి కళ్ళు ఎర్రనయినాయి. రాత్రంతా బాధతో కమిలినట్లుంది. అంతా చేసి అతని వయసు పద్దెనిమిదేళ్ళు దాటకపోవచ్చు. ఆ వయసులో బాధవల్ల ఏడ్చివుంటాడంటే ఆశ్చర్యమనిపించలా.

రొట్టెలని అతని ముందు పెట్టాను. ఆకలిగా లేదన్నాడు. రెండు చేతులు దెబ్బ తిన్న కాలి చుట్టూ వేసి, కాలుచాపి లేచి నిలబడపోయాడు. పట్టు దప్పి బాధగా కూల బడ్డాడు.

"ఆకలయినా కాకున్నా తినాల్సిందే, తప్పదు." చిన్న పిల్లవాడిని గద్దించి నట్లుగా కోప్పడ్డాను. బుద్ధిమంతుడైన పిల్లవాడిలా తినసాగాడు.

నిన్నరాత్రి గాయానికి కట్టిన పాతగుడ్డకి నల్లటి రక్తపు మరకలయ్యాయి. గాయానికి పైనా కిందా కాలు వాచి ఎర్రగా అయింది.

"రాత్రంతా నరకయాతన పడ్డావా...."నా గొంతులోని ఆర్ద్రతకి అతను కరిగి పోయాడు. ఆ కళ్ళు చెమ్మగిల్లాయి.

"అవునమ్మా! తూటా యింకా కాల్లోనే వుంది." ఆ మాటకి వణికిపోయాను. లోహంతో తయారయిన ఛండాలమైన తూటా, సున్నితమైన కాలులోకి దూరి రక్తా న్నంతా విషపూరితం చేస్తోంది. అయ్యో!....ఆ ఘోరం చూస్తుంటే....విచిత్రమైన ఆలోచనలు పుడుతున్నాయి.

వెంటనే అతనికి వైద్యం అవసరం. కానీ, ఎంత చిత్రమైన పరిస్థితిలో వున్నాం....చికిత్స చేయించాలంటే, పులి నోట్లో తలపెట్టినట్లే, చేయించకుంటే....

అతని విషయంలో యీ క్షణాన డాక్టర్లు, సర్జన్లు, ఆధునిక వైద్యశాస్త్రం నిరర్థకం. వాళ్ళ పరికరాలన్నీ శాపగ్రస్తమయి తుప్పు పట్టిపోయాయి.

గది నుండి యీవలికి వచ్చి తాళం వేశాను. సూర్యతాపం మందగించింది. లోపలిగదిలో అమ్మ యింకా ఖాళీ పేటీలో కేవల్‌ని చూస్తూవుంది. సూది దారాలుంచే

పాతబుట్టలోంచి మాసిన యాభై రూపాయల నోటు తీసుకొని, తలనిండా కొంగు కప్పుకొని బజార్లోకొచ్చాను. వీధి ఆ చివరా యీ చివరా పరకాయించి చూశాను. వీధికి ఎడమవైపున చిల్లరకొట్టు బల్లమీద ముగ్గురు పోలీసులు కబుర్లలో మునుగు న్నారు. నేను మరోవైపుగుండా వీధి చివర మందుల షాపులోకి వెళ్ళాను. సామా న్యంగా చిన్న వూళ్ళలో ఒకరితోఒకరు ఎలా అన్యోన్యంగా వుంటారో అలా ఆషాపాయన మా నాన్నతో మంచిగా వుండేవాడు.

"బాబాయి. నాక్కొంచెం దూది, గాజుగుడ్డ, డెట్టాల్ కావాలి" అన్నా. గొంతు కొంచెం బొంగురు పోయినా, సాధ్యమైనంత మామూలుగానే అడిగాను. మేము ఆ షాపాయన్ని డాక్టరుగానే చూసే వాళ్ళం.

"ఏమ్మా ! అంతా కులాసేనా ? అమ్మకి ఏమైనా దెబ్బతగిలిందా ?" అనడిగా డాయన.

కేవల్ చనిపోయాక మేమంటే అందరూ మా గురించి బాగా పట్టించుకొంటు న్నారు.

"అబ్బే ! ప్రత్యేకంగా ఆక్షేంలేదు. అమ్మకి కనిపించక కాలికి ఎదురు రాయి తగిలి దెబ్బతగిలింది. అంతే" అనన్నా.

"అలానా ! నేయింటికొచ్చి కట్టుకట్టనా మరి ?"

"అహా ! అంతేమీ లేదు బాబాయి, ఫర్వాలా నేను కట్టుకట్టగలను" అన్నా కళ్ళద్దాల వెనకనుంచి నన్నే తాపీగా చూస్తూ, అడిగిన మందులిచ్చాడు.

ఇవన్నీ ఎలా తీసుకుపోవాలో ? వీధి బయట పోలీసులు చూస్తే....

"బాబాయి చిన్నబుట్ట లాంటిదేమన్నా వుందా ?"ని అడిగాను. ఆయనిచ్చిన ప్లాస్టిక్ సంచిలో అన్నీ కుక్కాను. ఆ పక్కనే వున్న చిల్లరకొట్టుకి వెళ్ళి ఉప్పు పాకెట్ తీసుకొని, ఆ మందులపై పెట్టుకొని యిల్లు చేరా.

ఆ పోలీసులింకా ముచ్చట్లలోనే మునుగున్నారు.

* * *

అమ్మ జోగుతుంది. పెరట్లోకిపోయి తలుపు తీశాను. బాధతో మూలుగు తున్నాడు. పాతకట్లు విప్పదీశాను. గాయంచుట్టూ రక్తం గడ్డకట్టి వాచిపోయి నల్లగా కమిలిపోయింది. డెట్టాల్‌లో దూదిముంచి గాయాన్ని కడిగాను. ఆ క్షణంలో కేవల్

వీపుమీద కమిలిన గాయం కళ్ళల్లో మెదిలింది. వాడప్పటికే చనిపోయాడు కాబట్టి, కేవల్ గాయంకడిగి కట్టుకట్టాల్సిన పని లేకుండె....

నా మెదడులో బాధాతరంగాలు సుళ్ళు తిరుగుతున్నాయి. శక్తినంతా కూడ దీసుకొని వాటిని తరిమేస్తున్నా. నా చెవుల్లో రక్తపు హోరు పరవళ్ళు తొక్కుతోంది. రక్తం చేస్తున్న ఆ పిచ్చిరొదని వినదలుచుకోలేదు.

అతను పెదాలు కొరుక్కుంటున్నాడు. ఏడుపు వినరాకుండా అవస్థ పడుతున్నాడు. గాయంపై డెట్టాల్ తడి తగిలినపుడు, తీవ్రమైన బాధతో మెలితిరిగి పోతున్నాడు. బాధతో అతని నుదురు ముడతలు పడుతోంది. రెండు చేతులతో కాలిని గట్టిగా బిగించి పట్టుకొన్నాడు. బాధాతప్త అశ్రువులని వెలికి రానీయకుండా వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు. అప్పుడు అతని తల నా భుజాలమీదకి తీసుకోవాలని పించింది.

"కన్నా! ఏడువు తండ్రీ— నీ బాధంతా పైకి వినవచ్చేలా ఏడవయ్యా.... కన్నీళ్ళని ఆపకు బాబూ....అవి లోపల్లోపలే గడ్డకట్టి బండరాళ్ళయి నా జీవాన్ని గుంజేస్తాయి....ఏడుపు ఆపుకోకయ్యా ...."

కాని....కాని...., నా పల్లకొలా. పెదవి విప్పి ఒక్కమాటా చెప్పలేకపోయా.

వంటింట్లోకిపోయి వేడి వేడి పాలు గ్లాసులోనింపి తెచ్చి యిచ్చాను. బయటకు వచ్చి తాళాం పెట్టాను. డెట్టాల్ వాసనపోను సబ్బుతో చేతులు కడుక్కొన్నా. చర్మపు రంధ్రాల్లో యింకిన డెట్టాల్ జివ్వుమంటూనే వుంది.

వేడి వేడిగా టీ పెట్టా. అమ్మకొక గ్లాసు యిచ్చి, నెమ్మదిగా తాగుతున్నా.

నా చుట్టు ఏం జరిగేది తెలుస్తూనే వుంది. రక్తపు చారికలతో వాచిన గాయం కళ్ళల్లో కదులుతోంది. అప్పుడప్పుడు వీధి చివర కబుర్లలో మునిగిన ముగ్గురు పోలీసులు గుర్తొస్తున్నారు.

ఆలోచిస్తూ ...నిద్రలో వొరిగిపోయా. అయినా శరీరంలో ఒక భాగం ఎక్కడే చిన్న ప్రమాదాన్ని సూచించే చప్పుడయినా పసికట్టి లేవను అప్రమత్తంగా వుంది. ఊరు పేరూ తెలియని అతనిపై ఏ క్షణాన్నైనా దూకను పక్కనే పొంచివున్న ప్రమాదమేమిటో స్పష్టంగా తెలుస్తూనే వుంది.

ఆ కలత నిద్రలో....విస్తారమైన ఎడారులు....ప్రాణభీతితో పరుగుతీస్తున్నా కుందేళ్ళు....అరుస్తూ, మొరుగుతూ, ఎగరొప్పుతూ....తెల్లని పళ్ళని క్రూరంగా

మెరిపిస్తూ, నల్లటిగవదలగుండా ఎర్రని నాలుక ఎగరేస్తూ...భీకరంగా ఆ కుందేళ్ళని వెంటాడుతూ, వెన్నాడుతూన్న వేటకుక్కలు....ఎన్నో ఎన్నెన్నో దృశ్యాలు అగుపిస్తున్నాయి.

వీధిలో కుక్కల అరుపులకి ఒక్క ఉదటున మెలకువొచ్చింది. వళ్ళంతా చల్లని చిరుచెమట్లు పట్టాయి. మనసు పీచు పీచుమంటోంది. గదినిండా సాయంకాలపు నీడలు పరుచుకొన్నాయి. మంచం మీద అమ్మలేదు.

మంచంమీంచి లేచి పెరట్లోకి వచ్చా. అమ్మ పొయ్యి వెలిగించింది. మోకాళ్ళపై గడ్డం అనించి పైపైకి లేచే మంటని చూస్తోంది. పొయ్యి మీద గిన్నెలో పప్పు వండుతోంది.

నేనొచ్చింది అమ్మ గమనించలా. పొయ్యి మీది గిన్నెపై కూడా అమ్మ చూపు లేనట్లుంది. అమ్మ తెగిన పేగు జ్ఞాపకాల్లో కూరుకుపోయినట్టుంది.

ఉన్నట్టుండి అమ్మ నా వేపు చూసింది.

"ఏం తల్లి....తలనొస్తుందా ?" అంది. "చాలాసేపు నిద్రపోయావమ్మా. చీకట్లు పడే ముందటి సాయంకాలం నిద్ర వంటికి మంచిది కాదమ్మా."

మంచిదీ కాకుండా పోను యింతకన్నా యింకేం అనర్థం జరగాలోననిపించింది. గమనించీ, గమనించనట్లు పెరటి గదివేపు చూశా. "అమ్మా! నువు పడుకోమ్మా. ఆ రొట్టెలేవో నేచేస్తాగా" అన్నా.

అమ్మ కణతలు వొత్తుకుంది. నిట్టూరుస్తూ లేచి నిలబడి గదిలోకి వెళ్ళిపోయింది. కాసేపట్లో చేసిన రొట్టెలు అమ్మకి పెట్టాక, పళ్ళెంలో నాలుగు రొట్టెలు, గిన్నెలో పప్పు పెట్టుకొని పెరటి వెనక గదికిపోయా.

అతను నిద్రపోతున్నట్టే వుంది....పసిపిల్లవాడిలా, సగం తెరిచిన నోరుతో పడుకొనున్నాడు. చేయి పట్టుకొని చూశా. కాలిపోతుంది. నుదురు పొయ్యిమీది పెనంలా మండుతోంది. మూసిన కన్ను తెరవకుండా పడుకొనే వున్నాడు. వూపిరి విడుస్తుంటే మూలుగు వినస్తోంది. ఆ కాలు యింకా వాచిపోయింది. కట్టిన కట్టులోంచి బయటికి నల్లని చెడు రక్తం బయటకొస్తోంది. ఏమీ చేయలేని నిస్సహాయ దైన్యంలో తలుపుకి తాళంవేసి బయటకొచ్చాను.

అ అర్ధరాత్రి మళ్ళ గదిలోకి వెళ్ళా. తలుపు దగ్గరకేసి లైటువేశా. బాధతో

కాలు పట్టుకొని కూచున్నాడు. నిస్సహాయస్థితిలో అతని మూలుగులు వింటాంటే మనసు కరిగిపోతోంది. అతని తల నిమిరాను. నావంక కన్నెత్తైనా చూడలా.

పళ్ళెంలో పెట్టింది పెట్టినట్లే వుంది. ఎప్పుని తెల్లటి వెన్నపొర కప్పేసింది.

అతని తలపైకెత్తాను. బలవంతంగా కాసిని నీళ్ళు గొంతులో పోశా. గుటక వేసి ఎప్పటిలా ఆ కాలి మీదికి వాలిపోయాడు.

ఒక మూల పనికిరాని చెత్తా చెదారంతో నిండిన పాత చెక్కపెట్టెల నడుమ అతనొక మాసిన గుడ్డల మూటలా వున్నాడు. గది బయట రోడ్డుమీద యితనికోసం వాళ్ళంతా కాచుకొని వున్నారు.

మర్నాడు జ్వరం ఎక్కువయి సంది ప్రేలాపన మొదలైంది. తను అసలు మన స్పృహలో లేనట్లే వుంది. నేనెంత ప్రయత్నం చేసినా, ప్రతిసారీ అతికష్టంమీద ఓ గుటకేసి కాసిని నీళ్ళు తాగేవాడు. తలపైకెత్తి ఒకసారి చూసి, మళ్ళీ కాలిగాయం మీద వాలిపోయాడు.

సాయంత్రం అయింది. జ్వరం పేలిపోతోంది. చల్లటి నీళ్ళలో గుడ్డ తడిపి నుదుటిపై వుంచా. అతని కాలిగాయం నుంచి చెడు వాసన వస్తోంది. మళ్ళ కట్టు మార్చాను.

నుదుటిని చల్లదనం తాకటంతో కళ్ళు విప్పి చూశాడు. వేడిపాలు యిస్తే నెమ్మదిగా తాగాడు. చాలా తగ్గు స్వరంలో అన్నాడు.

''నేను యిక్కడ చావాలనుకోవటం లేదమ్మా! ఒకవేళ అనుకోకుండా చని పోతే, నా శవాన్ని ఎలా వదిలించుకొంటావ్ తల్లీ? నీకిప్పటికే చాలా శ్రమ కలిగించాను. ఇంకా అదనంగా మరింత యిబ్బంది యివ్వదలుచుకోలేదమ్మా....''

నా కేడుపొస్తోంది. ఏడ్చేస్తున్నా....అతని తలపై చేయుంచాను. స్కూలుకి మొదటిసారిగా వెళ్ళే బిడ్డని ఆశీర్వదించే తల్లి ఎలా చేస్తుందో అలా....బయట కొచ్చేశా—

చుట్టూ చూశాను. నా గుండెను ముంచెత్తుతున్న దుఃఖాన్నంతా ఎక్కడ దులి పేసుకోను?—అప్పుడే బయట నుంచి తలుపు గట్టిగా కొడుతున్న చప్పుడయింది. ఎవరో యీవేళప్పుడని ఆశ్చర్యమేసింది.

''వేళాపాళా లేకుండా ఎవరమ్మా యిప్పుడు తలుపు కొట్టేది? యీ యింట్లో

ఒంటరిగా బిక్కు బిక్కుమంటూ యిద్దరు స్త్రీలు వుంటున్నారన్న స్పృహ కూడా లేదా వాళ్ళకి" అంటూ అమ్మ కోపంగా చిరాకుపడింది.

నేవెళ్ళి తలుపు తీశాను. నిన్న ఉదయం వచ్చిన యిద్దరు పోలీసులే మళ్ళీ యిప్పుడొచ్చారు.

"మీ యిల్లు తనిఖీ చేయక్కర్లేదని మాకు తెలుసనుకోండి. ఏమంటే, మా కుక్కలు ఆ రక్తపు మరకలు వాసన చూసినప్పుడల్లా ఎటో పోయేవి కూడా యిక్కడకొచ్చి ఆగిపోతున్నాయి. ఒక్కసారి లోపలికి తొంగిచూసి పోవామని—" అంటూ మర్యాదగానే అడిగాడు.

నాకు హడలుపుట్టింది. ఒక్కసారిగా కాళ్ళ కింది భూమి తొలుచుకొని అగాధంలోకి జారిపోతున్నట్టనిపించింది. కడుపులో పేగులు భయానికి చిలికినట్లయింది. నెమ్మదిగా అన్నాను—

"అమ్మ యిప్పుడే అన్నంతిని నిద్రలోకి జారుకొంటోంది. మీకు తెలుసుగా ఆమె నిద్ర అంతంత మాత్రమేనని— ఎప్పుడోగాని నిద్రపోదని— మీకు వీలయితే, ఒక గంటన్నర ఆగి రారాదండి—"

"ఫర్వాలేదండి. అమ్మని నిద్రపోనివ్వండి. మేము తర్వాతే వస్తాం. తొందరేం లేదు. ఏమైనా అర్ధరాత్రి అపరాత్రి రావాల్సివస్తే ఏమనుకోరుగా—"

"అబ్బే! అదేం లేదండి. మీరు నా అన్నలాంటి వారు. కేవల్ చనిపోయాక మీరేగా అడపాదడపా వచ్చిపోతోంది" అన్నా.

ఆ మాటతో వాళ్ళు వెళ్ళిపోయారు.

"ఎవరమ్మా వాళ్ళు" అడిగింది అమ్మ.

"పోలీసులమ్మ. మనిల్లు తనిఖీ చేయాలట. వాళ్ళు ఎవరికోసమో వెతుకుతున్నారు. ఆ వ్యక్తి యీ వీధిలో ఏ యింట్లోనో దాగివుండచ్చనుకొంటున్నారు."

"ఆహా! మరి తలుపులు జాగ్రత్తగా వేశావమ్మా" ఆతృతగా అడిగింది అమ్మ, అవునని చెప్పటంతో అమ్మ తృప్తిగా మంచం మీదికి వొరిగిపోయింది. మునివేళ్ళ మీద వెనకగదిలోకి నడిచాను.

తలుపు చప్పుడు బహుశా అతను వినే వినుండచ్చు. ఆ స్థితిలో అప్పుడు అతనెలా వున్నాడో! నాకీ రోజుకీ ఆ విషయం అంతుపట్టటంలా.

అతను మేల్కొన్నాడు. ఆ కళ్ళు భయంతో పూడుకుపోయున్నాయి.

'వాళ్ళెవరు' అన్నాడు.

"పోలీసులు— యిల్లు తనిఖీ చేయాలన్నారు. ఒక గంటాగి వస్తామని పోయారు." ఆ మాట చెప్పి మనసులో బరువు దించేసుకొన్నా. అతనికి తెలియాలి. జరిగిందంతా అతనికి తెలియాల్సిన ఆఖరి క్షణాలవి.

అతనొక నిర్ణయానికొచ్చేశాడు. సెకనులో పదోవంతు కాలంలో అంత వేగంగా ఎవరైనా ఎలా నిర్ణయానికి రాగలరో? నేరుగా మృత్యువు వాడిలోకి ఆ నిర్ణయం అతన్ని విసిరేసినట్లుందానిపిస్తోంది.

"ఉహూ!— వెళ్ళాలి. ఇక నే వెళ్ళిపోవాలి యిక్కణ్ణించి" అన్నాడు.

ఉండమని నేనూ అనలేదు. కాదు— అనలేకపోయాను. మా యిద్దరికీ ఆ క్షణాన తెలిసిపోయింది— దారులన్నీ మూసుకుపోయి, యిక ఎటూ తప్పించుకు పోలేని స్థితికి— చివరి అంచు కొసకి చేరామని—

రెండు రోజులనుంచి బయటేవుండి, దాగుడుమూతలాడుతూ పొంచివున్న మృత్యువు మరే క్షణంలోనైనా గడపదాటి లోపలికి— మీదికి దూకచ్చని తెలిసి పోతూనే వుంది.

ఒక్క అడుగు వేసి వేయగానే అతని మొహం బాధతో ఉంగచుట్టుకు పోయింది. పెదాలని పళ్ళతో గిట్టకరిచి బలమంత కూడదీసుకొని మరో అడుగు ముందుకేసాడు. యింకో అడుగు—యింకొక్క అడుగు—మరో— మరొక్క— అ—డు—గు— — — గడి— దా—టా—డు—

వెనక వీధిలోకి అడుగుపెట్టి, ఆగి క్షణకాలం నా వంక చూశాడు. అతని నల్లని కళ్ళలో ఉద్విగ్న భావాలనేకం కలగలసి రూపుకట్టాయి— ప్రేమ— కృతజ్ఞత— ఆప్యాయత— ముంచుకొస్తున్న మృత్యుపీడలు— నా మాటలకందని ఎన్నెన్నో భావాలనేకం అతని కళ్ళలో సుడి తిరుగుతున్నాయి. ఆ నల్లని కళ్ళలో వెల్లివిరిసిన ఉద్రేకాలన్నిటినీ వ్యక్తం చేయగల పదాలని భాష యింకా సృష్టించు కోవాల్సే వుందనుకొంటాను.

నాకు ఆ కళ్ళు మాత్రమే తెలుసు ఆ కళ్ళు వ్యక్తం చేసిన నిశ్శబ్ద ఉద్రేక తరంగాలు తెలుసు. అవి నే బతికివున్నంత కాలం నన్ను వెన్నాడుతూనే వుంటాయి. అవి నా వెంట పయనిస్తూ నా బతుకులోని నిశ్శబ్ద క్షణాలంతటా వెచ్చగా గూడు కట్టుకొనే నిలిచివుంటాయి.

అతను వెళ్ళిపోయాడు. లోపలి నుంచి గడివేసి నేలకి అలానే పాతుకు పోయాను. కనుమరుగై పోతున్న అతని అడుగుల చప్పుడు విందామనే ఆశ తోనూ— గాలిలో పరుచుకొంటున్న ప్రమాదాన్ని పసిగడదామని నిలబడిపోయాను.

ఉన్నట్టుండి ఒక్కసారిగా కుక్కలు మొరిగాయి. ఒకటి గాదు— చాలా— చాలా కుక్కలు పిచ్చి, వెర్రి ఆవేశంతో మొరుగుతున్నాయి. అంతే, ఆ వెన్వెంటనే రాత్రి చీకట్ల నిశ్శబ్దాన్ని చీల్చుకొంటూ దూసుకుపోతున్న తుపాకీ తూటాల చప్పుడు విన్పించింది. ఒక్కసారిగా నా మనసు వేయివక్కలై పోయింది.

నన్ను నమ్మండి. నేను నిజం చెబుతున్నాను ఆ క్షణాల్లో అతని నుంచి ఏ కేక విన్పించలేదు భూమి పొరలు చీల్చుకుపోయేంత శబ్దంతో కురిసిన తూటాల చప్పుడు మాత్రమే విన్పించింది. ఏ మాత్రం ఎటువంటి సజీవ ఆక్రందన విన్పించలా. అవును ఎటువంటి ఆక్రందన విన్పించలేదు.

ఆ వెంటనే రోడ్డు పైకి చివరికి పరుగులు తీస్తున్న పోలీసుల భారీ బూట్ల శబ్దాలు పరుసగా విన్పించాయి.

పట్టీపట్టని విరామయ కునుకులో అమ్మ పడుకొనుంది. ఆమె శరీరం నిద్ర పోతున్నట్లున్నా, ఆమె సర్వేంద్రియాలు మేల్కొనే వుంటాయి. నిద్రకి మెలకువకి మధ్యన నిర్జన ప్రదేశంలో తేలిపోతున్న కేవల్ని ఆమె స్వప్నంలో చూస్తుంటుందేమో.

తూటాల శబ్దం వింటూనే ఒక్క వుదటున అమ్మ లేచి నుంచుంది. వెర్రి ఆవేశంలో ఆమె ముంగిట ద్వారం వద్దకు పరిగెత్తి, దభేలుమని తలుపులు తీసి వుత్తికాళ్ళతో అలానే రోడ్డుపై ఆ చీకటిలో కాల్పులు విన్పించిన దిసగా పరుగెత్తోంది. ఆమె హృదాంతరాళాన్ని చీల్చుకొంటూ దారిపొడుగునా అరుస్తోంది—

"చంపకండి! చంపకండి బాబూ! నా చిన్నారి కేవల్ని చంపకండి.. నా ముద్దుల కన్నని చంపకండయ్యా! నా పావురాయిని కాల్చకండయ్యా! నా బాబు కేసి కాల్చకండి. వాడు నా కొడుకయ్యా— నా ఒక్కగానొక్క కొడుకు— వాడేనయ్యా— వాడు— నా— కేవల్—"

అమ్మ చేతులు రెండు గాలిలోకి విసురుతూ పరుగులు తీస్తోంది. భుజం మీది దుప్పటి నేల జారిపోతోంది. జుత్తు విరబోసుకొని వుత్తికాళ్ళతో వీధిగుండా పరిగెడుతూ ఆ చీకటిని వేడుకొంటూ అర్థిస్తోంది.

→

అతి చౌక మాంసం

అస్గర్ వజాహత్

(అస్గర్ వజాహత్ రాసిన నాటకం ఆధారంగా విశాంత్ నాట్యమంచ్, ఢిల్లీ తయారుచేసిన వీధినాటిక)

(నలుగురు గాని, ఆరుగురు గాని పాత్రధారులు కొట్లాడుకుంటున్నట్టుగా నిలబడి పాడుతుంటారు)

హిందూ ముస్లిం సిక్కు క్రైస్తవ
ఎక్కడున్నారన్న దమ్ముల్లా
కొట్లాటే గద అను నిత్యం
కొట్లాటలూ గృహదహనాలు
ఎప్పుడు చూస్తే అప్పుడు ఆపదే
రోజూ కొట్లాటే రోజూ ఘర్షణే

(పాడుతూ పాడుతూనే జనంలో కలిసిపోతారు. మళ్ళీ నలుగురు పాత్రధారులు ఒకరొకరుగా వస్తారు.)

మొదటి వ్యక్తి : మతం పేరు మీద పిల్లల నాల్కలు చీరేస్తారు.

రెండో వ్యక్తి : మతం పేరు మీద స్త్రీల మానాలు తీస్తారు.

మూడో వ్యక్తి : మతం పేరు మీద మా వాళ్ళను సజీవ దహనం చేస్తారు.

నాలుగో వ్యక్తి : మతం పేరు మీద శవాల మార్కెట్లు నింపుతాం మేం.

(వేదిక మీదికి హిందూ, ముస్లిం నేతలు వస్తారు. భుజాల మీద చేతులు వేసుకుని ఆడుతూ పాడుతుంటారు.)

కుల మతాల నాయకులం
హిందువులం కాం, ముస్లింలం కాం

→ "వాణ్ణి చంపకండయ్యా!— నా చిన్ని కన్నని— నా వెన్నెల కూనని— చంపేయకండయ్యా—"

—అనువాదం

—శ్రీకాకుళరావు

మూలం- పంజాబీ కథాసంకలనం 'The slate of Life' నుంచి.

మోసగించటమే మాకొచ్చిన పని
హిందువులం కాం, ముస్లింలం కాం
కులమతాల నాయకులం మేం

హిందూనేత : మళ్ళీ ఎన్నికలు రాబోతున్నాయి. ఏ పనీ కాలేదు. మళ్ళీ వోట్లడుక్కోవాలి. నా నియోజక వర్గంలో హిందువులే ఎక్కువమందిగాని వాళ్ళేమో నేనంటే అసంతృప్తిలో ఉన్నారు.

ముస్లింనేత : నా నియోజక వర్గంలో ముస్లింల బలమే ఎక్కువ కాని నా వ్యవహారం చూసి వాళ్ళు కోపంగా ఉన్నారు.

(ఇద్దరూ కలిసి ఒకేసారి) : కాని మేం నాయకులం. కోపాన్ని ప్రేమగా మార్చుకోవడం ఎట్లాగో మాకు తెలుసు. మేం వాళ్ళకు ఏం చెపుతామంటే....

ముస్లింనేత : నా ఇస్లామ్ సోదరులారా, ఈ హిందువులు, ఈ కాఫిర్లు మిమ్మల్ని సర్వనాశనం చేశారు. మీ ఇళ్ళు కూలగొట్టారు. మిమ్మల్ని సజీవదహనం చేశారు. అయినా మీకు భయం వద్దు. ఇదిగో నేను మీ సేవకుణ్ణి.
మీ బంధువును. మీ సౌఖ్యం కోసం మీతోనే ఉన్నాను.

హిందూనేత : ఆర్యావర్త సుపుత్రులారా ! ఈ మ్లేచ్ఛ ముసల్మాన్లు మీ మాతృభూమిని ముక్కలు చేశారు. ఈ విదేశీయులకు ఇక్కడ ఉండే అధికారం ఎక్కడిది ? వీళ్ళు మీ మందిరాలు కూల్చేశారు. మీ తల్లులనూ చెల్లెళ్ళనూ చెరిచారు. మీ పిల్లల గొంతులు కోశారు. కానీ మీరేమీ కంగారు పడనవసరం లేదు. ఇప్పుడిక మీ వీరపుత్రుణ్ణి నేను మైదానంలో దిగాను.

ముస్లింనేత : (హిందూనేతతో) నేను నా ముస్లిం సోదరుల హృదయాలు గెలుచుకుంటాను.... వాళ్ళకు కర్ఫ్యూ పాసులిప్పిస్తాను గదా....

హిందూనేత : నేను నా హిందూ సోదరులకు సరుకులు పంచుతాను.

ముస్లింనేత : నేను జమానతులిప్పిస్తాను.

హిందూనేత : నేను మందిర నిర్మాణానికి చందాలు వసూలు చేస్తాను.

ముస్లింనేత : నేను మసీదులు మరమత్తు చేయిస్తాను.

హిందూనేత : హరహర మహాదేవ.

ముస్లింనేత : అల్లాహో అక్బర్.

(అల్లాహో అక్బర్ అని జపిస్తూ ఒక ముల్లా, రామ రామ అని జపిస్తూ ఒక

పూజారి వేదిక మీదికి పరుగెత్తుకొస్తారు. హిందూనేత ముందు పూజారి, ముస్లిం నేత ముందు ముల్లా నేల మీద కూచుని తమ నేతల పాదాలు పట్టుకుంటారు.)

ముస్లింనేత : (ముల్లాతో) ఏం కష్టం వచ్చి పడింది ముల్లాజీ ! ఎందుకంత కంగా రుగా ఉన్నారు?

ముల్లా : ఏం చెప్పేది మహాప్రభో.... మసీదుకు చందాల వసూళ్ళు తగ్గిపోయాయి. నా గౌరవం పడిపోతోంది. రోజురోజుకూ యువకులు మసీదుకు రావడం మానేస్తున్నారు.

హిందూనేత : సమస్యేమిటి పూజారిగారూ....

పూజారి : ఏం చెప్పను నేతాజీ.... దానాల్లేవు దక్షిణల్లేవు పూజలేదు పునస్కారం లేదు యజ్ఞ యాగాలు లేవు. ఎవరూ వాటి జోలికే పోవడంలేదు. ధర్మగ్లాని జరిగిపోతోంది....

హిందూనేత, ముస్లింనేత (ఒకేసారి) : ఇద్దరూ లేచి నిలబడండి.... చెప్పినట్టు చేయండి.... అయిదు వేళ్ళు నేతిలో ముంచండి.... అగ్నిలో ఆజ్యం పోయండి.... (వెనుక నుంచి ఒక గొంతు వినబడుతుంది. మరి దేశం ఏమయిపోతుంది అని) దేశం మండిపోతుంది.

(నలుగురూ కలిసి ఒకేసారి పాడుతారు)

సారే జహాఁ సె అచ్ఛా
హిందోసితా హమారా.... హమారా....
హమ్ బుల్‌బులే హై ఇస్‌కీ యే గుల్‌సితాఁ హమారా.... హమారా....
సారే జహాఁ సె అచ్ఛా
మజ్‌హబ్ నహీ సిఖాతా ఆపస్ మె బైర్ రఖ్‌నా
హిందీ హై హమ్ — హిందీ హైహమ్ — వతన్ హై
హిందోసితా హమారా — హమరా —
సారే జహాఁ సె అచ్ఛా —

ముస్లిం నేత : ముల్లాజీ (చేతిలో ఒక పొట్లం చూపుతూ) ఇది చూస్తున్నారా ?

ముల్లా : అందులో ఏమున్నది ప్రభూ ?

ముస్లిం నేత : ఇందులో ఉన్నది పందిమాంసం.

ముల్లా : ఎంత మాట ఎంతమాట — పాపం శమించుగాక — దానితో ఏం చేద్దాం ప్రభూ ?

ముస్లిం నేత : ఏం చేస్తాం ? ఏమిటి ముల్లాజీ, మీరు మరీ చిన్నపిల్లల్లాగ మాట్లాడుతున్నారు. ఆలోచించండి, ఆలోచించండి. దీని నుంచి మనకేం మేలు జరుగుతుంది?

ముల్లా : (ఆలోచించడానికి ప్రయత్నిస్తూ) ఓహోహో— మసీదులో ఈ మాంసం పడేయించాలి— కల్లోలాలు రెచ్చగొట్టాలి— ఔనానానాను—

ముస్లిం నేత : అబ్బ. మీ తెలివే తెలివి !

ముల్లా : మీ సాహాస ఫలితమే కాదూ —

(ముస్లింనేత, ముల్లా ఫ్రీజ్ అవుతారు)

హిందూ నేత : (చేతిలో ఒక పొట్లం చూపుతూ) పూజారి గారూ, ఇది చూస్తున్నారా ?

పూజారి : ఏమిటండీ అది.

హిందూనేత : ఆవు మాంసం.

పూజారి : అందులో — రామరామ — రామరామ — దానితో ఏంచేస్తారండీ ?

హిందూనేత : ఏం చేస్తాం ? నిన్ను పదేళ్ళనుంచి పోషిస్తున్నాను. ఇంకా ఏం చేస్తాం అని అడుగుతున్నావా ? ఇది మందిరంలో పడేయాలి. ఘర్షణలు రెచ్చగొట్టాలి.

పూజారి : అర్థమయిందండీ — అన్నీ అర్థమైనాయి దొరవారూ — సమస్తమూ అర్థమయింది.

హిందూ, ముస్లిం నేతలు : (ఒకేసారి ముల్లాతోనూ పండితుని తోనూ) మీరిద్దరూ మీమీ పొట్లాలుపైకి లేపండి— వెళ్ళండి. ఆవును మందిరంలో చేర్చండి. పందిని మసీదులో చేర్చండి —

(నేతలిద్దరూ వేదిక మీదినుంచి బైటికి వెళ్ళిపోతారు. పూజారి, ముల్లా పొట్లాలు పట్టుకుని వేదిక పైనే ఉంటారు. ఇద్దరూ భయంభయంగా వెనక్కి వెనక్కి జరుగుతుండగా ఇద్దరి వీపులు ఒకదానికొకటి కొట్టుకుంటాయి. ఇద్దరూ ఒకేసారి ఉలిక్కిపడతారు. ఆ సమయంలోనే గూండా వేదిక మీదికి ప్రవేశిస్తాడు.)

గూండా : (పూజారితో) ఆఁ వచ్చేశా — పూజారిగారూ, మాతో మీకేదో పని పడిందే — (పొట్లం చూసి) అచ్చా, మళ్ళీ అదే పాత పనా ? (పూజారి పొట్లాం ఇవ్వబోతాడు. గూండా ఆ పొట్లాం తోసేస్తూ) — ముందు సరు కివ్వవోయ్ — (పూజారి డబ్బు ఇస్తాడు)

గూండా : (డబ్బు తీసుకుని) ఏమయ్యో ఇంతేనా ? నువ్వయితే మొత్తం పట్నాన్ని దోచుకుంటావుగాని, నాకు మాత్రం ఇంతేనా ? రానీ రానీయ్ ఇంకా —

(పూజారి మరికొంత డబ్బు ఇస్తాడు. గూండా డబ్బు, పొట్లం తీసుకుని ముల్లా దగ్గరికి వెళతాడు.)

గూండా : (ముల్లాతో) ఏమిటి ముల్లాజీ, ఎందుకో నాకు పని పెట్టారు ? (ముల్లా చేతిలో పొట్లం చూసి) ఓహో, అయితే నువ్వు కూడ — సరే, సరే — అసలు సరుకు తియ్. అరె తొందరగా — నా టైం చెడగొట్టకు —

(ముల్లా డబ్బు ఇస్తాడు)

ఇంతేనా — ఇంకా తియ్ —

(ముల్లా మరికొంత డబ్బిస్తాడు)

ఆఁ ఇక వెళ్ళి పొండిక్కణ్ణించి. మీ పని అయిపోయినట్టే.

(ముల్లా వెళ్ళిపోతాడు)

(వేదిక మీదన ఒక పక్క హిందూనేత, పూజారి, మరికొందరు ప్రజలు ఆలయంలో పూజ చేస్తుంటారు. మరో పక్క ముస్లింనేత, ముల్లా, కొందరు ప్రజలు నమాజు చదువుతున్నట్టుంటారు)

ఆలయంలోంచి : రఘుపతి రాఘవ రాజారాం, పతిత పావన సీతారాం

(అదే అదే భజన సాగుతుంటుంది)

మసీదులోంచి : అల్లాహో అక్బర్

(అదే అదే ప్రార్థన వినబడుతుంటుంది)

(ఇద్దరి మధ్యలోకి గూండా వచ్చి రెండు పొట్లాలను వరుసగా ఆలయంలోనూ మసీదులోనూ పడవేస్తాడు. పొట్లాలపై దృష్టి పడగానే రెండు పక్కలా గందరగోళం మొదలవుతుంది. రెండు వైపులా జనం ఆయుధాలు పట్టుకుని వేదిక మీదికి వస్తారు)

హిందువులు : హరహర మహాదేవ (నినాదాలు ఇస్తుంటారు)

ముస్లింలు : అల్లాహో అక్బర్ (వినాదాలు ఇస్తుంటారు)

హిందూనేత : ఈ మ్లేచ్ఛ ముస్లింలు మన మందిరంలో గోమాంసం పడవేశారు — మన మందిరాన్ని అపవిత్రం చేశారు.

పూజారి : మనం ఈ వెధవల రక్తం తాగాలి.

ముస్లిం నేత : ఈ హిందువులు, ఈ కాఫిర్లు మన మసీదులో పంది మాంసం పడేశారు. వీళ్ళు మన మసీదును అపవిత్రం చేశారు.

ముల్లా : మనం ఈ వెధవలను నరకానికి పంపించాలి.

హిందువులు : హరహర మహాదేవ.

ముస్లింలు : అల్లాహో అక్బర్.

(వేదికమీద ఘర్షణ జరుగుతున్న దృశ్యాలు. వినాదాల వడి పెరుగుతూ ఉంటుంది. ఈ మధ్యలో ఒక "మామూలు మనిషి" ఇద్దరి మధ్యకు వస్తాడు.

మామూలు మనిషి : (గట్టిగా) ఆపెయ్యండి ఈ కొట్లాట — ఆగండాగండి. ఒక్క మాట వినండి.

(రెండు వైపులా గొడవ ఆగిపోతుంది)

దయచేసి సంగతేమిటో చెపుతారా ?

పూజారి : మా మందిరాన్ని అపవిత్రం చేశారు. హరహర మహదేవ.

ముస్లిం నేత : ఇదిగో చూడండి. ఈ హిందువులు మా మసీదును అపవిత్రంచేశారు. అల్లాహో అక్బర్.

హిందువులు : హరహర మహాదేవ

ముస్లింలు : అల్లాహో అక్బర్.

మామూలు మనిషి : గోల చెయ్యకండి. మీరు హిందువులూకారు, ముస్లింలూ కారు. మీరు కేవలం పోట్లాటల కోసమే బజార్లో కొచ్చినట్టున్నారు.

పూజారి : మేం హిందువులం. ఇదిగో చూడు మా దగ్గర శంకరాచార్యుల వారు ఇచ్చిన ప్రమాణ పత్రం ఉంది. హరహర మహాదేవ.

ముస్లింలు : మేం ముస్లింలం. ఇదిగో చూడు మా దగ్గర ఇమామ్ బుఖారీ ఇచ్చిన సర్టిఫికేట్ ఉంది. అల్లాహో అక్బర్.

(ఈ మధ్యలో మామూలు మనిషి రెండు పొట్లాలనూ జాగ్రత్తగా పరిశీలిస్తాడు)

మామూలు మనిషి : ఈ గోల ఆపండి. ఇది పంది మాంసమూ కాదు, ఆవు మాంసమూ కాదు.

హిందూనేత : కాదు కాదు, ఇది గోమాంసమే.

ముస్లింనేత : కాదు కాదు. ఇది పంది మాంసమే.

(ఇద్దరూ వినాదాలివ్వడం మొదలుపెడతారు)

మామూలు మనిషి : కాదు, నా అన్నలారా — ఇది పందిమాంసమో, ఆవు మాంసమో కాదు. ఒక్కసారి శ్రద్ధగా చూడండి — ఇది ఆవు మాంసమయితే ఇందులో నరాలు దారాల్లా కనబడతాయి — ఏవి అవి ? — ఇది పంది మాంసమయితే ఇందులో కొవ్వు ఉండి ఉంటుంది — ఏది ?

(హిందువులకూ ముస్లింలకూ మాంసం చూపెడతాడు)

హిందూనేత, ముస్లింనేత : మరి ఏం మాంసమిది ?

మామూలు మనిషి : ఇది మనిషి మాంసం, నర మాంసం.

హిందూనేత : కాదు ఇది గో మాంసమే.

ముస్లింనేత : కాదు ఇది పంది మాంసమే.

మామూలు మనిషి : కాదు. కానే కాదు — నేను ప్రపంచమంతా తిరిగాను. పంది మాంసాన్నీ, ఆవు మాంసాన్నీ నేను పోల్చలేననుకున్నారా ? దీని రంగు చూడండి. ఇందులో నరాలు చూడండి. కచ్చితంగా ఇది మనిషి మాంసమే.

హిందువులు, ముస్లింలు : నువ్వు నిజమే చెపుతున్నావా ?

మామూలు మనిషి : ఆఁ నేను పూర్తిగా నిజమే చెపుతున్నాను. ఇది మనిషి మాంసమే.

హిందూనేత : (పూజారిని ఒక పక్కకు తీసుకువెళ్ళి) పూజారిగారూ, వీడెక్కడ్నించి వచ్చి పడ్డాడండీ. మొత్తం వ్యవహారాన్ని నాశనం చేశాడు.

(ప్రజలతో) హిందూ ధర్మ రక్షకులారా. పదండి, ఇది ఆవు మాంసం కాదు. ఇది ఎవరో మనిషి మాంసం అని తేలిపోయింది.

పూజారి : పదండి భక్తులారా, మనిషి మాంసంతో ఆలయం అపవిత్రం కాదు.

ముస్లింనేత : (ముల్లాను ఒక పక్కకు తీసుకువెళ్ళి) : అనూం ముల్లాజీ, వీడెవడండీ బాబూ. మంచిపని మట్టిలో కలిపేశాడు.

(ప్రజలతో) ప్రజలారా, పదండి. మన ఇస్లాం గౌరవం రక్షించబడింది. ఇది ఎవరో మనిషి మాంసమని తేలిపోయింది.

మతంపేర మారణకాండను మానవులుగా ప్రతిఘటిద్దాం సెక్యులర్, ప్రజాస్వామిక సంస్కృతిని కాపాడి సుదృఢం చేద్దాం.

ఈసారి రక్తవర్షం చాల కురిసింది
ఓట్ల వర్షంకూడ బాగానే కురుస్తుంది.

అమరకవి గోరఖ్‌పాండే చెప్పినట్లు మత కల్లోలాలుగా పిలవబడుతున్న ఈ దారుణ మారణకాండ, విధ్వంసరచన, విశ్వాసాలు, విలువలపై దాడి స్వార్థ రాజకీయాల ఫలితమనేది ఇవ్వాళ సామాన్యుడుకూడా గ్రహించాడు. బాకులకు, కత్తులకు విషాగ్నాలకు, గూండాయిజానికి, దోపిడీకి అధికార దాహానికి మతమూలేదు మానవత్వమూ లేదు. ఖాకీలకూ, తూటాలకూ, కర్ఫ్యూలకుకూడ మతంలేదు. కనుక ఈ రెంటికీ అతీతంగా, రెంటికీ ఈవల ప్రజాస్వామిక, సెక్యులర్ మానవ సంస్కృతిని నిర్మించే బాధ్యతను ఇవ్వాళ రచయితలు, కళాకారులు చేపట్టాల్సి వున్నది. సాహిత్యం కళలుమానవ అనుబంధాలను సుదృఢం చేసి, మానవ సంబంధాలను మెరుగుపరచి, స్నేహ, ప్రేమ భావాలను పెంపొందించి అవగాహనను, చైతన్యాన్ని వికసింపచేసే భావోద్వేగ సాధనాలు. తర్కం, హేతువు మాత్రమే పనిచేయని నమ్మకాలు, విశ్వా

ముల్లా : మసీదు అపవిత్రమై పోలేదు. మనిషి మాంసంతో మసీదు అపవిత్రం కాదు అందరూ ఇక కదలండి — ఎవడో మనిషి మాంసం — మొత్తం ఆశలన్నీ కుప్పగూలి పోయాయి.

మామూలు మనిషి : (ప్రజలతో) : ఇది ఆవు మాంసం కాదంటే మందిరం అపవిత్రం కాలేదట—ఇది పంది మాంసం కాదంటే మసీదు అపవిత్రం కాలేదట. కాని మనిషి మాంసం, మనిషి మాంసం — దీనికేమీ విలువ లేదా? మందిరాల పేరుమీద, మసీదుల పేరుమీద వీధుల్లో ప్రవహించే రక్తానికేమీ విలువ లేదా? మనిషి మాంసానికేమీ గుర్తింపు లేదా ? —

(పాత్ర ధారులందరూ మళ్ళీ వేదిక మీదికి వచ్చి 'హిందూ ముస్లిం సిక్కు క్రైస్తవ ఎక్కడున్నా రన్నదమ్ముల్లా' అనే పాట మళ్ళీ పాడుతారు.)

సాలు ప్రబలినచోట అనుభూతి, భావ తీవ్రతల ఆర్తితో కూడిన ఈ మా హృదయ ఘోష అయినా వినిపిస్తుందని ఆశిస్తున్నాం.

రెండువారాలుగా నగరంలో, ముఖ్యంగా పాతబస్తీలో, రంగారెడ్డిజిల్లాలో జరిగిన అమానుష హత్యాకాండలో, విధ్వంసం వెనుక అధికారదాహం, భూదాహం, ఎన్నికల రాజకీయాలు వున్నాయనేది నిర్వివాదాంశం. విశ్వాసమే అలంబనలయిన చోట అవిశ్వాసాన్ని విత్తడం అసాధ్యమేమీకాదు. కనుక విసరగా విసరగా మత విద్వేషాలు రగలడం వింతకాదు. ఇవ్వాళ ఇది హైదరాబాదులోనే కాదు దేశ వ్యాప్తంగా అలీఘడ్, ఆగ్రా, అహ్మదాబాదు, కాశీ, కాన్పూరు, మీరట్ రాజస్థాన్‌ల దాకా చూస్తున్నాం.

దాదాపుగా మత ప్రాతిపదికపై భౌగోళికంగా అపరిచితుల్లా విడిపోయిన ప్రజలను ఈ కల్లోలాలు మరింతగా దూరంచేసి కాలనీలుగా విడగొట్టే ప్రమాదం వుంది. అందుకే జస్టిస్ కృష్ణారావు కమిషన్ చేసిన నిర్దిష్ట సూచనలు అమలుచేయాలని మేంకూడా డిమాండు చేస్తున్నాం పరిపాలనా సంబంధమైన కార్యాలయాలు, కార్యకలాపాలు పాతనగరానికి విస్తరించాలి. సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు పాతనగరం ఒకటుందనే విషయాన్ని విస్మరించరాదు. మనం కబీర్, తులసీదాస్‌ల వారసత్వాన్ని కాకున్నా కనీసం మగ్దూం, మాడపాటి సంస్కృతులనయినా హైదరాబాదులో పునరుద్ధరిద్దాం.

ప్రగతిశీల, సెక్యులర్ భావాలు గల వివిధ సాహిత్య సాంస్కృతిక సంస్థల, రచయితల, కళాకారుల సమష్టి కృషిగా అవిర్భవించిన ఈ మతతత్వ వ్యతిరేక సాంస్కృతిక వేదిక దాదాపు 70 మంది రచయితల, కళాకారుల సంతకాలతో విడుదల చేస్తున్న ఈ కరపత్రం మా ఆశయ ప్రకటన మాత్రమే.

1) ఈ కరపత్రాన్ని ఉర్దూలో కూడ వేసి తెలుగు, ఉర్దూ కరపత్రాలను విశ్వాసాలు విచ్ఛిన్నమైన ప్రాంతాల్లో పంచుతూ మా ప్రచారాన్ని ప్రారంభిస్తాం. ఉర్దూ కరపత్రాన్ని పాతనగరంలో విడుదల చేస్తాం.

2) మత విద్వేషాలను ఖండిస్తూ, సామరస్యాన్ని పెంపొందించే చిత్రాలు, ఫోటోలు, కార్టూన్ల కళా ప్రదర్శనను జనవరి రెండవవారంలో ప్రారంభించి పలుతావుల్లో ప్రదర్శిస్తాం.

మతతత్వాన్ని వ్యతిరేకించండి!

సెక్యులర్ విలువల్ని కాపాడండి!!

అత్యంత కల్లోల, సంక్షుభిత సమయాల్లో మౌనం పాటిస్తే చరిత్ర మనల్ని క్షమించదు

మొన్న అలీగఢ్‌లో, నిన్న ఫైజాబాద్‌లో ఇవ్వాళ హైదరాబాద్, అహ్మదాబాద్‌లలో తెగిపడ్డ శిరస్సులు, ఆక్రోశంతో, ఆవేశంతో తమకున్న జీవించే స్వేచ్ఛని హరించివేసిన ఈ సభ్యసమాజాన్ని ప్రశ్నిస్తే మనమేం సమాధానం చెప్పగలం? అందమైన ఊహలతో ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టిన బాలలు ఛిద్రం చెయ్యబడ్డ తమ జీవితాలకు కారకులెవ్వరని నిలదీసి ప్రశ్నిస్తే బాధ్యత గల పౌరులుగా మనమేం సమాధానం చెప్పాలి? "గతమంతా తడిసె రక్తమున కాకుంటె కన్నీళ్ళతో" అన్న శ్రీశ్రీ మాటలు గతానికే పరిమితం కాకుండా వర్తమానంలో మనల్ని వెంటాడుతున్నాయి. గత రెండు నెలల దేశచరిత్ర రక్తము, కన్నీళ్ళు కాక మరేముంది. ఈ రెండు నెలలుగా మతం పేరున సాగుతున్న కరాళ నృత్యం వెనకనున్న శక్తులను నగ్నంగా నడివీధిలో నిలబెట్టి ప్రశ్నించకపోయినట్లయితే ఈ దేశ ప్రజలను ప్రేమించే రచయితలుగా, కళాకారులుగా మన అస్తిత్వానికి విలువేమిటి?

రెండు శతాబ్దాలపాటు మనల్ని పాలించి పీల్చి పిప్పి చేసిన బ్రిటిష సామ్రాజ్య

---

3) పాతనగరంలో మత సామరస్యాన్ని పెంపొందించే ముషాయిరా/కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తాం.

4) సెక్యులర్, ప్రజాస్వామిక భావాల కవితా సంకలనాన్ని వెలువరిస్తాం.

5) సెమినార్, ర్యాలీ, బహిరంగసభలు నిర్వహిస్తాం.

ఇందుకు సెక్యులర్, ప్రజాస్వామిక శక్తుల సహాయ సహకారాలు మాత్రమే కాదు తమతమ మత విశ్వాసాలు, వ్యక్తిగతంగా, ప్రైవేటుగా తమమేరకు వుంచుకుంటూనే మత సామరస్యాన్ని సమానత్వాన్ని కోరుకునే మతతత్వ వ్యతిరేకులయిన మతస్థులందరినీ, అన్నిటికన్నా ఉన్నతమైన మానవతా మత వాదులందరినీ సంఘీభావం తెలుపగోరుతున్నాము.

19-12-90. — మతతత్వ వ్యతిరేక సాంస్కృతిక వేదిక.

వాదం ఈ దేశాన్ని పక్షిలి పెడుతూ విభజించి పాలించమనే నికృష్ట వారసత్వాన్ని అందించి వెళ్ళింది. ఆ వారసత్వాన్ని కొనసాగించడంలో మన పాలకులు సాధించిన ప్రగతి ఫలితంగా నేడు అన్ని రకాల మతతత్వ, మత దురహంకార శక్తులు తమ వికృత రూపాన్ని ప్రదర్శిస్తున్నాయి. మతవాదం రాజకీయ సామాజిక వాదంగా మారి సకల మానవ, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోంది.

సామ్రాజ్యవాదుల కుట్రల ఫలితంగా జాతీయోద్యమ కాలంలోనే మతవాద సంస్థలు పుట్టుకొచ్చి జాతీయోద్యమంలో ప్రగతిశీల విలువలకు భిన్నంగా మతవాద విలువల్ని ప్రవేశ పెట్టాయి. 1857 ప్రథమ భారతస్వాతంత్ర పోరాటంలో హిందూ ముస్లింల ఐక్యతను గుర్తించిన బ్రిటీష్ పాలకులు, తిరుగుబాటు అణచివేత అనంతరం హిందూ ముస్లింల మధ్య విద్వేషం రగిలించే కుట్రలకు పూనుకున్నారు. నౌఖాళీ మత కల్లోలాల మారణకాండకు భూమిక నేర్పరచే రెండు జాతుల సిద్ధాంతానికి రూప కల్పన చేశారు. పాకిస్తాన్, భారత్‌గా రెండు దేశాల ఆవిష్కరణతో-ఉపఖండంలో ఈ సమస్య పరిష్కరింపబడకుండా మత విభజనతో పాలకులు రాజ్యాధికారం కొన సాగించే విష సంస్కృతిని వారసత్వంగా యిచ్చారు. చరిత్రకు, సంస్కృతికి మత పరమైన విశ్లేషణ యిచ్చారు. చరిత్రను, హిందూయుగం, ముస్లింయుగం, బ్రిటీష్ యుగంగా విభజించి, ముస్లిల రాకతో అంధకార యుగం ప్రారంభమైందనే వాదం ప్రబలంగా ముందుకు తీసుకొచ్చారు.

నౌఖాళీ గాయాలు మానకుండానే ఆ కంటితడి ఆరకుండానే గత నాలుగు దశాబ్దాల కాలంలో ఏదో ఒక రూపంలో దేశంలో మత కల్లోలాలు సంభవిస్తూనే ఉన్నాయి. 1970 తర్వాత దేశరాజకీయ సామాజిక జీవనంలో మతవిద్వేష వాతా వరణం ఉధృతంగా కొనసాగి హింసాదౌర్జన్యాల స్థాయి పెరిగి, పెరిగి కొత్త ప్రాంతా ల్లోకి మతకల్లోలాలు వ్యాపించి బాబ్రీమసీదు-రామమందిరం సమస్యతో మొత్తం దేశం సుడిగుండంగా మారటమేకాక, మనుగడకే ప్రమాదమేర్పడింది. 1947 తర్వాత నిజమైన శాస్త్రీయ, ప్రజాతంత్ర, లౌకిక విలువలను ప్రతిష్టించడంలో పాలకుల వైఫల్యంతో మతవాదం రంగప్రవేశం చేసింది. మత సమానత్వం పేర, మతసంప్ర దాయాల్నీ విలువల్నీ విద్యద్వారా, ప్రచార సాధనాల ద్వారా ప్రచారం చేసే ప్రభుత్వ తప్పుడు సెక్యులర్ విధానాలను ప్రశ్నించాలి. వ్యతిరేకించాలి. సెక్యులరిజం ఒక జీవన విధానంగా వుండాలి.

వివిధ మతాలు చారిత్రక దశల్లో నిర్వహించిన పాత్ర గురించి భిన్నాభిప్రాయాలు వుండవచ్చు. కానీ ప్రస్తుతం మతానికుండవలసిన స్థానంపై భిన్నాభిప్రాయాలు వుండవలసిన అవసరం లేదు. మతం వ్యక్తిగత వ్యవహారంగా వుండాలి. రాజ్యవ్యవస్థకు మతానికి ఎలాంటి సంబంధమూ వుండకూడదు. మతపరమైన సంస్థలకు ప్రభుత్వాధికారంతో ఎలాంటి సంబంధమూ వుండరాదు. సెక్యులరిజం అంటె మత సమానత్వం పేరిట అన్ని మతవాదాలు, సనాతన భావాలు రచ్చకెక్కి రాజకీయ సామాజిక జీవనంపై ఒత్తిళ్ళు కలిగించడం, సంక్షోభ వాతావరణం సృష్టించడం కాదు. సెక్యులరిజం అంటె మతంతో సంబంధం లేని రాజకీయ సమాజం అని అర్థం.

మతంవేరు, మతతత్వం వేరు. మతతత్వం అంటె మతం ఆధారంగా రాజకీయ అవసరాల కోసం ప్రజలను సమీకరించడం. మత ప్రాతిపదికగా రాజకీయ కార్యాచరణను రూపొందించడం. మతాలకూ రాజకీయాలకు గల లంకెను ఛేదించకుండా మతవాదం తగ్గదు. లౌకిక విలువల పునరుద్ధరణ జరగదు.

అన్నిరకాల మతతత్వానికి దోహదం చేస్తున్న శక్తుల్ని ప్రశ్నించాలి. "ఇస్లాం మతానికి ప్రమాదం" అనే నినాదంతో లేనిపోని భయాలను లేవనెత్తి ముస్లిం ప్రజా సమూహాలను తప్పుదారి పట్టించే ముస్లిం మతతత్వవాదులనీ రాజకీయ పదవులు పొందేకుట్రే. ముస్లింలను మెజారిటీ ప్రజలకు శత్రువులుగా చిత్రీకరించి, తప్పుడు చారిత్రక వ్యాఖ్యానాలతో, హింసాదౌర్జన్య పద్ధతులతో, బలప్రదర్శనతో నేడు భారతీయ జనతాపార్టీ, విశ్వహిందూ పరిషత్తు, ఆర్. ఎస్. ఎస్., శివసేనల వీరవిహారమంతా రాజ్యాధికారంకోసం సాగుతున్న నాటకమే కానీ మతభక్తికాదు.

మతవాదాన్ని పెంచి పోషించి రాజకీయ లబ్ధిపొందటంలో ఏ పాలకపార్టీ తక్కువకాదు. నిస్సహాయులైన పీడింపబడుతున్న ముస్లిం మహిళలకు షాబాను కేసు సందర్భంగా సుప్రీంకోర్టు యిచ్చినతీర్పు చిన్న ఆశాకిరణం. అమాత్రపు సంస్కరణలను సైతం భరించలేని ముస్లిం మతతత్వవాదులను సంతృప్తి పరచటానికి సుప్రీంకోర్టు తీర్పుకి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి, ఆ చేత్తోనే హిందూ మతతత్వవాదులను సంతృప్తిపరచటానికి వివాదాస్పద బాబ్రీమసీదు-రామజన్మభూమి సముదాయాన్ని తెరిపించారు. 1984 లో ఇందిరాగాంధీ హత్యానంతరం సిక్కుల

ఊచకోతని పర్యవేక్షించి హిందూమత తత్వవాదుల అండదండలు సంపాదించారు. మతతత్వవాదులను సంతృప్తిపరిచే ఈ కుట్రలే మతవాదం పరాకాష్టకు చేరుకునేందుకు దోహదపడ్డాయి.

"గత ఎన్నికల్లో కాంగ్రెస్ (ఐ) వాడుకున్న హిందూ తురుపు ముక్కను ఈసారి మేం పూర్తిగా వుపయోగించుకోబోతున్నాం" అని వాజ్‌పాయి ప్రకటించారు. గత ఎన్నికల్లో రాజీవ్‌గాంధీకి అండగా నిలబడ్డ విశ్వహిందూ పరిషత్తు, ఆర్. ఎస్. ఎస్. లు బి. జె. పి. కి పట్టం కట్టేందుకే అద్వానీని రథం ఎక్కించి రామమందిర నిర్మాణం పేరిట 'కరసేవ' చేపట్టాయి. కమలం, గుర్తుతో బయల్దేరిన అద్వానీ రథ యాత్ర అధికారం కోసమో, రామభక్తి పరాయణత్వమో విజ్ఞులైన ప్రజలే ఆలోచించాలి. మొన్నటిదాకా జపించిన గాంధియన్ సోషలిజాన్ని గాలికొదిలేసి రాజకీయ ఆర్థిక సమస్యల మీద ప్రజలను సమీకరించే శక్తి లేక రామనామమంత్రం జపించే ఈ తప్పుడు విధానాన్ని వ్యతిరేకించాలి.

రాజకీయాల్లో మతతత్వం పెరిగిన క్రమంలో బాబ్రీమసీదు రామజన్మభూమి అత్యంత వివాదాస్పదం చేయబడింది. ఒకనాడు రామ్‌చబూత్ర వద్ద రామమందిర నిర్మాణం అనే మహంతల డిమాండ్, 1949 తర్వాత మసీదు ఆవరణనే మందిర స్థలం అనే డిమాండుగా, 1990 లో మసీదు కూలగొట్టి మందిర నిర్మాణమనే మత వాద డిమాండ్‌గా మారటానికి మతవాద రాజకీయాలే ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. రామమందిర నిర్మాణానికి ఎవరూ వ్యతిరేకులం కాదు. కానీ ఆ నిర్మాణం మైనారిటీ ప్రజల విశ్వాసాలను, కట్టడాలను ధ్వంసం చేసి మాత్రం కాదు.

అయితే మధ్య యుగాల్లో ప్రార్థనా మందిరాల కూల్చివేత వెనక రాజకీయ, ఆర్థిక స్వభావాన్ని చూడకుండా మతదృష్టితో చూసి, గతంలోని దురదృష్టకర ఘటనల ఆధారంతో మతవాదులు తమకు అనుకూలవాదంతో ముందుకొచ్చారు. దేశంలో ఏ ముస్లిం రాజు ఆలయాలజోలికే వెళ్ళలేదని కాదు. ఆ మాటకొస్తే పరమతస్తుల ఆలయాలను, పవిత్ర ప్రాంతాలను ధ్వంసం చేయడంలో విజేతలందరూ ఒకటే. అందుకు చరిత్రలో లెక్కలేనన్ని ఆధారాలున్నాయి. నేటి ప్రసిద్ధ హిందూ దేవాలయాల్లో అధిక భాగం బౌద్ధారామాలే. మనదైనందిన జీవితంలో ఈ సమస్య ఒక స్థలానికి సంబంధించిన చిన్న వివాదంగా మొదలై నెమ్మదిగా పెరిగి పెరిగి భారత చరిత్రను ఒక అంచుకు నెట్టగల ప్రమాదస్థాయికి చేరుకుంది.

రామజన్మభూమికి చారిత్రక ఆధారం ఎవరూ కల్పించలేరు. బాబ్రీమసీదు ఉనికిని ఎవరూ ప్రశ్నించలేరు. రామాలయం కూల్చి మసీదు కట్టారన్న వాదం తప్పో, కాదో తేల్చి చెప్పే అధికారం తమకే దత్తం చేసుకున్న విశ్వహిందూ పరిషత్తు ధోరణిలో చారిత్రకత లేదు, తార్కికత లేదు, శాస్త్రీయత లేదు. (షాబానో కేసులో) ఖురాను షరియత్‌ల విషయంలో తలదూర్చే అధికారం సుప్రీంకోర్టుకిలేదన్న ముస్లిం మత తత్వానికి, ఇప్పుడు కోర్టు తీర్పుకి విలువలేదంటున్న హిందూ మతతత్వానికి తేడా లేదు.

దేశంలో మసీదులన్నీ ఎప్పుడో ఆలయాలుగా వుండివుంటాయని హిందూ మతతత్వవాదుల వాదం, దాదాపు 3500 మసీదుల్ని మందిరాలుగా మార్చాలన్న ధ్యేయం, భారత రాజకీయాల్లో మతవాదం రామజన్మభూమికి పరిమితం కాబోదన్నది స్పష్టం చేస్తున్నది. చరిత్రలో జరిగిపోయిన సంఘటనలకు తప్పుడు వ్యాఖ్యానాలు రుద్ది వర్తమానంలో రాజకీయ ప్రయోజనం కోసం మతప్రాతిపదికగా 'విముక్తి' పేరిట విధ్వంస కార్యక్రమాలు చేపట్టడం అనాగరిక చర్య, అమానుష్యచర్య. హిందూ మత తత్వం హిందూ రాజ్య నిర్మాణవాదంగా రూపుదిద్దుకోవడం మొత్తం భారతదేశ చరిత్ర-సమగ్రతలకు, సంస్కృతికి ప్రమాదకరమని, మతజాతీయ వాదం అంతిమంగా ఫాసిజంగా మారుతుందనీ, నేటి భారత రాజకీయాలు హిట్లర్ వాదానికి పునర్జన్మని ప్రసాదించే వైపు ప్రయాణింపరాదని ప్రజాతంత్రవాదులు స్పష్టం చేయాలి. లౌకిక ప్రజాతంత్ర విలువలపట్ల గౌరవంగల మేధావులు, రచయితలు, కళాకారులు ఈ సమస్యపై గతంలో చూపిన నిర్లక్ష్యం మాని తమ చైతన్యవంతమైన పాత్రను నిర్వ హించకుంటె రానున్న చరిత్ర మనల్ని క్షమించదు.

ఒక ప్రజాస్వామిక లౌకిక రాజ్యంలో మెజారిటీ ప్రజలు మైనారిటీ ప్రజలపట్ల చూపవలసిన ప్రజాస్వామిక ఔదార్యాన్ని ప్రజలందరూ ప్రదర్శించాలి. వివాదం కాని అంశం అత్యంత వివాదాస్పదం చేయబడిన నేపథ్యంలో, రాజకీయాలే ప్రధాన భూమిక కానీ, మతవిశ్వాసాలు కావు, కాబట్టి ఈ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్క రించుకునే అవకాశం ఏ మాత్రమైనా మిగిలి ఉంటే ఆ దిశగా మార్గాలను వెంటనే అన్వేషించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ సందర్భంలో ప్రభుత్వం మతవాదులకు లొంగరాదని కోరుతున్నాం.

రామజన్మభూమి సమస్యతో మతతత్వం ఆగేది కాదు. మతప్రాతిపదికగా

విభజన జరిగేవరకూ అది నిద్రపోదు. ఈ క్రమంలో రాజకీయ వ్యవస్థ ప్రమాదాల అంచుకు చేరుకుంటుంది. కొబట్టి మతకలహాలకు, మతప్రాతిపదికపై జరిగే విభజనకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా నిలబడాలని పిలుపునిస్తున్నాం.

మతకల్లోలాల అణచివేత పేరున కర్ఫ్యూలు, కాల్పులు, దిగ్బంధ పరిస్థితుల్లోకి జనజీవితం నెట్టివేయబడుతుంది. మతతత్వం చిమ్మిన విషపు వాతావరణం నుండి రక్షణ కోసం జనసమూహం పోలీసులు సైన్యంపై ఆధారపడే క్రమంలో రాజ్యహింస చట్టబద్ధమవుతుంది. రాజ్యాంగ యంత్రపు అభయహస్తం లేకుండా రాజకీయ నాయకులు సామరస్యత చిలకపలుకుల ఊరడింపులు లేకుండా బ్రతకలేమనే భ్రమాన్విత వాతావరణం కల్పించబడుతుంది. శాంతికోసం రక్షక బలగాలపై ఆధారపడే రాజకీయ వ్యవస్థ చివరకు ప్రజాస్వామికానికి తిలోదకాలిచ్చి ఫాసిజానికి తనను తాను సమర్పణ చేసుకుంటుంది.

మతాన్ని వ్యక్తిగత విశ్వాసంగా వుండనివ్వండి! గనుల్లో ఫ్యాక్టరీల్లో, అడవుల్లో, ఆఫీసుల్లో, వాడల్లో అన్ని మతాలవారు కలిసి జీవిస్తూ సఖ్యతగా బ్రతికే మన జీవన విధానాన్ని అలాగే పరిరక్షించండి. అత్యంత సంక్షుభిత, కల్లోలాల సమయంలో మౌనం, తటస్థత పాటిస్తే మనం భావితరాలకు అందించే వారసత్వం ఏమీ మిగలదు. గురునానక్, కబీర్, నాందేవ్, తులసీదాస్, బాబాఫరీద్‌లు మధ్యయుగాలనాడు మనకందించిన సందేశం సౌభ్రాతృత్వం! ఫైజ్ అహ్మద్, గురజాడ, మఖ్దుం మొహియుద్దీన్‌ల స్వప్నంమనందరి సమైక్య జీవనం! భగత్‌సింగ్, రాజగురు, అజాద్‌ల శిరస్సుల సందేశం సామ్రాజ్యవాదాన్నే కాదు దాని వారసత్వపు విలువలను పూర్తిగా విధ్వంసం చెయ్యటం! ఎర్రకోటలో ఉరితీయబడ్డ అజాద్‌హింద్‌ఫౌజ్ యోధుడు అబ్దుల్ రషీద్, తెలంగాణాలో నిజాం కర్కశత్వానికి బలయిపోయిన బందగీ మనకందించిన సమైక్యపోరాట వారసత్వాన్ని పదిలపర్చుకుందాం.

ఈ కరపత్రంపై సంతకాలు చేసిన వారు :

డా॥ సి. నారాయణ రెడ్డి, అబిద్ అలీ ఖాన్, సియాసత్ ఎడిటర్, ఆరుద్ర, జిలాని భాను, రంగనాయకమ్మ, ఉద్వీర్, మిలాప్ ఎడిటర్, రావిశాస్త్రి, కాశీపట్నం రామారావు, సలావుద్దీన్ నెయ్యర్, కె. వి. రమణారెడ్డి, ప్రొ॥ నేపాల్‌సింగ్ వర్మ

బి. నరసింగరావు, లక్ష్మగౌడ్, ప్రత్యగాత్మ, వి. మధుసూదనరావు, కొతరాల, బాసో, వాసిరెడ్డి సీతాదేవి, గద్దర్, నాయని కృష్ణకుమారి, ప్రొ॥ చేకూరి రామారావు, బూదరాజు రాధాకృష్ణ, అజంతా, కె. శివారెడ్డి, మధురాంతకం రాజారావు, రాపూరి భరద్వాజ, మహీధర రామమోహనరావు, ఎ. ఆర్. కృష్ణ, టి. వైకుంఠం, చంద్ర, శీలా వీర్రాజు, సి. రాఘవాచారి విశాలాంధ్ర, కె. రామచంద్రమూర్తి ఉదయం, శ్రీ రామమూర్తి ఆంధ్రపత్రిక, దేవీప్రియ, సహవాసి, ముకుంద్ సి. మీనన్ సమయం, ప్రొ॥ ఇందూవశిష్ట, అన్వర్ మౌజమ్, కార్టూనిస్ట్ మోహన్, శ్రీధర్ కార్టూనిస్టు, ఈనాడు, సర్శిం కార్టూనిస్టు, ఆంధ్రజ్యోతి, సురేంద్ర కార్టూనిస్టు, ఉదయం, కె. బి. తిలక్, తాతినేని ప్రకాశరావు, ప్రొ॥ కె. కె. రంగనాథాచార్యులు మనోహరరావు సక్సేనా, జ్వాలాముఖి, వేగుంట మోహనప్రసాద్, నిఖిలేశ్వర్, వరవరరావు, నగ్నముని, ఇస్మాయిల్ (స్మైల్), శివసాగర్, హరి, డి. వెంకట్రామయ్య, కేతు విశ్వనాథరెడ్డి, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, దాశరధి రంగాచార్య, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, అల్లం రాజయ్య, త్రిపురనేని మధుసూదనరావు, వి. రాజారామమోహన రావు, శ్రీపతి, ఓల్గా, కాత్యాయనీ విద్మహే, విమల, వసంత కన్నాబిరాన్, ఖాదర్ మొహియుద్దీన్, శ్రీనివాస్ లహూటి, ఏటుకూరి బలరామమూర్తి, అలిసెట్టి ప్రభాకర్, ఏటుకూరి ప్రసాద్ అభ్యుదయ రచయితల సంఘం, వి. చెంచయ్య విప్లవ రచయితల సంఘం, వాసిరెడ్డి నవీన్, జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య, నమ్ము, ప్రజా రచయితల సమాఖ్య, వంగపండు ప్రసాదరావు జననాట్యమండలి, రామారావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, కానూరి వెంకటేశ్వరరావు, అరుణోదయ సాహితీ సాంస్కృతిక సమాఖ్య, కె. బాలగోపాల్, బొజ్జా తారకం.

సారథ్య సంఘం :
కాళోజీ,
ఎం.టి. ఖాన్,
ఎబి.కె. ప్రసాద్,
చలసాని ప్రసాదరావు.

పుస్తక సమీక్షలు :

అద్దంలో......నేను(?)

—హరి

ఎప్పుడో చదివిన ఒక చాటు పద్యం భావం : షడ్జమ స్వరంలో గానం వినబడుతుంటే, పాములు పారిపోయాయి.

"సంగీతం 'ఫణిర్వేత్తి' కదా ! పాటలు విన్న పాములు పారిపోవడమేమిటి?" అని ప్రశ్న

"పంచమస్వరంలో కోకిలా, షడ్జమస్వరంలో నెమలీ — గానంచేస్తాయని కవితా సంప్రదాయం కనక పాములు పారిపోవడం సమంజసమే" అని సమర్థన.

దీనికి సంబంధించిన పండిత ప్రకర్ష, వాస్తవికత, కల్పన అలా ఉంచుదాం. అయితే వసంత కన్నబిరన్ రాసిన 'కఠోర షడ్జమాలు' — అంత కఠినంగా లేక పోయినప్పటికీ — పురుష ప్రపంచపు భుజంపైనున్న పాప భారాన్ని గుర్తుచేస్తుంది. కనక కొంత వెరపు సహజం. కొండొకచో అది భయంగా తర్జుమా అయినా ఆశ్చర్యం లేదు.

స్త్రీ విముక్తి ఉద్యమం ఇటీవలి కాలపు ముఖ్యపరిణామాల్లో ఒకటి. అంటే స్త్రీ విముక్తిని గురించిన ఆలోచనలు ఇటీవలే మొలకెత్తినాయనికాదు. జాన్‌స్టువర్టు మిల్ 'స్వేచ్ఛ' పై వ్యాసం ప్రకటించిన నాటినుంచీ — ప్రత్యేకించి స్త్రీ స్వేచ్ఛ— లేదా స్త్రీ విముక్తి — పై ఆలోచనలు 'కొనలు దేరుతూ'నే ఉన్నాయి. అసలు మొత్తం ప్రపంచమే పెట్టుబడిదారీ వ్యవస్థకు 'కట్టుబానిస'గా మారిన సందర్భంలో స్త్రీ విముక్తిని ఒక ప్రత్యేక సమస్యగా స్వీకరించాలా అనే తటపటాయింపు వల్ల — స్త్రీ విముక్తి ఉద్యమం ఒక కార్మికోద్యమంలాగా ఒక విప్లవోద్యమంలాగా ఉధృతిని సంతరించుకోలేదు. స్వల్ప సంఖ్యలోనైనా స్త్రీలు తమ స్వాతంత్ర్యాన్నీ, తమ వ్యక్తిత్వాన్నీ ప్రకటించి ప్రదర్శించగల పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో స్త్రీ ఉద్యమ విస్తృతి సాధ్యపడింది. ఇందులో కూడా తాత్వికంగా అనేక స్థాయీ భేదాలుండవచ్చు; ఉంటాయి; ఉన్నాయి.

వసంత కన్నబిరన్ రాసిన 'కఠోరషడ్జమాలు' ముఖ్యంగా మన సంస్కృతిలో

'అమాయకంగా' భాగమైపోయిన పురుషాహంకార దృక్పథాన్నీ, స్త్రీలపట్ల వ్యాప్తిలో ఉండిపోయిన చులకన భావాన్నీ అండర్‌లైన్ చేస్తాయి. ఈ వ్యాసాలలో ఎక్కువ భాగం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చినవే. అయితే అన్ని వ్యాసాలనూ ఒక సారిగా చదివితే మనం రోజూ చూస్తున్న, గమనించని అనేక కఠోరసత్యాలు మనల్ని నిలబెడతాయి; ప్రశ్నిస్తాయి; కలవరపెడతాయి; 'భయపెడతాయి' కూడా— మన సంస్కృతిలో త్రివిక్రమరూపంలో వ్యాపించి ఉన్న పురుషాహంకార ధోరణి దర్శన మిస్తుంది. ఆ త్రివిక్రమ విశ్వరూపంలో మీరూ, మీరూ, మీరూ.... నేనూ కనబడ దమే ఈ వ్యాసాల ప్రత్యేకత. ఇదొక మహాదర్పణం. 'మనల్ని ఆవరించికొని ఉన్న భావజాలం' తాలూకు సూక్ష్మ వివరాలు ఈ దర్పణంలో కనబడతాయి. అవి సంతోషం కలిగించవు. వినోదం లభించదు. అయితే పాఠకుడు — అవును పాఠకుడే, పాఠకురాలు కాదు — ఆలోచించగలిగితే, స్పందించగల సామర్థ్యం ఇంకా మిగిలిఉంటే — ముందుగా తనకూ, ఆ తర్వాత స్త్రీకి విముక్తి కలిగే మార్గాన్ని గురించి ఆలోచించి తీరతాడు.

'కృతజ్ఞతలు' చెప్పుతూ "పర్‌స్పెక్టివ్స్ సంపాదకవర్గానికి — ఈ సంపుటి వారి ఇతర ప్రచురణల పక్కన నిలబడేందుకు సరిపోతుందని ఎట్టకేలకు గుర్తించి నందుకు" అనడం దగ్గర్నించీ "గృహిణి అంటే ఎవరు ? మానవజాతిలో ఆడది. ఎలా వివరించినా ఒకటే— ఆడది అంటే ఆడదే. ఆ ఆడది కొన్ని సంబంధాలలోకి వెళ్ళినపుడు గృహిణిగా, భార్యగా, ఆస్తిగా, ఆటబొమ్మగా, వేశ్యగా, టైపిస్టుగా మారి పోతుంది. ఈ సంబంధాల నుంచి విడదీసి చూస్తే బంగారం దానంతటది డబ్బు కానట్లే ఆడది కూడా మగవాడితోడూ నీడా ఎంతమాత్రం కాదు" అన్న గెయిల్ రూబిన్ ఉల్లేఖనను చెప్పేవరకూ — వసంత వేలెత్తి చూపించేది ఒకటే : స్త్రీ ఉద్ధ రింపబడాలిసిన అస్తిత్వం కలది మాత్రమేనన్న దృష్టి.

ఈ వ్యాసాలన్నీ మనం చూసికూడా గమనించని — గమనించడానికి సిద్ధ పడని — సామాన్య సంఘటనలపై విశ్లేషణ. నిజానికి దాన్ని విశ్లేషణ అన్నా తప్పే. అది కేవలం ఫోకస్ చేయడం.

ఈ పుస్తకాన్ని సమీక్షించడం చాలా తేలిక. అంతకంటె కష్టం: ఏరి ఏరి ఈ పుస్తకంలో అంశాలను కొన్నింటిని వివరించడం. ఆ ఎంపిక చాలాకష్టం. ఎందుచేతనంటే వసంత గానం చేసిన 'కఠోరషడ్జమాలు' కల్పనమీదగాని, ఊహామీద

గాని ఆధారంతో "సృష్టించబడ్డవి" కానేకావు. ఉన్న లోకాన్ని ఉన్నట్లే వర్ణించి వివ రించినప్పుడు పాఠకుడు ఉక్కిరిబిక్కిరయిపోక తప్పదు.

ఈ పుస్తకంలో సుమారుగా అరవయి వ్యాసాలున్నాయి — రెండు వచనకవిత లతో సహా. ప్రతి వ్యాసమూ ప్రత్యక్షానుభూతి నుంచి పుట్టుకొచ్చిందే. అనుభూతి వర్ణనలో కొంచెంకూడా ఆకర్షణ లేదు. ఆ ధ్యాసకూడలేదు. అలాంటి అనుభవాలు జాతి భావజాలంలో ఎలా ఒక సామాన్య — అతిసామాన్య — స్థాయికి గుంజబడ్డాయో వసంత చెప్పింది చదివితేగాని బోధపడదు. స్పష్టంగా చెప్పాలంటే ఒక స్త్రీ మాత్రమే అలా రాయగలరు.

"నేను వివరిస్తున్న అతి సామాన్యమైన సంఘటనల వెనుక పకడ్బందీగా అల్లిన సిద్ధాంతాలను ఆ వ్యక్తి అర్థం చేసుకోలేక పోవడంతో, అతడి ఎదుట నా సిద్ధాంత పరిజ్ఞానాన్ని ప్రదర్శించుకోవలసి వచ్చినందుకు నాకు చిరాకువేసింది. నేను చెప్పే విషయాలు సామాన్య స్త్రీలకు సైతం అర్థం కావాలన్నది నా లక్ష్యం. అందు కోసం నేను బుద్ధిపూర్వకంగానే కేవలం సిద్ధాంతాలను మాత్రమే వల్లెవేయడాన్ని మానివేశాను. భవిష్యత్తుకోసం మనవద్ద బ్లూప్రింట్ వంటిదేమీ లేదు. ముందుగా సిద్ధం చేసుకున్న పరిష్కారాలు మనవద్ద లేవు. అసలు మన సమస్యల గురించి ఖచ్చి తంగా ప్రశ్నించడమే ప్రారంభించినప్పుడు — "ప్రారంభంకానప్పుడు" అని ఉంటే బాగుండేది — మన ప్రశ్నలకు సమాధానాలు మాత్రం ఎలా లభిస్తాయి ?" అని "ఆడజన్మకు అర్థం" అన్న వ్యాసంలో అంటుంది వసంత. ప్రశ్నలు ప్రారంభమైన తర్వాత సమాధానాలూ లభిస్తాయనే శాస్త్రీయ దృష్టితో అన్న ఈ మాటలు వసంత కన్నాబిరాన్ వ్యాసాలకు గైడ్‌లైన్ అని చెప్పుకోవచ్చు. అదే వ్యాసంలో "రమ్మీ ఆటలు, షాపింగులపట్ల నాకు ఎలాంటి వ్యతిరేకతా లేదు. కాలక్షేపంకోసం ఇలా పరు గులు తీయడం వెనుకగల కారణాలను మాత్రం మనం ప్రయత్నించాలి. ఎందుకు మనకు కాలం ఇంత భారంగా నడుస్తోంది" అని ఒకచోట అంది వసంత.

"మనం (అంటే మధ్య తరగతి మహిళలం) డబ్బు సంపాదించడానికి ఎంతో కష్టపడతాం. అసలు డబ్బు సంపాదించే హక్కును పొందడానికి మరెన్నో కష్టాలు పడతాం" అని వివరిస్తూ " మన జీవితాల్లోని వెలితిని ఇలా వ్యర్థ కలాపాలతో నింపడానికి ప్రయత్నిస్తాం" అంది. ఉద్వేగభరితమైన భావాలివి. ఇందులో చెప్పిం దానికన్నా చెప్పని విషయాలెన్నో ఉన్నాయి.

మరో వ్యాసంలో పగలస్తమానం, రాత్రి పదకొండుగంటలదాకా "ముద్దొస్తున్న పిల్లలను" పరిపోషించి నడుంవాల్చి "అసలు తెల్లవారకుండా ఉంటే ఎంత బాగుంటుంద"ని "వొంటి నొప్పులతో మెలికలు తిరిగి"న వసంత అనుకుంటే 'ఇది నా పాపంకాదని' మనం అనుకోగలమా? అనుకోగలటమే గదా పురుషుని ప్రత్యేకత !

"వడ్డించిన విస్తరిమీది, ఎంగిలికంచాలు మావి" అనే వ్యాసం ఒట్టి వివక్షను మాత్రమేకాక స్త్రీలపట్ల సమాజంలో స్థిరపడిపోయిన చులకననుకూడా ఆవిష్కరిస్తుంది. "నామాలు, పిలకలతో మా అమ్మమ్మ ఇంటికి వచ్చిన బ్రాహ్మణ అతిథి అయినా, ఇప్పుడు మా యింటికి వస్తున్న వివిధ రంగుల మార్క్సిస్టులైనా సాంప్రదాయాల (Sic) అలవాట్ల విషయంలో మాత్రం ఒకటే"నని ముగింపు ఆ వ్యాసానికి. ఏదో చెయ్యాలి మరి ——

"స్త్రీల గురించి సరదాగా రాయడానికి ఏముంటాయి ప్రసవించలేకనో కట్నాలు తేలేకనో మరణిస్తుంటారు. ఈ రెండూ కాకపోతే వారిని కాలుస్తారు. కొడతారు. మానభంగం చేస్తారు. పరిస్థితి ఇంత బాధాకరంగా ఉన్నప్పుడు వారి గురించి సంతోషకరమైన విషయాలు ఎలా రాయాలి" అనుకుని, అనని మాటలు చదువుతుంటే బ్రెక్ట్ పద్యం గుర్తుకువచ్చింది. అయిదుగురు ఆడపిల్లల తల్లి అమానుషంగా పరిణమించడానికి సమాజానికీ, చరిత్రకూ ప్రమేయమే లేదా? "నా పిల్లలను నా యిష్టం వచ్చినట్టు చేసుకుంటాను" అన్న ఆ తల్లిని రాక్షసి అని నిందించే హక్కు 'మన' కెవరిచ్చారు ?—" నోర్మొయ్యి! ఈ యింట్లో నాన్న తర్వాత మేమే. మేము తినగా మిగిలితేనే మీరు తినాలి" అని పదహారేళ్ళయినా నిండని గుంటడు అక్కచెల్లెళ్ళను అదమాయించడానికి ధైర్యం మన సమాజం ప్రసాదించింది కాదూ?

'లక్షణరేఖ'లన్నీ స్త్రీలకే కేటాయించడం ఎన్ని యుగాలుగా జరుగుతోంది? ఆధునికులేం జేస్తున్నారు?

'ఎంత తెలివిగలవారైనా' ఆడపిల్లల ప్రయాణం భర్త వద్దకేనా? బాల్యాన్నీ ముద్దు మురిపాలనూ పుట్టింటివద్ద విడిచి రావాల్సిందేనా ?!

'కంటికి కనిపించని ఎన్‌కౌంటర్ల'నుంచి 'ఫెమినిస్టును కాన'ని నమస్కార

బాణంతో ఇంటర్వ్యూలో పాల్గొన్న సాహిత్య ఎకాడమి బహుమతి గ్రహీత (రచయిత్రి) విశాల దృక్పథంలోని ఇరుకు ఆలోచనల వరకూ — వసంత ఈ వ్యాసాల్లో వివరించి చర్చించినవన్నీ ప్రతిరోజూ మనందరికీ ఎదురయ్యే "విశేషాలే"

"రేప్ కన్నా ఘోరమైన తీర్పు" వ్యాసం అనేకమైన మౌలికమైన మానవీయమైన అంశాలను మన ముందుంచడమే కాక మన సమాజాన్ని - అంటే న్యాయస్థానాలను, పోలీసు వ్యవస్థను, సామాజికంగా వ్యాపించిన తటస్థ ప్రేక్షక పాత్రను — నేరస్థానంలో నిలుపుతుంది. రేప్ అనేది ఒక వాస్తవ సంఘటన అయినప్పుడు ఆ బాధితురాలిని "తప్పుపట్టి మందలించే" న్యాయస్థానం ఉనికినే ప్రశ్నించిన వ్యాసమది.

"భర్తను కోల్పోయి, పసివానితో ఒక 'నాయకుని' సాయంకోరిన స్త్రీ కథ ఇది. మన వర్తమాన విలువలని నిలబెడ్తూ ఆ 'నాయకుడు' ఆమెకు సాయంచేసాడు-బలత్కారంతోనూ, హింసతోనూ ఆమె క్రమేపీ అతని ఉంపుడుకత్తెగా మార్చబడింది. చెడిపోయిన స్త్రీగా ముద్ర వేయబడింది". అంతేకాదు ఆమె బహుశా చనిపోయి 'క్రైమ్ స్టాటిస్టిక్స్‌లో ఒక అంకె'గా మారే పరిస్థితి ఏర్పడింది. ఈ కథలోని విషాదం ఆమె మరణంలో మాత్రమే లేదు. ఆమె నిస్సహాయతలోనూ లేదు. ఈ సమాజంనుంచి సంక్రమించిన, అలవాటైన బానిసత్వంలో, 'పెంపుడుతనం' లో ఉంది.

ఇలా స్త్రీలు గురి అయ్యే రకరకాల పీడనలను, దోపిడీలనూ, సాంస్కృతిక వ్యవహారాలనూ — వసంత వివరించింది. సినిమాలు, కుటుంబ (అ) సాహిత్యం అందాల పోటీలు — మొదలైన వాటి నేపథ్యం గురించికూడా ఆలోచనాపూరితమైన వ్యాసాలు ఈ పుస్తకమంతటా ఉన్నాయి. ఈ పుస్తకం చదివిన తర్వాత పాఠకుడెవరైనా కొంత చలించక తప్పదు. వసంత కన్నబిరన్ మనలను వాస్తవాలతో నిగ్గ తీస్తోంది. సిద్ధాంతాలతో కాదు. అదే చిక్కు. తర్కాన్ని సరిదిద్దుకుందామా? మనల్నే "సరిదిద్దుకుందామా"? మరో ప్రత్యామ్నాయం లేదు.

ఆఖరుగా 'గృహమేకదా స్వర్గసీమ' 'నిరీక్షణ' అనే రెండు కవితలను గురించి రెండుమాటలు చెప్పుకుందాం. 'నిరీక్షణ' జైలులో ఉన్న భర్తను సంబోధించిన కవిత.

ప్రియతమా !
నిరీక్షణ గురించి నీవు మాట్లాడతావు
వర్తమానానికి ప్రేక్షకుడిగా గతానికి గుర్తుగా
ఉండిపోయిన నా స్థితిని గురించి మాట్లాడతావు
— — —
— — —
— — —
కానీ ప్రియతమా
నా సుదీర్ఘ జీవితం సంగతి ఏమిటి ?
ఈ స్త్రీ సమయమంతా నిరీక్షణే కదా
ఇప్పుడైతే మరింక ఏ లక్ష్యం లేని నిరీక్షణ
ఇప్పుడు నా జీవితం ఎవరిచుట్టు తిరగాలి ?

సమాధానాన్ని ఆశించిన ప్రశ్నలుకావివి. లక్ష్మణుడు అరణ్యవాసం పోయినప్పుడు నిద్రించిన ఊర్మిళ తెలుగు జానపద కవికి ఆలంబన అయింది. వసంతకు హేమలత (వరవరరావు కార్య) ఆలంబన అయ్యింది.

'గృహమే కదా సర్గసీమ' ఏ గృహిణి ఆక్రోశమైనా కావచ్చు. తొడితెడు బుడతడు పెరిగి పెద్దవాడై తల్లికి యోగ్యతా పత్రాలివ్వడానికి సాహసిస్తే .... ఈ "గృహమే కదా స్వర్గసీమ".

ఇటీవల కూలిపోయిన – 'సోషలిస్టు రాజ్యాల్లో' గాని, ఇప్పటికీ 'సుస్థిరంగా' ఉన్న పెట్టుబడిదారీ 'ప్రజాస్వామ్య' రాజ్యాల్లోగాని, స్త్రీ పాత్రను సహకార పాత్ర గానే పరిగణించడం మనం గమనిస్తూనే ఉన్నాం. అలాగే "ముడితల్ నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్" అని ఉదారంగా వెన్నుతట్టే మన సంస్కృతి సంగతి సరేసరి. అయితే స్త్రీ విముక్తి ఉద్యమం ప్రత్యక్షమైన సమస్య. దాని ఉని కినీ, వాస్తవాన్నీ, అవసరాన్నీ విప్లవోద్యమం పరిగణనలోకి తీసుకోవాలి. తీసు కుంటుంది కూడా .... విప్లవోద్యమంతో దానికి మౌలికమైన వైరుధ్యం లేదు.

అయితే వసంత రాసిన వ్యాసాలన్నింటా ఎంత నిర్భరమైన నిజాయితీ, ఆక్రోశం ఉన్నాయో, అందుకు సరితూగే రాజకీయ దృక్పథాన్నిగాని, ఆచర ణనుగాని సూచనమాత్రంగానైనా చెప్పకపోవడం విచిత్రంగా కనబడు

పోరుదారిలో పోదాంరారో

కాత్యాయని

ఈ నాటకంలో 'పునరంకితం' కమ్మని పిలుపిచ్చారు రుద్రజ్వాల.

పిలుపు యెవరికి?

పిలుపు యెందుకు?

ఎవరికో ఎందుకో తెలియాలంటే మన సమాజ సమకాలీన చరిత్రని క్లుప్తంగా నెమరేసుకోవాలి.

ఈస్టిండియా కంపెనీ ఈ దేశంలో కాలుపెట్టింది. దేశప్రజల్లో ప్రతిఘటన తలెత్తింది. దేశం బరువుని భుజాల మీద మోస్తున్న పునాది వర్గం - గిరిజన రైతాంగం- సాయుధ తిరుగుబాట్లు చేసింది. వారి పాటా, యీటే, బాణం ఆ పోరు దారిలో పదునెక్కాయి. అయినా ఆనాటి వారి పోరుపాట నగర మైదానాల చెవికెక్క లేదు.

తుంది. "కోకిలలా పాడిపాడి అలసి" పోయినట్లే, రాజకీయ సిద్ధాంతాల విషయంలో కూడా "అలసి" పోయిందా? ఏ ఆలోచన అయినా సిద్ధాంతస్థాయికి చేరక తప్పదు. ఆ తర్వాత ఆచరణా తప్పదు. ఆ తర్వాత విస్తృతమైన రాజకీయావగాహన, ఆచరణ అనివార్యమైపోతాయి. స్త్రీ విముక్తి ఉద్యమం ఒట్టి సాంస్కృతికోద్యమంగా మిగిలి ప్రయోజనంలేదు. దానికి రాజకీయ స్ఫురణ దీప్తినీ, నైశిత్యాన్నీ ఇస్తుంది. స్త్రీ విముక్తి ఉద్యమం ఒక వాహిని అయిన మాట నిజమేకాని, ప్రధానమైన రాజకీయ వాహినిలో అది భాగమైనప్పుడే దానికీ, యావత్ప్రపంచ విముక్తికి ఫలదాయకం.

వసంత కన్నబిరన్ బలమంతా ఆమె అనుభవించి, చూసి, పరిశీలించిన జీవితం నుంచి వచ్చింది. సమాధానం ఉంటే జీవితమే ఇవ్వాలి.

ఇంగ్లీషులో రాసిన ఈ వ్యాసాలను అనువదించిన వకీలు వసంత ప్రత్యేకంగా అభినందనీయురాలు. ఇద్దరు వసంతలు కోకిల సంచమంలో కాక — అన్నట్టు పురుష కోకిలే పాడుతుందట మరి — షడ్జమంలో పాడడం కూడా విచిత్రమే.

'పర్‌స్పెక్టివ్స్' ప్రచురణల్లో 'కఠోరషడ్జమాలు' ముఖ్యమైనది కావడం విచిత్రంకాదు. వారి ప్రచురణలన్నీ ప్రత్యేకమైనవే. ముఖ్యమైనవే.

కఠోర షడ్జమాలు, రచన : వసంత కన్నబిరాన్, ప్రచురణ : పర్‌స్పెక్టివ్స్, 6-3-252, శిల్పఎపార్టుమెంట్స్, ఎర్రమంజిల్‌కాలనీ హైదరాబాద్-500 482 ప్రతులకు : నవోదయాబుక్ హౌస్ ఆర్యసమాజ్ ఎదురు సందు కాచిగూడా, హైదరాబాద్. వెల : 20 రూపాయలు)

దేశం బ్రిటన్‌కి వలసైంది. సిపాయిలు తుపాకులెత్తారు. బ్రిటిష్ ప్రభుత్వం గుండెకి గురిపెట్టారు. పరప్రభుత్వం 'సిపాయిల తిరుగుబాటు' అని అణిచేసింది. ఇది 'ప్రథమ భారత స్వతంత్ర సంగ్రామం' అన్నారు మేధావులు. ఆనాడు సైనికు లెత్తిన తుపాకుల్ని ఆ తరువాతా సంగ్రామాన్ని కొనసాగిస్తున్న గిరిజనులు, రైతులు అందుకున్నారు.

వారు కొనసాగిస్తున్న పోరుదారికి చిరస్మరణీయమైన గుర్తు గదర్ పార్టీ.

ఈ పోరుదారి పునాదుల్ని కదిలిస్తూ దేశం నలుమూలలకీ విస్తరిస్తోంది. పునాదిలో గిరిజన రైతాంగం - తుపాకి తూటాలుగా పేలుస్తున్న- పోరుపాటలు ఉపరితలానికే పరిమితమైన జాతీయోద్యమానికి వినపడలేదు.

తొలిదశల్లో 'వందేమాతరం' పాట నగర మైదానవాసులకీ పోరుపాటని వినపడకుండా చేసింది. ఆదేపనిని మలిదశల్లో 'రఘుపతి రాఘవ రాజారాం' అన్న పాట చేసింది. రెండూ 'దేశమంటే మనుషులన్న' ధ్యాస నాగరికులైన ప్రజల్లో కలక్కుండా చేశాయి.

పోరుదారిది హింసా మార్గమన్నాయి. గదర్ వీరుల్ని, అల్లూరి సీతారామ రాజుల్ని, భగత్సింగుల్ని, హింసావాదులుగా, బందిపోట్లుగా, టెర్రరిస్టులుగా చిత్రించాయి. జనం యీ వారికి మచ్చిక కాకుండా జాగ్రత్తపడ్డాయి. జాతీయోద్యమం చివరి దశకొచ్చేదాకా వీలైనంతవరకూ విద్యార్థి మేధావుల్ని పోరుదారికి దూరంగా వుంచగలిగాయి. పోరుదారి నెప్పటికప్పుడు అణిచేస్తూ వచ్చిన పర ప్రభుత్వానికి యీ విధంగా పరోక్ష సేవలందించాయి.

ఇదంతా తాత్కాలికమని చరిత్ర తేల్చేసింది.

రెండో ప్రపంచయుద్ధం వచ్చింది. అంతకు ముందునుంచీ కమ్యూనిస్ట్ వుద్యమం- అంతర్జాతీయ చైతన్యంతో- దేశంలోవున్న రైతుకూలీ శ్రామికవర్గాల్ని పోరాటాలమీద నడిపిస్తోంది. ఫాసిస్ట్ వ్యతిరేకోద్యమం వచ్చి ప్రపంచంలోని విద్యార్థి, మేధావుల్ని మేలుకొలిపింది. ఈ వుద్యమ చైతన్యంతో దేశంలోని విద్యార్థి మేధావులు సంఘాలుగా సంఘటితమయ్యారు.

ఈ అంతర్జాతీయ చైతన్యంతో తెలంగాణా రైతు పోరుదారికి వారసత్వమైన తుపాకి నందుకున్నాడు. భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేకతతో తెలంగాణా

సాయుధ రైతాంగ పోరాటం బరి మీదికొచ్చింది. ఇంతవరకు దూరంగా వుంచబడిన విద్యార్థి, మేధావులు పోరుదారిలో కొచ్చారు.

దేశానికి విద్యార్థి, మేధావులు మనసైతే కష్టజీవులైన శ్రామికవర్గాలు శరీరం. దేశం మనశ్శరీరాలు వొక్క లయకి స్పందిస్తే పోరుదారి యెంత శక్తివంతంగా ముందుకొస్తుందో తొలిసారిగా తెలిసింది. దేశదేశాల్లో సాయుధంగా సాగి విప్లవాల్ని విజయవంతం చేసిన యీ పోరుదారి చారిత్రకంగా ప్రత్యక్ష వలస పాలనకి కాలం చెల్లిందని తేల్చిచెప్పింది.

తెలివిగా బ్రిటిష్ సామ్రాజ్యవాదం అధికారాన్ని తన వర్గబంధువుల చేతుల్లోకి మార్చి తెరవెనక్కి తప్పుకుంది. గద్దెక్కుతూనే తెలంగాణా పోరాటాన్ని అణిచిన జాతీయ కాంగ్రెస్ దాని వర్గలక్షణాన్ని బయట పెట్టుకుంది. ఆ పోరుదారిని విరమించి తనలోనూ ఆ వర్గలక్షణం వుందని చెప్పకుండా చెప్పింది అనాటి కమ్యూనిస్ట్ నాయకత్వం.

ఆ తరువాత పాలకుల 'స్వతంత్రం' చేసిన నిర్వాహకం యేమిటి?

ఆలోచనల్లో సామ్యవాదం మీద ఆశల్ని పెంచింది. ఆచరణలో వలసవాద చట్టాల్ని కొనసాగించింది. ఈ వైరుధ్యం చివరికి దేశాన్ని చెరబండ రాజు రాసిన 'వందేమాతరం'గా తీర్చిదిద్దింది.

గుత్త పెత్తనాల గుప్పిట్లోకి అన్ని రంగాలూ వెళ్ళాయి. పల్లె నుంచి ఢిల్లీ మీదుగా- మిలిట్రీ ట్రెటీ మిత్రదేశంతో సహా- సామ్రాజ్యవాద దేశాలకి దేశపు వనరులు వెళ్ళే పరోక్ష యంత్రాంగం నిర్మాణమైంది. పల్లెల్లో భూస్వాములు, బస్తీల్లో వ్యాపారులు, మహానగరాల్లో పారిశ్రామికవేత్తలు కింగ్ మేకర్సు గాడ్‌ఫాదర్స్‌గా మారారు. పల్లె, పట్నం, నగరాల్లో సారా కంట్రాక్టర్లు, కిరాయి గూండాలు, మాఫియా దాదాలు, వారికి కావల్సినప్పుడు రక్షకవచాలు కావడానికి సిద్ధంగా వున్నారు. వీరందరూ పంచాయితీ నుంచి పార్లమెంటు దాకా వున్న రాజకీయాధికారాన్ని చేతుల్లోకి తీసుకున్నారు. దాప కింద నీర్లా చట్టవ్యతిరేక కిరాయి సేనల్ని పెంచి పోషిస్తూ వస్తున్నారు. ఇవన్నీగాక వీరి పాలకవర్గం- కొమ్ముకాసే రాజ్యాంగ- శాసన, వుద్యోగ, న్యాయ-వ్యవస్థలు వుండనే వున్నాయి.

ఈ దేశం సామాన్య ప్రజల చుట్టూ అల్లుకుని వున్న సాలెగూడిది. ఇదే వర్తమాన సామాజిక వాస్తవికత.

ఈ పరిస్థితిలో దేశం యిరుసుని భుజాలపై మోస్తున్న గిరిజన రైతుకూలీ శ్రామికులకేది దారి? పునాది కిందలాగే అణగిమణగి నోరెత్తకుండా నిశ్శబ్దంగా చావాలా? సాయుధులై పోరాడుతూ అమరులై శాపితరాన్ని బతికించాలా?

ఏం చెయ్యాలి? —

ఈ నేపథ్యం నుంచి నక్సల్‌బరీ వసంత మేఘగర్జన వినిపించింది. ఆ వెలుగులో సాయుధమైన శ్రీకాకుళం పోరుదారిలోకి దూకింది. అక్కణ్ణుంచి సిరిసిల్లా జగిత్యాలల మీదుగా దండకారణ్యమంతా లేచిన దండు ఆ పోరుదారిలోనే ముందుకు పోతోంది. అడ్డొస్తున్న పార్లమెంటరీ అవకాశవాద కారుమేఘాల్ని పారదోల్తూ ప్రచండ భాస్కరతేజంతో ఉత్తర తెలంగాణలో పురకలేస్తోంది. జ్వాలాతోరణంలా జిల్లాలకీ, రాష్ట్రాలకీ విస్తరిస్తోంది.

గదర్-పార్టీ-కాలంనుంచీ పదునెక్కుతూ వచ్చిన పోరుబాటా, పోరు పాటలు గద్దర్-జేయెన్నెం-గొంతులో 'రక్తచలన సంగీతాన్ని సృష్టిస్తున్నాయి. ఆ సంగీతం సామాన్య ప్రజలందర్నీ 'పోరుదారిలో పోదాము రారో' అని పిలుస్తోంది. రోజు కాదు, నెలకాదు, సంవత్సరంకాదు, ఇరవై యేళ్ళుగా ఎలుగెత్తి పిలుస్తూనే వుంది. దేశంలో కష్టజీవుల విముక్తి జరిగి శ్రేయోరాజ్యం యేర్పడే దాకా పిలుస్తూనే వుంటుంది.

ఆ పిలుపునే 'పునరంకితం' ప్రతిధ్వనిస్తోంది.

ఈ పిలుపెవరి కన్నది యీ నాటకంలో వుంది.

మధ్యతరగతి విద్యార్థి, మేధావుల్లో, భాగమైన కళాకారుల కోసమే యీ పిలుపని యీ నాటకం చెబుతోంది. ఎందుకనేది కళాకారులమైన మనమే తెలుసుకోవాలి. ఆరంభంలో యంత్ర నాగరికత శ్రమజీవుల్నే నిరాశ్రయుల్ని చేసింది. అటమిక్ యుగంలోకొచ్చిన యంత్రప్రగతి యిప్పుడు బుద్ధి జీవుల్నీ నిరాశ్రయుల్ని చేస్తోంది. బుద్ధిజీవుల దాస్య విముక్తి శ్రమజీవుల దాస్య విముక్తితో ముడిపడింది. అందుకనే ప్రాణత్యాగాలతో శ్రమజీవులు విస్తరింపజేస్తున్న పోరుదారికి విద్యార్థి, మేధావులు-వారిలో భాగమైన కళాకారులూ- 'పునరంకితం' కావాలంటున్నారు రచయిత రుద్రజ్వాల.

× × ×

నేను-నాటక-రచయితని కాను. ప్రయోక్త దృష్టినుంచే 'పునరంకితం' నాటకాన్ని చదివాను; ప్రదర్శనా చూశాను. చాలాకాలమైనందువల్ల దాని తాలూకు జ్ఞాప

కాలి పరగడుపున పడిపోయాయి. కనుక చదివినదాన్ని ఆధారం చేసుకునే నేనీ మాటలు రాస్తున్నాను.

రుద్రజ్వాలగారు నాటకరచనలో అనుభవం వున్న కొద్దిమంది రచయితల్లో వొకరు. ఈ విషయం వారి వెనకటి నాటికా నాటకాల్ని చూస్తేనే తెలుస్తుంది. ఈ నాటకాన్ని పరిశీలనాత్మకంగా చూస్తే ఆ విషయం రుజువవుతుంది.

గిరిజన పోరాటంలో కార్యకర్తగా పనిచేస్తున్న యువకుడు, బూర్జువా వూబిలో కూరుకుపోయిన కళాకారుడికి, పోరాట జీవితం చూపిస్తానని తీసికెళ్ళడంతో యీ నాటకం మొదలైంది. ఆదిలాబాద్ అడివి ప్రాంతాన్ని అతనికి పరిచయం చేసే క్రమంలో ప్రేక్షకులికీ పరిచయం చేస్తాడు యువకుడు.

క్రూర మృగాల్తో జీవిస్తున్న గిరిజనులు - జంగు - ప్రభుత్వోద్యోగుల, వడ్డీ వ్యాపారుల దోపిడీ పీడనలకెలా భయంతో వణికిపోతున్నాడో తొలిదృశ్యం చెప్పింది.

అనంతమైన దోపిడీ పీడనల్ని భరిస్తూనే అక్కడి జనం అమాయకంగా పరస్పర సహకారంతో బతుకీడుస్తున్నారు. అక్కడికి కళాకారుడితో వచ్చిన యువకుడు అది చూసి వారిని సంఘటితపర్చి దోపిడీ పీడనల్ని ప్రతిఘటించే ప్రయత్నం చేస్తాడు. అది చూసిన జంగు తీవ్రంగా భయపడ్డంతో రెండో దృశ్యం పూర్తయింది.

యువకుడు గిరిజనుల్లో కల్సిపోయి పనిచేస్తాడు. కళాకారుడు తాగుడు వ్యసనం వెనకబడతాడు. వడ్డీ వ్యాపారి రామయ్య వచ్చే యెలక్షన్లో వోట్లడుక్కుందుకొచ్చి అవమానించబడతాడు. పాత్రల వర్గతత్వాలు వ్యక్తిత్వాలు మెరుపుల్లా సూచితమైనాయి. రామయ్యా పోలీసులు గూడెం తగలబెడతారు. తగలబెట్టించిన రామయ్యే తమని పరామర్శించే తత్వాన్ని జంగు రుక్కుబాయిలర్థం చేసుకున్నట్టుగా రాంసా పెళ్ళాం చెప్పేదాకా-అర్థం చేసుకోలేకపోవడంతో మూడోదృశ్యం పూర్తయింది.

గిరిజన రైతు కూలీలు సంఘం పెట్టుకున్నారు. పోరాటాలకి సిద్ధమయ్యారు. ఈ వాతావరణం జంగులో తెలివినీ తెగింపుని పెంచి నిద్రాణమైన ధైర్యాన్ని పైకి లేపడంతో నాలుగోదృశ్యం ముగుస్తుంది.

జంగులో ధైర్యం పెరిగినట్టే అతని కొడుకు రాంసా శత్రువు వేసిన యెరకి లొంగిపోయాడు. అందరూ అతన్ని మళ్ళీ పోరుదారికి తెచ్చుకున్నారు. ఇంద్రవెల్లి సభకి వెళ్ళారు. చౌకీదారు రుక్కుబాయిని అత్యాచారం చెయ్యబోతే మావాకోడలు

తల్సివాణ్ణి అంతం చెయ్యబోయాడు. కాళ్ళమీద పడి గండం తప్పించుకున్నవాడు పోలీసుల్తో వచ్చి జంగుని పోలీసుస్టేషన్‌కి తీసుకెళ్ళాడు. ఏడుస్తున్న రుక్కుబాయికి ధైర్యం చెప్పి యువకుడు ఆమెని తీసుకెళ్ళాడు. ఇంద్రవెల్లిలో పోలీసుల దారుణంగా కాల్పులు జరపడంతో అయిదో దృశ్యం ముగుస్తుంది.

పోలీసుస్టేషన్లో చిత్రహింసలను భరించి జంగు, ఇంద్రవెల్లి కాల్పుల్లో అయిన గాయాల్తో రాంసాధిక్యాలు వచ్చారు. వాళ వెనకనే రామయ్యతో వచ్చిన పోలీసులకి గిరిజనులకి 'ఘర్షణ' జరిగింది. చివరికి జంగు చనిపోయాడు. లక్ష్యం నెరవేరే దాకా ముగింపులేని యీ పోరాటంలో మీరెటువైపని కళాకారుల్ని ప్రశ్నించి-విద్యార్థి, మేధావులారా- 'పునరంకితం' కండన్న సూచనతో నాటకం పూర్తవుతుంది.

వర్తమాన పుద్యమావసరాన్ని తీర్చగల శక్తి యీ నాటకానికుంది.

పాత్రల నిర్మాణంలో, సన్నివేశ కల్పనలో, సంభాషణారచనలో, అర్థవంతంగా ఘటనల్ని కూర్చే క్రమంలో రచయిత నైపుణ్యం కనిపిస్తుంది. వీటికి కళాకారుల సమిష్టి కృషి కలిస్తే పుత్తమ ప్రదర్శనగా యీ నాటకం రూపొందడం కష్టం కాదు. ఔత్సాహిక వృత్తి కళాకారులిక్కడితో తృప్తిపడితే పడచ్చుగాని 'మాది ప్రజల పుద్యమం' అనే కళాకారులు యిలా యిక్కడితో ఆగిపోకూడదని నా పుద్దేశ్యం.

కేవలం యిది నా పుద్దేశ్యం కాదు. ఆధునిక తెలుగు నాటకరంగం నుంచి పుదాహరణా వుంది. వార్ ఫండ్-కాంట్రాక్ట్-నాటకాల కాలానికి ముందొచ్చిన నాటకాల్లో జాతీయోద్యమ భావాలు కనిపిస్తాయి. కాళ్ళకూరి పుండరీకాక్షుడు వంటి వారి నుంచొచ్చినవి స్వతంత్ర సంస్కరణోద్యమాల పోరాట చైతన్యాన్ని వారి కోణం నుంచి చిత్రించాయి. ఆరంభదశల్లోనే ఆనాటి జీవిత వాస్తవికతని అన్ని కోణాల్నుంచీ-మిగిలిన నాటకాలకి పూర్తిభిన్నంగా-చిత్రించింది ఒక్క గురజాడ 'కన్యాశుల్కం' మాత్రమే.

కథా వస్తువు జానపద పౌరాణిక చారిత్రక సాంఘికాల్లో దేనికి చెందిందైనా ఆనాడు ప్రజల్ని ఆకర్షిస్తున్న రాజకీయ భావాల్ని చొప్పించి, వారి ఆదరణతో లాభాలార్జించాలనే లక్ష్యంతో, మొదట చెప్పిన తరహా వ్యాపార నాటకాలు వచ్చాయి. కథా

వస్తువు-పై విధంగానే-దేనికి చెందిందైనా ప్రజలు అలవాటుపడి ఆదరిస్తున్న నాటక నిర్మాణ చట్రంలో రాజకీయోద్యమ చైతన్యాన్ని ప్రబోధించి వారిని వుద్యమ మార్గానికి తేవాలనే లక్ష్యంతో వచ్చినవి రెండో తరహా రాజకీయ సంస్కరణ వుద్యమ నాటకాలు.

వీటికి పూర్తి విరుద్ధంగా 'నాది ప్రజల వుద్యమం' అన్న గురజాడ "కన్యాశుల్కం"లో సమకాలీన సమస్యని సమగ్ర జీవితంలో భాగంగా చిత్రించారు. రచనా నిర్మాణంలోని సన్నివేశ కల్పన, పాత్ర పోషణ, సంభాషణారచనల్లాంటి- అన్ని విషయాల్లోనూ వాస్తవికతనే గీటురాయిగా తీసుకున్నారు. అన్నీ-సహజమైన సన్నివేశాలు, గుణదోష సమ్మిళితమైన పాత్రలు, మాండలికానికి చెందిన నిత్య వ్యావహారికంలోని అన్ని తరగతులవారి యాసల్తో సంభాషణలు, ఆ గీటుకి వచ్చేలా కృషి చేశారు.

ఇది నవలా ? నాటకమా ? అనిపించేలా సాగిన యితివృత్త విస్తరణ దోషం యీ నాటకానికుంది. కాని మిగిలిన అన్ని విషయాల్లో యిది ప్రయోక్తలకి పరీక్షా పత్రం. పంతొమ్మిదో శతాబ్దపు తెలుగు జీవితాన్ని భావితరాలకెప్పుడూ గుర్తుచేసే చారిత్రక పత్రం.

ఇంత ప్రామాణికత యీ నాటకానికి పుట్టిన వెంటనే రాలేదు. పది పదిహేను యేళ్ళుగా సాగిన ప్రదర్శనల నుంచొచ్చిన సద్విమర్శల్ని గ్రహిస్తూ చేసిన మార్పుల ఫలితంగా చివరికొచ్చిన సజీవరూపమది. తొలి చివరి ప్రతుల్ని చూస్తే యీ తేడా తెలుస్తుంది.

పాశ్చాత్య నాటకాల సావాసఫలితంగా తెలుగు నాటకం- ముఖ్యంగా ఔత్సాహికోద్యమం- ఇతివృత్త కేంద్రీకరణలో అభివృద్ధి చెందింది. మిగిలిన విషయాల్లో మాత్రం అది గురజాడ నుంచి నేర్చుకోవల్సిందింకా యెంతో వుంది.

తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి అద్దంపడుతూ ఆనాటి ఆంధ్ర ప్రజా నాట్యమండలి నుంచొచ్చింది 'మా భూమి'. అప్పటి చారిత్రకావసరాన్ని గొప్పగా తీర్చింది. కాని యితివృత్త కేంద్రీకరణ ఔత్సాహికోద్యమం నుంచింకా గ్రహించవల్సి వుంది. అలాగే సన్నివేశ కల్పన, పాత్ర పోషణ, సంభాషణా రచనల్లాంటి విషయాల్లో యింకా కొన్ని గుణాంశాల్ని గురజాడ నుంచి గ్రహించి తనని

తాను పెంచుకోవల్సి వుంది. ఆనాటి ఆంక్షలూ నిషేధాలూ అణిచివేతల్లో ఆ పని చెయ్యగల్గడమే గొప్పవిషయం. ఆ తరువాత ఆ వుద్యమమే చేవపోయి జావ కారి పోయింది.

ఇతివృత్త కేంద్రీకరణని ఔత్సాహికోద్యమం నుంచి, మిగిలిన అన్ని విష యాల్ని పాత ప్రజానాట్యమండలి- మా భూమి- నుంచి కొద్దికొద్దిగా పుణికి పుచ్చు కుంది 'పునరంకితం'. గిరిజన పోరాటోద్యమం ప్రస్తుత స్థితిని నగర మైదానాలకి వివరించగల దృశ్యరూపంగా తనని తాను తీర్చిదిద్దుకుంది. ఆదిలోనే గురజాడ 'కన్యాశుల్కం'లో సాధించిన యే గుణాంశాల్ని ఔత్సాహిక ప్రజానాటకోద్యమాలు అందుకోలేదో వాటినీ నాటకం అందుకోవాల్సి వుంది. అయితే ఆ పని రచయితవల్లే జరిగేది కాదు. రచయితకి దోహదంచేసే నిర్మాణం సామాజిక వాతావరణంలో వుద్యమం ద్వారా యేర్పడాలి.

ఆదిలో యిలాంటి నిర్మాణం అతి పరిమితంగానైనా గురజాడా చుట్టూ వుంది. ఆ సమష్టి కృషి ఫలితమే ఆయన నాటకానికా ప్రామాణికతనిచ్చింది. ఆ రోజుల్లో వ్యాపార నాటకాలకీ నిర్మాణం అపరిమితంగా వుంది. కాని అక్కడున్న వారందరికీ లాభార్జనే లక్ష్యం. అందుకే అవి జనాదరణని పొందినా- కన్యాశుల్కంలా- జీవిత వాస్తవాన్ని చూపలేదు. ఔత్సాహిక నాటకోద్యమ నిర్మాణం ప్రయోగానికిచ్చినంత ప్రాధాన్యత ప్రజలమధ్య ప్రదర్శనల విస్తరణకివ్వలేదు. ప్రజా నాటకోద్యమ నిర్మాణం ప్రజలమధ్య ప్రదర్శనలకిచ్చిన ప్రాధాన్యత నిరంతర ప్రయోగాని కివ్వలేక పోయింది.

ఈనాటి విప్లవ సాంస్కృతికోద్యమం యీ వాస్తవాల్ని లెక్కలోకి తీసు కోవాలి. ఒకపక్క నిరంతర ప్రయోగం మరోపక్క ప్రజలమధ్య ప్రదర్శనలు సాగించగల 'నిర్మాణం' సామాజిక వాతావరణంలో నెలకొనేలా ప్రయత్నించాలి.

ఇందుకు రచయిత చెయ్యాల్సిందీ వుంది. ప్రయోక్తలూ నటీనట సాంకేతిక నిపుణులున్న సాంస్కృతిక సంస్థలూ చెయ్యాల్సిందుంది. నాటకంతో యాంత్రిక కళాసాధనాలు పోటీకి యెక్కడ నిలవలేవో ముందు తెలుసుకోవాలి.

స్వతహాగా నాటకం సజీవ కళాసాధనం. చెప్పదల్చుకున్న విషయాన్ని ప్రజలకి సన్నిహితమయ్యేకొద్దీ అభివృద్ధి చెయ్యగల శక్తి దానికుంది. యాంత్రిక

కళాసాధనాలు- వుదా॥ సినిమా- ఇందుకు విరుద్ధం- అభివృద్ధయిన విషయాన్ని రికార్డు చెయ్యగలవేగాని అభివృద్ధి చెయ్యలేవు. నాటకం యంత్ర సాధనాల మీద- సెట్లు, లైట్లు, మైకులు, షాడో ప్లేలు, ఆర్కెస్ట్రాల్లాంటి వాటిమీద ఆధారపడ్డంతో పెట్టుబడి ప్రధానమై బరువు పెరుగుతోంది. ఆ బరువుని మొయ్యలేని ప్రజలకి దూరమవుతోంది. విషయ వ్యక్తీకరణ శక్తిని వృద్ధి చేసుకోలేకపోతోంది. ఆ శక్తిని పెంచాల్సిన విప్లవ సాంస్కృతిక సంస్థలూ రచయితలూ ముందు నాటకాన్ని పెట్టుబడి బరువునుంచి విముక్తం చెయ్యాలి.

రచయితగా రుద్రజ్వాల దీన్ని దృష్టిలో వుంచుకునే యీ నాటకం రాశారు. అయినా కొన్ని చిన్నచిన్న బరువులింకా మిగిలాయి. వాటిని కూడా అందిన-మానవ-వనరులతో సూచించి నాటకం వ్యక్తీకరణ శక్తినెలా పెంచాలో రచయిత ఆలోచించాలి. ఉద్యమావసరాన్ని తీర్చే యిలాంటి నాటకాన్ని, విప్లవ సాంస్కృతిక సంస్థలు, పల్లె నుంచి పట్టణందాకా ప్రయోగించి ప్రదర్శించే నిర్మాణాన్ని యేర్పాటు చేసుకోవాలి. రచయితకీ దళాలకీ సజీవ సంబంధం వుండాలి. అందరూ నాటక నిర్మాణానికి సంబంధించిన అన్ని విషయాల్లో- గురజాడలా- వాస్తవికతనే గీటురాయిగా తీసుకుని సమష్టిగా కృషి చెయ్యాలి.

ఇలాంటి నిర్మాణం వున్ననాడు వుదాహరణకి యీ నాటకం రూపురేఖలు మారతాయి. ప్రయోక్తగా నాకున్న స్వల్పానుభవం ఆ మార్పునిలా నా కళ్ళకి కడుతోంది.

నిర్దిష్ట స్థల కాలపరిమితిలో నాటకంలోని ప్రతి సన్నివేశం నడుస్తుంది. తొలి దృశ్యంలోని తొలి సన్నివేశం ఉండదు. ఆదిలాబాద్ పోరాట ప్రాంతంలోవున్న 'జంగు' తోనే మొదలవుతుంది. కళాకారుడు యువకుడి ప్రేరణతో పోరాట ప్రాంతానికి రాడు. పరిస్థితుల ప్రాబల్యంతోనే అక్కడికొస్తాడు. ఆ కట్టెపంకర్లని పోరాట జీవితమే తీర్చి వుద్యమంలో వొకణ్ణి చేస్తుంది. ఇంద్రవెల్లి దారుణం 'షాడో ప్లే' లో జరగదు. ఆ దారుణానికి గురై వచ్చినవారి అనుభవాల్నించి- మాటల్లో- వ్యక్తమవుతుంది. ఇక పాత్రలు గుణదోష సమ్మేళనంతో రూపొందుతాయి. ఆదిలాబాద్ మాండలికాన్ని- విభిన్న తెగల, తరగతుల యాసల్తో- మాట్లాడి ప్రవర్తిస్తాయి. చివర్లో జంగు మరణించాక పోరాటానికి మూలమైన జీవిత వాస్తవం మెరుపులా

ప్రేక్షకుల కళ్ళకి కడుతుంది. అది ఓ పాత్ర వుద్యమ స్థాయికెదిగి ప్రబోధించడంగా గాక పోరాట జీవితానికున్న అన్ని కోణాల్ని ప్రజల ముందుంచి వారిని ఆలోచింపజేస్తుంది.

గురజాడకే పరిమితమైతే అంతర్గర్భితంగా వుండే వాస్తవికత అందరికీ అర్థం కాదనిపిస్తుంది. అందుకు నాదో వివరణుంది.

ఈ నాటకంలో రచయిత సాధించిన యితివృత్త కేంద్రీకరణలో ఓ క్రమం కనిపిస్తోంది. జంగు- ప్రధాన పాత్ర- పోరాట జీవితానికి ముందు విపరీతంగా భయపడతాడు. అదే వాతావరణంలో అతను రానురాను రాటుదేలి పోరాటయోధుడుగా మారతాడు. ఇది సరిగ్గా గోర్కీ 'అమ్మ'లో జరిగిన మానసిక పరివర్తన దశల్ని, ఆమెలో చివరికి వచ్చిన గుణాత్మకమైన మార్పుని గుర్తు చేస్తుంది. దీన్నే ఓ పోరాట జీవిత వాస్తవికతకి విప్లవారాధన (revolutionary romanticism) ని జోడించడంగా గోర్కీ చెప్పారు. పోరాటానికి 'పునరంకితం' కాబోతున్న కళాకారులు ఆ పనిని నిరంతరం నిర్విరామంగా చెయ్యాలి.

అప్పుడు 'పునరంకితం' 'పోరుదారి'గా మారినా మారిపోతుంది. ఈ మధ్య 'సృజన'లో వచ్చిన 'ఓ వీరుడు మరణిస్తే' నాటికని, ఈ 'పునరంకితం' నాటకాన్ని చూస్తే రచయిత చేసే తొలిప్రయత్నం యేదైనా- ఆ నాటిక రచయితన్నట్టు- అస్థిపంజరమే దానిని విప్లవ సాంస్కృతిక సంస్థల సమష్టి కృషి రక్తమాంసాల్నిచ్చి సజీవత్వాన్నివ్వాలి. అందుకు నేను పైన సూచించిన 'నిర్మాణం' యేర్పడ్డం తొలి షరతుగా కనిపిస్తోంది. దరిదాపు శతాబ్దన్నరగా ఆటుపోటుల్ని తట్టుకు విస్తరిస్తున్న సాయుధ పోరాటమార్గం అనతికాలంలోనే ఆ నిర్మాణానికి రాగలదన్న ఆశ నాకుంది.

అప్పుడు నేటి పోరాట పాటలాగే రేపటి పోరాట నాటకం "పోరుదారిలో పోదామురారో" అని ప్రజల్ని కదిలించి తన చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తిస్తుంది.

(పునరంకితం — నాటకం — రుద్రజ్వాల, విరసం ప్రకాశం జిల్లా యూనిట్ ప్రచురణ, వెల రూ. 10-00, ప్రతులకు : రుద్రజ్వాల, బోస్ నగర్, చీరాల - 523 155.)

నా కొడుకు చంపెయ్యబడితే....

ప్రెసిడెంట్ బుష్‌కు ప్రొఫెసర్ అలెక్స్ మోల్నార్ బహిరంగ లేఖ

డియర్ ప్రెసిడెంట్ బుష్,

ఇవాళ నా కొడుకును ముద్దాడి వీడ్కోలు చెప్పాను. వాడికి ఇరవై ఒకటి నిండాయి. సైనికుడిగా పని చేస్తున్నాడు. నువు వాణ్ణి సౌదీ అరేబియాకు వెళ్ళమని ఆదేశించావు. మేం ఉత్తర విస్కాన్సిన్‌లోని మా కుటీరంలో సెలవు రోజులు గడుపుతున్నప్పుడు వాడు వెళిపోతున్నాడన్న వార్త తెలిసింది. ఆ ఉత్తరం ఎక్స్‌ప్రెస్ మెయిల్‌లో ఆగస్ట్ 13న మాకు అందింది. వాడితో గడిపేందుకు మేం వెంటనే నార్త్ కరోలినాకు బయల్దేరాం. మా సెలవులు ముగిసిపోయాయి.

వైట్ హౌజ్‌లో చిక్కుకుపోయావని అనుకోకుండా ఉండేందుకు నువు నీ సెలవులు కొనసాగిస్తున్నావని కొందరు వ్యాఖ్యాతలు అంటున్నారు. ఇరాన్ బందీల సంక్షోభం సమయంలో ప్రెసిడెంట్ కార్టర్ కూడ ఇట్లాగే చేశాడు. బహుశా నీ కారణం అదే కావచ్చు. ఏదేమైనా, నేను నా హోటల్ గదిలో కూచుని టెలివిజన్ చూస్తుంటే గోల్ఫ్ బంతుల వెంట పరుగెత్తుతూ, కెన్నెబంక్ పోర్ట్‌లో పడవతో జలక్రీడలాడుతూ నువు కనిపించావు. నువ్వెంత నిర్లక్ష్యంగా, ఎంత హాస్యాస్పదంగా కనిపించావో—నా కొడుకు గబగబా రాసిన చివరి ఉత్తరాన్ని, వీలునామాను నేనిప్పుడు చదువుతున్నాను. బైట సాగిపోతున్న సైనిక వాహనాల సందడి వింటున్నాను.

నా కొడుకు దగ్గరికి వెళ్ళేటప్పటికి, వాడు రసాయనిక ఆయుధాల రక్షణ కవచం ప్యాక్ చేసుకుంటున్నాడు. ఆయుధాలు తగిలించుకుంటున్నాడు. నీకెప్పుడయినా అటువంటి అనుభవం ఉందో లేదో నాకు తెలియదు. మిస్టర్ ప్రెసిడెంట్, నీకు ఆ అనుభవం కలగగూడదనే నేను కోరుకుంటున్నాను.

మా వాడితో పాటు వెళుతున్న మరి కొందరు సైనికుల్ని కూడ నేను కలిశాను. వాళ్ళందరూ అద్భుతమైన యువకులు. వాళ్ళలో చాల మంది పేద కుటుంబాల నుంచి వచ్చామని చెప్పారు. కాలేజికి వెళ్ళేందుకు తగిన డబ్బు సంపాదించడం కోసం వాళ్లు సైన్యంలో చేరారట.

నేను కలిసిన యువకుల్లో ఎవరినీ, నీ కొడుకు నీల్ లాగ, పొదుపు, రుణాల సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో చేరమని ఆహ్వానించలేదు. వియత్నాం యుద్ధ సమ

యంలో వైస్ ప్రెసిడెంట్ క్వైల్ తల్లిదండ్రులు చేసినట్టుగా, సైనికాధికారిని పిలిచో ఉత్తరం రాసో తమ కొడుకుకు ఏ ఆపదా రాకుండా చూడమని కోరగలిగేంత పెద్దింటి తల్లిదండ్రులలా ఈ యువకులకు లేరు.

ఇవాళే ఒక పత్రికలో నీ లాగానే, వైస్ ప్రెసిడెంట్ క్వైల్, సెక్రటరీ ఆఫ్ స్టేట్. బెకర్ కూడ సెలవు మీద ఉన్నారని చదివాను. ఈ లోగా డిఫెన్స్ సెక్రటరీ చెనీ మాత్రం పర్షియన్ గల్ఫ్‌లో ఉన్నాడు. సైనికేతరమైన విదేశాంగ విధానం గురించి ఆలోచన లేని ప్రభుత్వానికి, అమెరికన్ దౌత్య విధానం అనబడే బూటకానికి ముసుగుగా సైన్యాన్ని వాడే ప్రభుత్వానికి ఇంతకంటె నిదర్శనం అక్కర్లేదు.

ఔను, గత మూడు వారాల్లోను నువ్వు సాపేక్షికంగా సమర్థవంతమైన జిత్తుల మారివని తేలిపోయింది. కాని, ఒక దశాబ్దంలో ఎక్కువ కాలంపాటు అమెరికన్ దౌత్య విధానం సెలవు మీద లేకపోయి ఉన్నట్టయితే, ఇవాళ మనం ఉన్న ఈ స్థితిలో ఉండేవాళ్ళం కామేమో—

ఇరాక్ తన స్వంత ప్రజలను విషవాయువుతో చంపేస్తున్నప్పుడు నువ్వెక్కడున్నావు, ప్రెసిడెంట్? ఇవాళ హఠాత్తుగా నువు హిట్లర్ అని పిలుస్తున్న సద్దామ్ హుసేన్‌తో ఈ మధ్య కాలం వరకూ నువు మామూలుగానే వ్యాపారం చేశావే?

అమెరికన్ ప్రజలకు మంచి జీవితాన్ని వాగ్దానం చేసి నువు 1980లో వైస్ ప్రెసిడెంటుగా ఎన్నికయ్యావు. అమెరికా మళ్ళీ ఒకసారి "తలెత్తి నిలిచేలా" చేస్తానన్నావు. రీగన్-బుష్ అధికార వర్గం చమురులో "ఫ్రీ మార్కెట్" సృష్టిస్తామనే ఇంద్రజాలం మాట్లాడి వాషింగ్టన్‌లో ప్రవేశించింది. కార్ల గ్యాస్ వాడకం నిబంధనలను నువు సడలించావు. జాతీయ ఇంధన విధానాన్ని రద్దు చేశావు. ఇప్పుడిక నా కొడుకును మధ్య ప్రాచ్యానికి వెళ్ళమని ఆదేశించావు. ఎందుకు? చౌక గ్యాస్ కోసమా?

నా కొడుకు ప్రాణాలు పణంగా పెడుతున్నది అమెరికన్ "జీవన విధానం" కోసమని గదూ నువ్వంటున్నది? ఏమిటది? ప్రపంచ చమురు వాడకంలో 25 నుంచి 30 శాతం వాడుకునేందుకు అమెరికన్ల "హక్కు"ను కొనసాగించడమేనా? నువు ఎంతో దీక్షగా మాట్లాడే "ఫ్రీ మార్కెట్" అనే దానికి చాల ఖర్చు అయ్యేటట్టుంది.

కనీసం మా వంటి తల్లిదండ్రులకూ, నా కొడుకు లాంటి యువతీ యువకులకూ దాని మూల్యం చాల ఎక్కువ.

ఇప్పుడిక యుద్ధం ముంగిట్లోకి వచ్చినట్టే కనబడుతోంది గనుక, నేను నా కొడుకునూ, వాడి తోటి సైనికులనూ కాపాడదలచుకున్నాను. అంటే, పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా దౌర్జన్య పూరిత సైనిక చర్యకు వ్యతిరేకంగా ఏమి చెయ్యగలిగితే అది చేస్తాను. నేను కలిసిన సైనికుల్ని రాజకీయవేత్తలు వాళ్ళ విధానాలు బందీల్ని చేశాయి. నిజానికి ఆ సైనికులకు ఇంకా మంచి రాజకీయాలకూ, ఇంకా మంచి విధానాలకూ అర్హత ఉంది.

మా కొడుకు స్థావరం పైన ఒక చిన్న కేఫ్‌లో గతవారం నేనూ, నా భార్యా కూచున్నాం. తిండి తినడానికి ప్రయత్నించాం. కన్నీళ్ళు దిగమింగడానికి ప్రయత్నించాం. అప్పుడు ఒక యువ సైనికుడు మాతో మాటలు కలిపాడు. మేం వచ్చేస్తోంటే అతను వీడ్కోలు చెపుతూ" మేం చెయ్యబోతున్న పనులకు భగవంతుడు మమ్మల్ని క్షమించు గాక" అన్నాడు.

ప్రెసిడెంట్ బుష్, గత దశాబ్దంగా నువ్వు ప్రవచించిన విధానాలు ఇవాళ్టికి మధ్య ప్రాచ్యంలో సైనిక సంఘర్షణకు రంగం సిద్ధం చేసి పెట్టాయి. కువైట్‌ను ఇరాక్ ఆక్రమించినందుకు నువు చూపిన ప్రతిస్పందన ఎటువంటి ఘటనలకు దారి తీసిందంటే, అంతిమంగా నువు నీ సేనలను సౌదీ అరేబియాను రక్షించేందుకు కాక, ఇరాక్ మీద దాడి చేసేందుకు నడపవలసి వస్తుంది. ఈ ఘటనల ఒత్తిడిలో నువ్వు నీ రాజకియ భవితవ్యం కోసం నా కొడుకు ప్రాణాన్ని పణంగా పెడతావని నాకు భయంగా ఉన్నది.

గతంలో కూడ నువ్వు నీ రాజకీయ భవిష్యత్తు తప్ప మరే సూత్రానికీ కట్టుబడి ఉండనని రుజువు చేసుకున్నావు. అందువల్లనే ప్రస్తుత సంక్షోభానికి ఒక దౌత్య పరిష్కారం కనిపెట్టడమనే సవాలును స్వీకరించే ధైర్యం గానీ, స్వభావం గానీ నీకు లేవని నేను అనుమానిస్తున్నాను. నేను ఊహిస్తున్నట్లుగా, అంతిమంగా నువ్వు అమెరికన్ సైనికులకు ఇరాక్ మీద దాడి చెయ్యమని ఆదేశాలు ఇస్తే, నిన్నిక క్షమించవలసిన వాడు భగవంతుడొక్కడే. నేనయితే క్షమించను.

[అలెక్స్ మోల్నార్ అమెరికాలో మిల్వాకీ లోని విస్కాన్సిన్ విశ్వ విద్యాలయంలో విద్యాశాఖలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు యుద్ధం మొదలు కావడానికి ముందు ఆయన రాసిన ఈ ఉత్తరం అనేక భాషల్లో అనేక పత్రికల్లో ప్రపంచ వ్యాప్తంగా అచ్చయింది.]

ఎవరి యుద్ధమిది?
ఎవరి కోసమిది?

ధాత్రీ జనని గుండెమీద
యుద్ధపు కొరకంచుల ఎర్రని రవ్వలు
మీరెవరైనా చూశారా
కన్నీరైనా విడిచారా
కోటి కోటి సైనికుల ఊడిపడిన
కనుగ్రుడ్ల అద్దాలలో ప్రతిఫలించే నిజాలను
మీరెప్పుడైనా చూశారా

-తిలక్

'సామ్రాజ్యవాదమంటేనే యుద్ధం' అని లెనిన్ చెప్పిన మాట మరోసారి పశ్చిమాసియా యుద్ధరంగంమీద రుజువవుతోంది. సామ్రాజ్యవాదం ఇప్పుడు మాటలు నేర్చిన గద్ద రూపంలో వచ్చింది గనుక ఎన్నెన్నో చిలక పలుకులూ వినబడుతున్నాయి. శాంతి, న్యాయం, ప్రజాస్వామ్యం, దురాక్రమణనుంచి విముక్తి, చిన్న దేశాలమీద పెద్ద దేశాల పెత్తనంవంటి పెద్ద మాటలన్నీ అర్థం కోల్పోయి అమెరికా అధ్యక్షుడి ప్రసంగాల్లో దొర్లుతున్నాయి. సామ్రాజ్యవాదం చేతిలో ఆయుధ వ్యాపారులు మాత్రమే గాక అక్షర వ్యాపారులూ ఉన్నారు గనుక ప్రపంచ ప్రచార సాధనాలన్నీ కట్టుకథల్ని ప్రకటించే కర్తవ్యాన్ని ఎంచుకుంటున్నాయి. డబ్బున్న దేశాల దీపావళిలో కోట్లాది రూపాయల సంపద రోజురోజూ బుగ్గి అయిపోతోంది. హింసా ప్రవృత్తికి అతి పెద్ద నిదర్శనంగా ఈ మారణకాండను సజీవంగా టెలివిజన్ తెర కెక్కించి ప్రపంచ ప్రజలముందు ప్రదర్శిస్తున్నారు. అచ్చులోనూ, దృశ్యంలోనూ కూడ అబద్ధాల్ని ప్రచారంచేసే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఈ అన్నిరకాల అబద్ధాల మధ్యనుంచి అసలు వాస్తవాల్ని గ్రహించవలసి ఉంది. జార్జిబుష్ కళ్ళలోంచో, సద్దాం హుసేన్ కళ్ళలోంచో కాక పేదదేశాల ప్రజల కళ్ళలోంచి ఈ యుద్ధాన్ని గుర్తించవలసి ఉంది. ఎవరు తెచ్చిన యుద్ధమిది? ఎవరి అవసరాలకోసం సాగుతున్న యుద్ధమిది?

"కువైట్‌లో సక్రమమైన ప్రభుత్వం తిరిగి ఏర్పడే వరకూ" "కువైట్ విముక్తమయ్యేవరకూ" ఈ యుద్ధం సాగుతుందని అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ యుద్ధ ప్రారంభం రోజున ప్రకటించాడు. నిజంగా ఈ యుద్ధం కువైట్ కోసం మాత్రమే మొదలై, కువైట్ కోసమే జరుగుతోందా?

ఇది యుద్ధాలన్నిటికీ తల్లిలాంటి యుద్ధమనీ, ఈ యుద్ధంలో అమెరికన్ సామ్రాజ్యవాదానికీ దాని మిత్ర రాజ్యాలకూ పాఠం చెపుతామనీ ఇరాక్ అధ్యక్షుడు సద్దాంహుసేన్ ప్రకటించాడు. నిజంగా సద్దాంహుసేన్ అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించేందుకే ఈ యుద్ధంలో దిగాడా?

1990 ఆగస్ట్ 2న పొరుగు దేశమైన కువైట్‌ను ఇరాక్ ఆక్రమించడంతో ప్రారంభమైన ఘర్షణ చివరికి 1991 జనవరి 16న పూర్తిస్థాయి యుద్ధంగా మారిందని పాశ్చాత్య పత్రికలు, వాటిని అనుసరించే భారతీయ పత్రికలు రాస్తున్నాయి. ఇది అబద్ధం కాదుగాని అర్ధసత్యమే. కువైట్ మీద ఇరాక్ జరిపిన దురాక్రమణ ఈ యుద్ధానికి ఒక సాకు మాత్రమే. అంతకన్న ముఖ్యమైన ఆర్థిక, రాజకీయ, సైనిక, కారణాలు ఈ యుద్ధాన్ని ప్రేరేపించి, కొనసాగిస్తున్నాయి.

బడుగుదేశాల సహజ వనరులమీద ఆధిపత్యం ఎవరిదన్న ప్రశ్నకూడ ఈ యుద్ధంలో ప్రముఖంగా ముందుకువస్తున్నది. దక్షిణార్ధ గోళంలోని దేశాల భూగర్భంలోనే అతి ఎక్కువ సహజ వనరులు, ఖనిజాలు ఉండడం, వాటిని దోపిడీచేసే అగ్రరాజ్యాలు ఉత్తరార్ధగోళంనుంచి పెట్టుబడులతో, రాజకీయాలతో ఆధిపత్యం చెలాయించడం చాలకాలంగా చర్చనీయాంశంగానే ఉంటున్నది. ఇప్పుడు పశ్చిమాసియా చమురుమీద ఆధిపత్యం పశ్చిమాసియాకు ఉండాలా, పాశ్చాత్య అగ్రరాజ్యాలకు ఉండాలా అనే ప్రశ్న బలంగానే ముందుకు వచ్చింది. మసాచుసెట్స్‌లో ఒక యుద్ధ వ్యతిరేక సభలో మాట్లాడుతూ నోమ్ చామ్‌స్కీ అమెరికన్ సామ్రాజ్యవాదానికి సహజ వనరుల గురించి ఉన్న దృక్పథాన్ని సరిగ్గా విశ్లేషించాడు. అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచంలోని సహజ వనరులన్నీ తనవేనని అనుకుంటుందని, అవి ప్రపంచంలోని ఇతర దేశాల్లో ఉండడం ఒక 'భౌగోళిక యాదృచ్ఛికత' అనుకుంటుందనీ ఆయన అన్నాడు!

చమురు దొరల ప్రయోజనాలు, ఆయుధ ఉత్పత్తిదారుల ప్రయోజనాలు,

కువైటీ, అమెరికన్ ద్రవ్య పెట్టుబడిదారుల ప్రయోజనాలు కలగలసి ఈ యుద్ధానికి కారణమయ్యాయి. ఈ ప్రయోజనాలమధ్య ఘర్షణే జార్జిబుష్, సద్దాంహుసేన్‌ల చర్యల్లో రాజకీయ వ్యక్తీకరణ పొందుతోంది.

కేవలం చమురు ఉత్పత్తి గణాంకాలనే చూస్తే కువైట్ ఏమంత పెద్ద దేశం కాదు. 1989లో అక్కడ మొత్తం చమురు ఉత్పత్తి తొమ్మిదికోట్ల టన్నులు. ఈ మాత్రం చమురు వార్షిక ఉత్పత్తి బ్రిటన్, వెనిజ్యులాల్లో కూడ జరుగుతుంది. కాని కువైట్ చమురుమీద ఇరాక్‌కు ఆధిపత్యం వస్తే, ఇరాక్ చమురు ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. కువైట్‌ను ఆక్రమిస్తే ఇరాక్ వార్షిక ఉత్పత్తి పదమూడు కోట్ల తొంభై లక్షల టన్నులవుతుంది. అట్లా ప్రపంచ చమురు ఉత్పత్తిదారుల జాబితాలో నాలుగో స్థానంలో నిలువగల మహాశక్తిగా ఇరాక్ ఆవిర్భవిస్తుంది. కువైట్‌ను ప్రత్యేక దేశంగా తయారు చేసినప్పుడు బ్రిటిష్ వలసవాద పాలకులు ఈ ప్రయోజనాన్నే ఆశించారు. సింధుశాఖలో చమురు ఉత్పత్తిలో బలీయమైన శక్తేదీ తలెత్తి నిలవగూడదనేదే వాళ్ళ లక్ష్యం.

ఇరాక్ - కువైట్ ఏకీకరణ బలం ఇతర రంగాలలో మరింత ప్రస్ఫుటంగా కనబడుతుంది. కువైట్ ఆక్రమణతో ఇరాక్ ప్రపంచ క్రూడాయిల్ ఎగుమతిదార్ల జాబితాలో రెండో స్థానానికి వస్తుంది. ప్రపంచ చమురు నిల్వలలో పావు వంతు ఇరాక్‌లోనే ఉంటాయి. ఒకవైపు అమెరికన్ చమురు నిల్వలు ఈ శతాబ్దాంతానికి, ఉత్తర సముద్ర జలగర్భంలో చమురు నిల్వలు ఇంకో 14 సంవత్సరాలకు అయిపోతుండగా మరోవైపు కువైట్ భూగర్భంలో మాత్రం ప్రపంచ నిలువల్లో పదో వంతు చమురు ఉంటుంది.

ఇరాక్ కువైట్‌లను పక్కన పెట్టినా మిగిలిన సింధుశాఖ దేశాల పరిస్థితీ ఇంత ఆశాజనకంగానే ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే తెలిసిన చమురు నిల్వల్లో 34 శాతం సౌదీ అరేబియాలోనే ఉన్నాయి. సింధుశాఖ దేశాలన్నిట్లో కలిపితే ఈ నిలువలు 60 శాతం. ఇరాక్, కువైట్‌లను కూడ కలుపుకుంటే ఈ నిల్వలు 85 శాతం. అంతేగాక, 1974 తర్వాత కొత్తగా కనిపెట్టిన ప్రతి చమురు నిక్షేపమూ దాదాపుగా పశ్చిమాసియాలోనే బయటపడింది. భవిష్యత్ అన్వేషణలుకూడ ఈ ప్రాంతంలోనే సఫలమయ్యే అవకాశం ఉంది.

ఒక్కమాటలో చెప్పాలంటే, చమురు ఉత్పత్తి, ఎగుమతులు, వెలికితీయని

నిల్వల విషయంలో సింధుశాఖ ప్రాంతానికి వ్యూహాత్మక ప్రాధాన్యత ఉంది. ఇంత కీలకమైన ప్రాంతం గనుకనే కువైట్‌ను ఇరాక్ ఆక్రమించుకోవడంతో పరిణామాల వరుస వేగవంతమైంది.

కువైట్‌కు ఇరాక్‌కు మధ్య ఘర్షణలు ఇవాళ్టివి కావు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఆటోమన్ సామ్రాజ్యం పతనమైన తర్వాత పశ్చిమాసియాలో అన్ని దేశాల మధ్య సామ్రాజ్యవాదులు తమ ఇష్టానుసారం సరిహద్దు రేఖలు గీశారు. తమ భూభాగాన్ని పొరుగు దేశంలో కలిపేశారని ఆరోపించని దేశమేదీ పశ్చిమాసియాలో లేనంతగా ఈ పునర్విభజన జరిగింది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత మరొకసారి సరిహద్దు రేఖలు గీయడం, కొత్తగా ఇజ్రాయెల్‌ను ఏర్పర్చడం పశ్చిమాసియాను మరింత కల్లోలం చేశాయి. 1923 నుంచి 1961 వరకు బ్రిటిష్ రక్షిత ప్రాంతంగానూ, 1961 నుంచి రాజ్యాంగ బద్ధమైన రాచరికంతో "స్వాతంత్ర్యం" పొందిన దేశంగానూ కువైట్ సింధుశాఖలో సామ్రాజ్యవాద అవసరాలు తీర్చే దేశంగా ఉంటూ వచ్చింది. ఈ ప్రయోజనం కోసమే సామ్రాజ్యవాదులు కువైట్‌లో నిరంకుశ ఎమీర్ కుటుంబపాలనను కొనసాగనిచ్చారు. కువైట్‌లో కొంత భూభాగం తనదేనని ఇరాక్ చాలకాలంగానే ఫిర్యాదు చేస్తూ వస్తోంది.

ఇది ఇట్లా ఉండగా, కువైట్ ఎమిర్ సాగిస్తున్న చర్యలు ఇరాక్ ప్రభుత్వానికి అభ్యంతరకరంగా తయారయ్యాయి. చమురు ఎగుమతి చేసే దేశాల సంస్థ తన సభ్య సంస్థలన్నిటికీ ఎంతెంత చమురు ఉత్పత్తి చేయాలో నిబంధనలు విధిస్తే, కువైట్ ఆ నిబంధనల్ని ఉల్లంఘించింది. అమెరికా వత్తాసుతో కువైట్ తన కోటా కన్న ఎక్కువ చమురును ప్రపంచ మార్కెట్‌లోకి పంపించడంతో మార్కెట్‌లో చమురు ధర పడిపోవడం మొదలైంది. ఇరాన్‌తో ఎనిమిది సంవత్సరాల యుద్ధం తర్వాత తాను తన ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించుకుంటున్నాననీ, ఈ ధరల తగ్గింపు తన మీద ప్రతికూల ప్రభావం వేస్తుందనీ ఇరాక్ వాదిస్తోంది. క్రూడాయిల్ ధరలో బారెల్‌కు ఒక డాలర్ పడిపోయినా, తనకు సంవత్సరానికి వందకోట్ల డాలర్ల నష్టం వస్తుందని ఇరాక్ అంటోంది. కువైట్‌ను ఇరాక్ ఆక్రమించడానికి పునాదిగా పని చేసిన వివాదం ఇదే కావచ్చు. కాని, ఇరాక్ అధికారికంగా చెప్పిన కారణాలలో ఇది లేదు.

పాలక అల్‌సబా కుటుంబాన్ని కూలదోసిన విప్లవకారులు తనను ఆహ్వానించా

రనీ, కువైట్ విదేశాంగ మంత్రి అమెరికన్ ఏజంటనీ, తన చమురు క్షేత్రాలలోంచి కువైట్ చమురు దొంగిలిస్తోందనీ, తనకు వ్యతిరేకంగా కువైట్ సైనిక కార్యకలాపాలకు పూనుకుంటోందనీ ఇరాక్ ప్రభుత్వం ప్రకటించింది.

ఇవన్నీ నిజమే అయినా కువైట్ మీద దురాక్రమణ సాగించే హక్కు ఇరాక్‌కు లేదు. కాని సద్దాం హుసేన్ పాలనలో ఇరాక్ గత రెండు దశాబ్దాలుగా విపరీతంగా సైనికీకరణ పొందింది. పశ్చిమాసియాలో ప్రబలమైన సైనిక శక్తిగా అవతరించింది. ఇటు సోవియట్ యూనియన్ నుంచి బహిరంగంగాను, పాశ్చాత్య దేశాల నుంచి వేరువేరు మార్గాలలోను ఇరాక్ ప్రభుత్వం కుప్పలు తెప్పలుగా ఆయుధ సమీకరణ చేసుకుంది. ప్రత్యేక కుర్దిస్తాన్ కోసం మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానం వెలుగులో పోరాడుతున్న కుర్దుల మీద విషవాయువుల్ని, రసాయనిక ఆయుధాల్ని ప్రయోగించడంతో సహా దారుణ దమనకాండకు పాల్పడింది. ఇరాన్‌తో ఎనిమిది సంవత్సరాల పాటు యుద్ధం సాగించి ఆయుధ ఉత్పత్తిదార్ల పంట పండించింది.

మరో మాటల్లో చెప్పాలంటే దక్షిణాసియాలో భారత ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి విస్తరణవాద వ్యూహాన్నే, పశ్చిమాసియాలో ఇరాక్ అనుసరిస్తూ వచ్చింది. సోవియట్ యూనియన్ భారతదేశాన్ని సమర్థించినట్టుగానే, ఇరాక్‌నూ సమర్థిస్తూ వచ్చింది.

కువైట్‌ను ఇరాక్ దురాక్రమించడం తప్పనీ, ఇరాక్ వెంటనే కువైట్ నుంచి వైదొలగాలనీ ప్రపంచ వ్యాప్తంగా నిరసన చెలరేగింది. ఈ న్యాయమైన నిరసనను తన దుర్మార్గ విధానాల కోసం వినియోగించుకోవాలని అమెరికన్, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని సమావేశపరిచి అతి తక్కువ వ్యవధిలో ఇరాక్‌కు వ్యతిరేకంగా అతి ఎక్కువ తీర్మానాలు చేయించారు. ఇరాక్‌పైన ఆర్థిక ఆంక్షలు విధించారు. జనవరి 15 లోగా కువైట్ నుంచి వైదొలగకపోతే 'ఇతర చర్యలు చేపట్టవలసి వస్తుందని" హెచ్చరించారు. ఈ మొత్తం క్రమంలోనూ ఐక్యరాజ్యసమితి సాధారణ సమావేశాన్ని ఎప్పుడూ ఏర్పరచలేదు. ఈ అన్ని నిర్ణయాలూ పదిహేను మంది సభ్యులున్న భద్రతా మండలే తీసుకుంది. "ఇతర చర్యల" గురించి హెచ్చరించిన తీర్మానాన్ని సోవియట్ యూనియన్ కూడ సమర్థించగా చైనా ఎటూ వోటు వెయ్యలేదు. క్యూబా,

యెమెన్‌లు వ్యతిరేకంగా వోటు వేశాయి. అంటే, ప్రపంచ ప్రజాభిప్రాయానికే ఐక్య రాజ్యసమితి ప్రాతినిధ్యం వహిస్తుందా అనే అనుమానం ఉండగా, ఆ ఐక్యరాజ్య సమితిలో కూడ కేవలం పన్నెండు దేశాల నిర్ణయం ప్రకారం ఇరాక్‌కు హెచ్చరిక జారీ అయింది. ఈ హెచ్చరిక యుద్ధం గురించి ఏమీ మాట్లాడకపోయినా, అమెరికా, బ్రిటన్‌లు సైనిక సమీకరణను, యుద్ధపు ఏర్పాట్లను వెంటనే ప్రారంభించాయి.

ఇక్కడ ఒక్క క్షణం ఆగి ఈ యుద్ధోన్మాదుల అసలు రంగు తెలుసుకో వలసి ఉంది. ప్రపంచంలో ఒక దేశాన్ని మరో దేశం దురాక్రమించడం ఇదే మొదటిసారి కాదు. పాలస్తీనాను ఇజ్రాయిల్ ఆక్రమించి తిష్టవేసుకుని కూచుని ఉంది. గ్రెనడా, పనామాలను అమెరికా ఆక్రమించింది. లిబియా మీద దౌర్జన్యపూరిత దాడి జరిపింది. వియత్నాం మీద అనేక సంవత్సరాలపాటు దుర్మార్గమైన యుద్ధం చేసింది. సోవియట్ యూనియన్ చెకొస్లవేకియా మీద దాడి జరిపింది. అఫ్ఘనిస్తాన్‌ను దురాక్రమించింది. బ్రిటన్ ఫాక్‌లాండ్స్‌ను ఆక్రమించింది. వియత్నాం కంపూచియాను ఆక్రమించింది. భారతదేశం సిక్కింను ఆక్రమించింది. దక్షిణాఫ్రికాలో ఆక్రమణదారుల పాలనే కొనసాగుతోంది—ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి దురాక్రమణల జాబితాకు అంతులేదు. ఈ దురాక్రమణలు వేటిలోనూ ఐక్యరాజ్యసమితి నిర్ణయాత్మకమైన పాత్ర వహించలేదు సరిగదా, అమెరికా, బ్రిటన్, సోవియట్ యూనియన్‌లు తమ వీటో అధికారాన్ని ఉపయోగించి దురాక్రమణదారుల్ని కాపాడుతూ వచ్చాయి. ఇటు వంటి భద్రతా మండలికీ, ఐక్యరాజ్యసమితికీ, అగ్రరాజ్యాలకూ ఇరాక్‌ను వేలెత్తి చూపే అర్హత లేదు.

ఐక్యరాజ్యసమితి హెచ్చరికను సద్దాం హుసేన్ ఖాతరుచెయ్యడం లేదని గుర్తించగానే, అమెరికన్ బృందగానం ఐక్యరాజ్యసమితి కీర్తనలు ప్రారంభించింది. ఐక్యరాజ్యసమితిని ఎన్నడూ గౌరవించని, ఎన్నోసార్లు ఉల్లంఘించిన అగ్రరాజ్యాలే ఐక్యరాజ్యసమితి ఎంత గొప్పదో, ఎంత అనుల్లంఘనీయమో ప్రకటించాయి.

ఈ యుద్ధోన్మాద కుట్రలను గుర్తించిన ప్రజానీకం చాలదేశాల్లో యుద్ధ వ్యతి రేక ప్రదర్శనలను ప్రారంభించారు. ఇరాకీ విస్తరణవాదాన్ని ఖండిస్తూనే, ఆ సాకుతో యుద్ధం తేనున్న సామ్రాజ్యవాద కుటిల పన్నాగాలను తిప్పి కొట్టడానికి ప్రయత్నించారు. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో ప్రభుత్వ వ్యతిరేక, యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చెలరేగాయి. మరో వైపు శాంతి ప్రయత్నాలు ప్రారంభ

మయ్యాయి. ఇరాక్-కువైట్ సమస్యను అరబ్ ప్రజల అంతరంగిక సమస్యగా గుర్తించాలనీ, దానిలో జోక్యం చేసుకునే హక్కు సామ్రాజ్యవాదులకు కాని అమెరికాకూ, బ్రిటన్‌కూ ఇతర సామ్రాజ్యవాద దేశాలకూ లేదనీ ప్రపంచ ప్రజలు ముక్తకంఠంతో ప్రకటించారు. ఇప్పుడు యుద్ధం అత్యవసరం. కువైట్ నుంచి ఇరాక్ సేనలను ఉపసంహరింపజేయడమో, కువైట్‌లో ప్రజాభీష్టం ప్రకారం ప్రభుత్వాన్నేర్పరచడమో అగ్రరాజ్యాల లక్ష్యం కాదు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనేక కీలక స్థానాల్లో కువైటీ పెట్టుబడులున్నాయి. 'కువైటీ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీస్' అనే సంస్థద్వారా సాగిన ఈ పెట్టుబడుల్లో సగం ఎమీర్, అతని కుటుంబ సభ్యుల విదేశీ పెట్టుబడులే. ప్రస్తుత జర్మనీ ఆర్థికవ్యవస్థకు పునాది అయిన ఒక అర్థ–సైనిక కంపెనీలో ఐదోవంతు పెట్టుబడులు ఎమీర్ రాజ కుటుంబానివే. జపాన్‌లో అతి పెద్ద విదేశీ పెట్టుబడిదారు ఎమీరే. అమెరికాలో మూడువేల కోట్ల డాలర్ల మేరకు కువైటీ ఆస్తులున్నాయి. 1990 చివరి నాటికి అమెరికా ఇతర దేశాలకు డెబ్బైవేల కోట్ల డాలర్లు అప్పు పడుతుందని అంచనా ఉండగా, అదే సమయానికి కువైటీ సంపన్నులు ప్రపంచవ్యాప్తంగా ఇరవై వేల కోట్ల డాలర్లు పెట్టుబడి పెడుతుంటారని తెలుస్తోంది. అంతేకాదు, కువైటీ షేక్‌లకు ఇప్పుడు చమురుమీద వచ్చే ఆదాయంకన్న, పెట్టుబడులపై వచ్చే లాభాలే ఎక్కువ.

పశ్చిమాసియాలోనే పేద దేశాలూ, నిరుపేద ప్రజానీకమూ ఎందరో ఉండగా, ఈ సంపన్న దేశాల షేక్‌లు, అమీర్‌లు, రాజులు చమురుద్వారా సంపాదించిన కోట్లాది డాలర్ల ధనాన్ని తమ విలాసాల కోసమూ, పాశ్చాత్య దేశాల్లో పెట్టుబడుల కోసమూ వాడుతున్నారు. తద్వారా ప్రపంచ రాజకీయ, సైనిక పరిణామాల మీద ప్రభావం వేస్తున్నారుగాని, అందువల్ల నిరుపేద అరబ్ ప్రజానీకానికేమీ లాభం లేదు.

ఈ ఆర్థికకోణం యుద్ధాన్ని త్వరితం చేసింది.

మరోవైపు పాశ్చాత్య ఆయుధవ్యాపారుల ప్రయోజనాలు ఈ యుద్ధానికి అవకాశం కలిగించాయి. 1973-74 నుంచి ఈ ఆయుధ వ్యాపారులు తమ వ్యాపారాన్ని సింధుశాఖలోనే ఎక్కువగా జరిపి, ఆయిల్ డాలర్ల రుచి మరిగారు. అత్యాధునికమైన, అతి ఖరీదయిన యుద్ధయంత్రాంగం పశ్చిమాసియాలో దిగడం మొదలయింది. ఇరాన్-ఇరాక్ యుద్ధసమయంలో ఒకే వ్యాపారులు, ఒకే యుద్ధసామగ్రిని

ఇరుదేశాలకూ అమ్మారనే విషయంకూడ బైటపడింది. ప్రపంచ ఆయుధమార్కెట్‌లో అమ్ముడవుతున్న ఆయుధాలలో సగం ఈ రెండు దేశాలే కొనుక్కుంటున్నాయని 1987లో తేలింది. పాశ్చాత్యదేశాలు యుద్ధసామగ్రిని సింధుశాఖ దేశాలకు అమ్ముతూ, బదులుగా తక్కువ ధరలకు చమురు కొనుక్కునే ఒప్పందాలను కూడ చేసుకున్నాయి. ఒక్క సౌదీఅరేబియానే 15 సంవత్సరాల కాలంలో ఇరవై వేల కోట్ల డాలర్ల ఆయుధాల్ని కొనుక్కుందంటే, ఆయుధ వ్యాపారం ఎంత పెద్దఎత్తున సాగిందో అర్థమవుతుంది.

అగస్టులో ఈ ప్రాంతంలో ఘర్షణ ప్రారంభం కాగానే మరొకసారి ఈ ఆయుధ వ్యాపారుల పంట పండింది. అన్ని సింధుశాఖ దేశాలనుంచీ ఆయుధాల కోసం ఆర్డర్లు వచ్చిపడ్డాయి. ఈ ఆర్డర్ల విలువే రెండువేల కోట్ల డాలర్లు కాగా, ఆ ఆయుధసామగ్రి నిర్వహణ వ్యయం మరెన్నో రెట్లుంటుంది.

ఈ ఆయుధ వ్యాపారులకు ఒక రాజకీయ కోణం కూడ ఉంది. రీగన్ ఆర్థిక విధానాలకు సోవియట్ యూనియన్ బూచి చూపి సమర్థన చెప్పుకునే అవకాశం ఉండేది. కాని, గోర్బచేవ్ తర్వాత సోవియట్ యూనియనే తన ఆంతరంగిక కల్లోలాలను పరిష్కరించుకునే ప్రయత్నంలో పడిపోగా, తూర్పు యూరప్‌లో సోవియట్ పట్టుసడలిపోగా, అమెరికన్ సైనిక మోహరింపు అనవసరంగా కన బడడం మొదలయింది. అమెరికన్ రక్షణ వ్యయాన్ని తగ్గించక తప్పని పరిస్థితి వచ్చింది. ఈ స్థితిలో మరొక బూచినీ, మరొక సైనిక మోహరింపు అవసరాన్నీ ఆయుధ వ్యాపారులు గుర్తించారు. సరిగ్గా ఆ పని చేసిపెట్టేందుకు సద్దాం హుస్సేన్ అవతరించాడు.

ఈ రకంగా అనేక ప్రవాహాలు కలగలిసి యుద్ధాన్ని అనివార్యం చేశాయి. సామ్రాజ్యవాదం ఉన్నంతకాలం యుద్ధం అనివార్యం అవుతుందనేది ఇన్ని కారణాల వల్ల కూడ రుజువైంది.

జనవరి 15కు ముందే శాంతి ప్రతిపాదన సాధ్యమయ్యే అవకాశం ఉన్నప్పటికీ ఈ కారణాల వల్లనే సామ్రాజ్యవాదులు యుద్ధాన్నే ప్రారంభించారు. రోజుకు రెండువందల కోట్ల రూపాయలు ఈ యుద్ధంలో దగ్ధమైపోతున్నాయని ఒక అంచనా.

నిజానికి యుద్ధంలో ఖర్చులు తగ్గించి చెపుతారు గనుక కనీసం రెట్టింపు సంపద ఈ యుద్ధంలో బుగ్గి అయిపోతూ ఉండవచ్చు.

యుద్ధానికి రోజులు దగ్గర పడుతున్నకొద్దీ సద్దాం హుసేన్ ఈ సమస్యను అరబ్-ఇజ్రేల్ ఘర్షణగా చిత్రించడం ప్రారంభించాడు. పశ్చిమాసియాలో అక్రమంగా పాలస్తీనియన్లను స్వస్థలాలనుంచి వెళ్ళగొట్టిన ఇజ్రాయెల్ దురాక్రమించిన భాగాలను వదులుకుంటే తన సేనలను కువైట్‌నుంచి ఉపసంహరిస్తానన్నాడు. ఇరాక్‌కు ఓడరేవులు కల్పించుకోవడానికి వీలుగా సింధుశాఖలో రెండు చిన్న ద్వీపాల్ని ఇమ్మని అడిగాడు. నిజానికి ఈ రెండు కోర్కెలూ ప్రపంచ రాజకీయాల నేపథ్యం నుంచి, ఛిన్నాభిన్నమైన ఇరాకీ ఆర్ధిక వ్యవస్థ నేపథ్యం నుంచి చూస్తే న్యాయమైన కోర్కెలే. కాని సామ్రాజ్యవాద యుద్ధోన్మాదులకు ఈ ఘర్షణలో న్యాయాన్యాయాలతో నిమిత్తం లేదు. వారి కోరికల్లా సింధుశాఖలో తమ తొత్తుగా కువైట్ యథాతథంగా ఉండడం, ఆయుధ వ్యాపారం ఇతోధికంగా కొనసాగడం.

అందువల్లనే జనవరి 16న యుద్ధం ప్రారంభమైంది యుద్ధం దగ్గర పడుతుండగా సద్దాం హుసేన్‌తో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి జరిపిన చర్చల్లో నిజానికి సద్దాం హుసేన్ ఇచ్చిపుచ్చుకునే వైఖరిని ప్రదర్శించాడని యుద్ధం మొదలైన వారానికి బైటపెట్టారు.

ఈ రాజకీయ కుట్రలు, తారీఖులు, దస్తావేజులు ఎట్లా ఉన్నా, అంతిమంగా యుద్ధ దుష్పరిణామాలకు గురయ్యేది ప్రజలు. ఆధునిక కాలంలో రవాణాకు అత్యవసరమైన చమురు ఈ యుద్ధంలో ఆవిరి అయిపోతుంది. యుద్ధం ముగిసినా, ముగియకున్నా చమురు ధరలు విపరీతంగా పెరుగుతాయి. అంటే సరుకుల రవాణా ఖర్చులు పెరిగి సరుకుల ధరలన్నీ అనేక రెట్లు పెరిగిపోతాయి. ఇప్పటికే చమురు ట్యాంకర్లు పగిలి సముద్ర జలాలు కలుషితమవుతున్నాయి గనుక దాని పర్యావరణ ఫలితాలు ప్రమాదకరంగా ఉంటాయి. ఈ యుద్ధంలో రసాయనిక ఆయుధాలు, క్రిమి ఆయుధాలు, అణ్వాయుధాలు వాడుతామనే బెదిరింపులు ఇప్పటికే వస్తున్నాయి. ఆ ఆయుధాలను అంతిమంగా ప్రయోగిస్తే ప్రపంచవ్యాప్తంగానే ప్రజల ఆరోగ్యాలకు, ప్రాణాలకు, భద్రతకు ప్రమాదం ఏర్పడుతుంది.

ఇంత దుర్మార్గమైన, అనవసరమైన ఈ యుద్ధాన్ని నివారించడానికి ఏ ప్రయత్నమూ చెయ్యని 'అలీనోద్యమం' తన సహజమైన అశక్తతను స్పష్టంగానే తెలియజెప్పింది. అసలు నిజానికి అలీనమైన ప్రభుత్వమేదీ లేదని యుద్ధపరిణామాలు రోజు రోజూ రుజువు చేస్తున్నాయి. ఈ క్రమంలో నిస్సిగ్గుగా తన స్వభావాన్ని బహిర్గతం చేసుకున్నది భారత ప్రభుత్వం. మొదట యుద్ధం గురించి సోవియట్ యూనియన్ వైఖరి స్పష్టం కాలేదు గనుక భారత ప్రభుత్వంకూడ తన వైఖరి ప్రకటించలేదు. యుద్ధాన్ని ఆపాలని ఒక శాంతి ప్రవచనం చేసి, కువైట్ నుంచి ఇరాక్ వైదొలగా లంటూ సోవియట్ యూనియన్ ప్రకటించగానే భారత ప్రభుత్వమూ అటువంటి ప్రకటనే చేసింది. ఈ వైఖరికి సంతోషించిన సామ్రాజ్యవాద పెద్దలు భారత ప్రభుత్వానికి వెంటనే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ రుణం నాలుగువేల కోట్ల రూపాయలు మంజూరు చేశారు. భారత ప్రభుత్వం మరింత కృతజ్ఞతతో అమెరికన్ యుద్ధ విమానాలకు బొంబాయి, మద్రాసు, నాగపూర్‌లలో ఇంధనం నింపింది. బొంబాయి ఓడరేవులో అమెరికన్ యుద్ధనౌకలను ఆగనిచ్చింది. అట్లా యుద్ధం మన తీరం నుంచీ సాగడానికి భారత ప్రభుత్వం అన్ని అవకాశాలూ కల్పించింది.

ప్రపంచవ్యాప్తంగా ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలన్నీ ఇటువంటి వైఖరినే తీసుకుంటుండగా ప్రజలు మాత్రం అంతకంతకూ ఎక్కువగా యుద్ధాన్ని నిరసిస్తూ వీధుల్లోకి రావడం ప్రారంభించారు. ఈ క్రమంలో ప్రజలలో వ్యక్తమైన సామ్రాజ్యవాద వ్యతిరేకత సద్దాం హుసేన్ పట్ల అనుకూలతగా కూడ పరిణమిస్తోంది. సద్దాం హుసేన్ యుద్ధక్రమంలో దృఢమైన సామ్రాజ్యవాద వ్యతిరేకిగా కనబడుతున్నాడు.

ఇప్పుడిక యుద్ధం రోజురోజుకూ తీవ్రతరమవుతూ సామ్రాజ్యవాదానికీ, సామ్రాజ్యవాద వ్యతిరేకతకూ మధ్య స్పష్టమైన విభజన రేఖను గీస్తోంది. ఇవాళ స్థిరంగానూ, దృఢంగానూ సామ్రాజ్యవాద వ్యతిరేకతను ప్రచారం చేయడం ప్రజాస్వామికవాదుల కర్తవ్యం. యుద్ధాన్ని వెంటనే ఆపివేసి ఆస్తి నష్టాన్ని, జన నష్టాన్ని నివారించాలని, పాలస్తీనా నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలని, కువైట్ నుంచి ఇరాక్ వైదొలగాలని, పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు పశ్చిమాసియా ప్రజలు చొరవతో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయవలసి ఉంది.

(ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సంపాదకీయాలకు,
పీటర్ కస్టర్స్ వ్యాసానికి కృతజ్ఞతలతో)

నడుస్తున్న చరిత్ర :

తుపాకీ రాజ్యం

జనవరి 1. కొత్త సంవత్సరం తొలిదినం. చలికాలం మధ్యాహ్నం వెచ్చటి ఎండలో నిజామాబాద్ జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని 'లాన్స్'లో శ్రీ రఘువీర్ ప్రసాద్ మీనాగారు వాలుకుర్చీలో ఆసీనులయి ఉన్నారు. వారి ఎదుట మరికొన్ని కుర్చీలున్నాయి. నిజామాబాద్ మునిసిపల్ ఛైర్మను, ఇద్దరు ముగ్గురు కాంట్రాక్టర్లు కూర్చొని ఉన్నారు. మరికొంత దూరంలో జిల్లాకు చెందిన అమీన్‌సాబ్‌లూ సర్కిల్‌సాబ్‌లూ డి ఎస్ పి దొరలూ అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. గుంపులు గుంపులుగా నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు. తమను ఆశ్రయించిన వాళ్ళ కోరికలు తీర్చడానికి కావలసిన అధికారసమృద్ధి చేతిలోవున్న అదృష్టవంతుల దర్పం వాళ్ళ నవ్వులో ఉంది. అందరి చేతులలోనూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే రంగురంగుల కేకులు ఉన్నాయి. ఒక్కొక్కరూ మీనాగారికి వాటిని అందిస్తున్నారు. మీనాగారు ఒక చిన్నముక్క నైవేద్యం చేసి మిగిలింది అందరికీ ప్రసాదం పంచుతున్నారు. కేక్ రుచి చూస్తూ ఎడతెరిపి లేకుండ మాట్లాడుతున్నారు. వారి ఆలోచనలకు వారధిలేదు. అభిప్రాయాలకు పరిధిలేదు. ఆత్మవిశ్వాసానికి అవధులు లేవు. శాంతి భద్రతలే కాదు, రాజకీయాలు, పరిపాలనా వ్యవస్థ, మతం, కులం, పత్రికారంగం- అన్నిటి గురించీ వారు ముచ్చటిస్తున్నారు. ధారావాహికంగా అభిప్రాయాలు చెప్తున్నారు. ప్రస్తుత వ్యవస్థలో ఈ రంగాలను నిర్వహిస్తున్నవారంతా అసమర్థులు అవినీతిపరులు. వాటినన్నింటినీ పోలీసులకు అప్పజెప్పేస్తే ప్రపంచం హాయిగా, ప్రశాంతంగా ఉంటుంది. ఇదీ వారి ప్రసంగం సారాంశం. అమీన్‌సాబ్‌లూ సర్కిల్‌సాబ్‌లూ డి ఎస్ పి దొరలూ ఆరాధనపూర్వకంగా ఊఁ కొడుతున్నారు.

అదే వూళ్లో జిల్లా కలెక్టరు ఒకడున్నాడు. వారికీ ఒక కార్యాలయం, కార్యాలయానికి ఆవరణ, ఆవరణలో 'లాన్స్' ఉన్నాయి. కానీ వారెందుకో వెచ్చటి ఎండలోకాక చలికి ముడుచుకుపోయిన గదిలో ట్యూబ్‌లైట్ వెలుగులో కూర్చున్నారు వారూ వారి సి. సి. తప్ప కార్యాలయంలో వేరెవ్వరూ లేరు (వారికి భార్యాపిల్లలు అసలే లేనట్టున్నారు). వారి మాటలకు అడుగడుగునా బ్రేకులే. వారికి మాటలు రావనికాదు. నిజానికి వారు మీనాకంటే 'ప్రతిభావంతులే'. ఐ ఎ ఎస్ గద్దెక్కారు కదా! మీనాలాగ క్రింది మెట్టుదగ్గర ఆగిపోలేదు. వారూ పలు విషయాల గురించి

అనర్గళంగానే మాట్లాడగలడు. కానీ పాపం మొదలుపెట్టిన ఉత్తరక్షణం అత్మ సంశయం వహిస్తుంది. వాక్యమధ్యంలో మాటలాగిపోతాయి. కళ్ళల్లో మీనా తళుక్కుమంటాడు. తనకు వుందని ఎదుటివారు భావించే అధికారం నిజంగా లేదని తెలిసిన అసమర్థుని సంకటస్థితి ఇది.

ఈ దృశ్యాలలో ఆ యిద్దరు వ్యక్తుల ప్రత్యేక వ్యక్తిత్వాల ప్రతిబింబం కొంత లేకపోలేదు. కానీ ఇది ప్రధానంగా ఈనాటి దౌర్భాగ్య స్థితికి అద్దంపట్టే చిత్రం. రాజకీయ నాయకులు హత్యలుచేసి అధికారంలోకి వచ్చి, మరికొన్ని హత్యలు చేసి అధికారం నిలుపుకుంటున్నారు. వాళ్ళ అధికారానికి భరోసాలేదు. కాబట్టి ఉన్నంత కాలం తామూ తమవారూ వేగంగా సంపాదించుకొని రాజీవుడు తలచిననాడు దిగి పోవాలి. సంపాదనకు తప్ప వేరేదేనికీ వాళ్ళకు టైంలేదు. వాళ్ళ ముఠా ప్రయోజనాలే తప్ప వేరే రాజకీయం లేదు. పాలకవర్గాల దీర్ఘకాల ప్రయోజనాలను గురించికూడ వాళ్ళు ఆలోచించడం లేదు. దానిని మార్కెట్‌లో పెట్టుబడికీ బయట గుండాలకూ పోలీసులకూ వదిలేసారు. ఈ పరిపాలనా వ్యూహంలో ప్రపంచ బ్యాంకుకూ సుధీర్ కుమార్‌కూ రఘువీర్ ప్రసాద్ మీనాకూ చోటుండిగానీ అభివృద్ధి, సంక్షేమం, చట్ట బద్ధపాలన మొదలయిన వాదస్త్రాలకు చోటెక్కడిది?

'పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చేసాం' అని సిగ్గొదిలిపెట్టి గర్వంగా ప్రక టించాడు నేదురుమిల్లి జనార్ధనరెడ్డి (ఆయన జీవిత చరిత్ర తెలిసినవాళ్ళు ఆయనకు ఇంకా సిగ్గు మిగిలివుందని భావించరనుకోండి.) పోలీసులు ఒళ్ళు విరుచుకొని లేచారు. చెన్నారెడ్డి 'త్రిసూత్రపథకం' ఎత్తుగడవల్ల తొమ్మిది నెలలు కొంత విరా మం తీసుకొని వాళ్ళు బలం పుంజుకొనివున్నారు మీటింగ్‌లకూ ఊరేగింపులకూ తిరిగిన వాళ్ళ లిస్టులు తయారుచేసుకొని వున్నారు. భూములు దున్నుకున్న ఊళ్ళలో మొదట నాగలికట్టిన వాళ్ళపేర్లు రాసుకొనివున్నారు. ప్రజాకోర్టులలో ఉత్సాహంగా పాల్గొన్నవారి జాబితా సేకరించి వున్నారు. వాళ్ళకు తోడుగా ఢిల్లీ అనుమతితో ఇండోటిబెటన్ బోర్డర్ ఫోర్స్ బెటాలియన్ ఒకటి దిగుమతి అయింది. ఇండియాకు టిబెట్‌కూ సరిహద్దు మహబూబ్‌నగర్‌లో ఆదిలాబాద్‌లో కరీంనగర్‌లో ఉందని వాళ్ల కనుక్కొని అక్కడ స్థిరపడ్డారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అనే స్టెన్‌గన్ రాక్షసముఠాకు తోడుగా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అనే సుశిక్షిత సాయుధ ముఠా

ఒకటి తయారయింది. తెలుగుజాతినేత ఎన్టీఆర్ గ్రేహౌండ్స్ అనే పేరుతో తర్ఫీదు మొదలుపెట్టిన ఈ సైన్యానికి చెన్నారెడ్డి ఏలికలో ఈ కొత్తపేరు పెట్టి తర్ఫీదు పూర్తి చేసారు. ఇప్పుడు వీళ్ళందరినీ జనంమీదికి వదిలారు. వీళ్ళు విడివిడిగానూ ఉమ్మడి గానూ జనాన్ని చంపుతున్నారు.

నర్మెట్ట, అచ్చంపేట, చిట్యాల, గజ్వేల్ సంఘటనలను విడివిడిగా చర్చిస్తూ రాడికల్స్ ఏవో తొందరపాటు చర్యలకు పాల్పడ్డారని అందరం విమర్శించాముగానీ అన్నిటినీ కలిపి చూస్తే వాటిలో ప్రభుత్వ సంకల్పమే ప్రధానంగా కనిపిస్తుంది. ఒకప్పుడు 'వ్యక్తిగత హింసను వదిలిపెట్టి ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలు నిర్వహించవచ్చును కదా' అని సవాలు చేసారు. ప్రజాబలం లేక తుపాకులు పట్టు కున్నారని ఎద్దేవా చేసారు. అవకాశం ఇస్తాం, చేతనయితే ప్రజలను సమీకరించి పోరాడండి అన్నారు. నాయకులు ఉపన్యాసాలు ఇచ్చారు, పత్రికలు సంపాదకీయాలు రాసాయి. తొమ్మిది నెలలు గడిచాయో లేదో ఇకచాలని అందరికీ అనిపించింది. ఒకప్పటి సవాలును వాళ్ళే మరచిపోయారు. త్రిసూత్ర పథకాన్ని అమలుచేయకుం డానే అది విఫలం అయిపోయిందని అందరూ అంగీకరించారు. ఇక అణచివేయండి, అణచివేయండి, అని ప్రభుత్వాన్ని గెచ్చగొట్టారు. ప్రభుత్వం సై అనింది. 'ప్రజా పోరాటాలు నిర్వహించరాదా' అని హేళన చేసినవారు ఒక్కొక్క ప్రజా పోరాట రూపంమీదా తుపాకులు ఎక్కుపెట్టి అణచివేతను ప్రకటించారు. నర్మెట్టలో ధర్నా, అచ్చంపేటలో బహిరంగసభ, చిట్యాలలో రాస్తారోకో, గజ్వేల్‌లో ఊరేగింపు-అన్నీ ప్రజాపోరాట రూపాలే. అన్నిటి మీదా తుపాకులు ఎక్కుపెట్టారు. 'ఇకచాలు, ఉద్య మాలు నిర్వహించడం మానుకోండి' అనేది ఈ దాడుల సందేశం. కిడ్నాప్‌లు చేస్తు న్నారనేది, బలవంతంగా లారీలను తరలిస్తున్నారనేది, బెదిరించి చందాలు వసూలు చేస్తున్నారనేది సాకులు మాత్రమే. అవే కారణాలయితే దేశవ్యాప్తంగా మతకల్లో లాలను రెచ్చగొట్టి గత సంవత్సరం చివరి మూడు నెలలలో 690కి పైగా హత్య లకు కారణమయిన భారతీయ జనతా పార్టీకి, రాష్ట్రంలో ప్రతిరోజూ పరస్పర హత్యాకాండకు పాల్పడుతున్న కాంగ్రెస్-తెలుగుదేశం పార్టీలకూ, చెన్నారెడ్డిని గద్దె దించడం కోసం దాదాపు 300 మందిని చంపించిన జనార్దనరెడ్డి-సుధీర్‌కుమార్ ముఠాకు, ఏ ప్రజాస్వామిక హక్కూ ఉండవు.

ఆ తరువాత వరసగా ఎన్‌కౌంటర్లు ప్రారంభమయ్యాయి. అడ్డతీగల దగ్గర

జబేరులో జరిగిన కాల్పులు తప్ప తక్కినవన్నీ బూటకపు ఎదురుకాల్పులే. ఆచ్చం పేట మీటింగ్‌కు పోస్టర్లు అంటిస్తూవున్న కృష్ణారెడ్డిని మహబూబ్‌నగర్ జిల్లా గౌరి దేవిపల్లిలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పోలీసులు గోడకు నిలబెట్టి కాల్చేసి 'ఎన్‌కౌంటర్' జరిగిందన్నారు. పార్టీ చేత బహిష్కరించబడ్డ బాలన్ననూ ఎన్నడూ ఏ రాజకీయాలూ ఎరగని యాదగిరినీ పండుకున్న మంచెమీది నుండి లేపి తీసుకుపోయి కాల్చేసారు. నిజామాబాద్ జిల్లా మోస్రా గ్రామంలో మీనా పోలీసులు. రవీంద్రఖనిలో పనిచేసుకుంటూ వుండి పోలీసుల దాడులకు భయపడి చాందా పారిపోయి అక్కడ వృత్తి చేసుకుంటూ ఉండిన మంతెన సారయ్యను వెంటాడి అరెస్టుచేసి అందుగుల పల్లికి తీసుకొచ్చి కాల్చేసి 'ఎన్‌కౌంటర్' జరిగిపోయిందన్నాడు రామగుండం ఎస్.ఐ. బ్రహ్మానందం. మంచిర్యాలలో ఒక సాయంత్రం దొరికిన జనరక్షణ కార్యకర్తలు దేవిడ్ ఆనంద్‌లను తెల్లవారుజామున మందమర్రి దారిలో రోడ్డు పక్కన కాల్చేసి కందిచేనులో ఎదురుకాల్పులయ్యాయన్నారు బెల్లంపల్లి అడిషనల్ ఎస్.పి. మహేందర్ రెడ్డి పోలీసులు. భువనగిరి సిపో విజయకుమార్‌ను ఊరి నుండి నాలుగు కిలోమీటర్ల దూరం కాంగ్రెస్ మునిసిపల్ కౌన్సిలర్ మనుషులు తరమగా అక్కడ చుట్టుముట్టి వరిచేనులో కాల్చేసి ఆ బురదలోనే పండుకొని తపంచాతో తమమీద హత్యా ప్రయత్నం చేసాడని ప్రకటించారు నల్గొండ జిల్లాలో జె. వి. రాయుడు బంట్లు. ఇది రాస్తూండగా ఇంకా 'ఎన్‌కౌంటర్లు' అవుతూనే ఉన్నాయి. సిర్పూర్‌లో, మంథనిలో, దేవాపూర్‌లో, మంచిర్యాలలో ఈ వారం రోజులలో 'ఎన్‌కౌంటర్లు' జరిగాయి.

తుపాకీ రాజ్యానికి 'శిలాన్యాసం' చేసి ప్రజలమీద నిత్యం దాడులకు పాల్పడుతూ, తామే నక్సలైట్లమీద 'తుపాకీరాజ్యం' అనే డ్రామా తయారుచేసి ప్రజల డబ్బుతోనే ఆడిస్తున్నారు రాష్ట్ర పోలీసులు. శభాష్! అనక ఏమంటాం. పోలీసులకు రాజకీయ నాటకాలు వేయించే అధికారం ఎవరిచ్చారని అడగడం అనవసరం. అసలు రాజకీయమంతా పోలీసుల ద్వారానే నడుస్తున్నప్పుడు నాటకాలు మాత్రం ఎందుకు వేయించకూడదు? ఎవరికి ఇష్టమున్నా లేకపోయినా రాష్ట్రంలో ఇవ్వాళ విప్లవోద్యమం ఒక ప్రధాన రాజకీయ శక్తి. దానిని పోలీసులకు అప్పజెప్పేసాం అని ముఖ్యమంత్రి ప్రకటించగలిగినప్పుడు, అందులో తప్పేమీలేదని మేధావులూ పత్రికా సంపాదకులూ అనుకోగలిగినప్పుడు, నాటకాల దగ్గర బెట్టెందుకు? సురభి కళాకారులకు ఇన్నాళ్ళకు ఒక రాజకీయ పాత్ర దొరికిందని సంతోషిద్దాం. ఏ రాజ

కీయాలూ లేనట్టు నటించే కంటే ప్రజా వ్యతిరేక రాజకీయాలలో బహిరంగంగా పాల్గొనడం ఉత్తమమే.

ఒక్క సురభి కళాకారులకే కాదు, ఎవ్వరికీ తమ రాజకీయ పాత్రను ఎంచుకోకుండ వుండే అవకాశం లేకుండ చేసింది ఈ తుపాకీ రాజ్యం. ఒక్కొక్కరి అసలు రంగూ బయటపడుతూ వుంది. బుద్ధి జీవులనే తీసుకోండి. అందరికీ నీతి బోధించడంలోనూ తమ బోధలకు తామే మురిసిపోవడంలోనూ వాళ్ళకు వాళ్ళేసాటి. అయినా, భూసంస్కరణలను నలభై ఏళ్ళలో అమలు చేయలేని ప్రభుత్వం, వాటిని తామే అమలు చేసుకుంటూన్న రైతు కూలీలను వేల సంఖ్యలో అరెస్టుచేసి జైలుపాలు చేస్తూంటే ఒక్కరూ నోరు మెదపడం లేదు. ఈ అన్యాయాన్ని గురించి ఎవ్వరూ మాట్లాడకుండ ఉంటే జరగవలసింది చల్లగా జరిగిపోతుందని కళ్ళు గట్టిగా మూసుకొని కూర్చున్నారు. నక్సలైట్ల హింసను తిడుతూ రెండురోజులకొక బరువయిన సంపాదకీయం క్రమం తప్పకుండ రాసేవాళ్ళు, హత్యలు చేయించి అధికారానికొచ్చిన నేదురుమిల్లి మురాకు రాష్ట్రాన్ని ఏలే అర్హతలేదని గొంతు విప్పి అనలేకుండ ఉన్నారు. వాళ్ళను గౌరవనీయులయిన ప్రజాప్రతినిధులుగా సంబోధిస్తూ ఆత్మవంచన చేసుకుంటున్నారు. వాళ్ళలో ఒకడిని పరిపాలనాదక్షుడనీ ఒకడిని రాజకీయ చతురుడనీ ఒకడిని అనుభవజ్ఞుడనీ పొగుడుతున్నారు కూడ. వాళ్ళ హత్యాకాండ 'ప్రస్తుత రాజకీయాలలో సర్వత్రా పెరిగిపోతున్న అవాంఛనీయ పోకడ' మాత్రమే, నేరంకాదు. అయోధ్య ఉద్యమానికి అడ్డం వచ్చిన వాళ్ళ కాళ్లూ చేతులూ నరుకుతాం అని ప్రకటించిన వెంకయ్యనాయుడుగారి నిత్య పత్రికా గోష్ఠులతో సగం పేజీ నింపుతూ, హింసచేసే వాళ్ళకు ప్రచారం ఇవ్వొద్దని తెలంగాణా జిల్లాల గ్రామీణ విలేకర్లకు ఆదేశాలు పంపుతున్నారు. 'హింస' అనేది ప్రజా రాజకీయాలపట్ల తమకున్న వ్యతిరేకతకు ఒక సాకు మాత్రమేనన్న వాస్తవాన్ని ఇన్నాళ్ళు దాచుకోగలిగారు. ఇవ్వాళ ఆ అవకాశం లేకుండ పాలకవర్గ పార్టీలన్నీ పరోక్షంగానే కాక ప్రత్యక్షంగానూ హింసకు దిగేసరికి పత్రికాధిపతులకూ ఇతర పెద్ద మనుషులకూ ముఖం ఎక్కడ దాచుకోవాలో తెలియడం లేదు. ఇది ఈ మూడు నెలల చరిత్రలోని అత్యుత్తమ పరిణామం.

12-2-1991 కె. బాలగోపాల్

త్వరలో వెలువడనున్నాయి :

సృజన ప్రచురణలు

గత రెండు దశాబ్దాలుగా కవిత్వంలో మార్క్సిస్టు సాహిత్య విమర్శ

కృషి సాగిస్తున్న జె. సి. వ్యాస సంకలనం

కవిత్వం - గతితార్కికత

సామాజిక, కళా చరిత్రల నేపథ్యం నుంచి వ్యక్తివాద

ఆవిర్భావాన్ని, విచ్ఛిన్నక్రమాన్ని చిత్రించిన

గోర్కీ వ్యాసం

విచ్ఛిన్నమవుతున్న వ్యక్తిత్వం

రాయలసీమ - కోస్తా - తెలంగాణా ప్రాంతాల్లోంచి - ప్రధానంగా

గిరిజన - రైతు - కార్మిక జీవితాల నేపథ్యంలో సాగిన

తెలుగు కథా సంకలనం

అలంపి ప్రచురణలు

భూమిక

ప్రతులకు : బండారి కృష్ణయ్య బుక్ స్టాల్

శివాజీనగర్, గోదావరిఖని-505 209

SRJANA Telugu Monthly January/February 1991
Regd No. with the Registrar of Newspapers for India 10953/67

సృజనకు ఆర్థిక, హార్దిక సహకారాన్ని అందించండి!

1990 జనవరిలో మళ్ళీ ప్రారంభమైన 'సృ జ న' తీవ్రమైన ఆర్థిక సమస్యలను, రచనల కొరతను ఎదుర్కొంటున్నది. సృజన పట్ల పాఠకులలో, విప్లవోద్యమ సానుభూతిపరులలో కనబడుతున్న విస్తృత ఆదరణ ఆర్థిక రూపంలోకి పరిణమించడం లేదు. సృజన చందాదారుల సంఖ్య, ఏజెంట్ల సంఖ్య గణనీయంగా పెరగడం లేదు. సృజన మీ పత్రిక. సృజన ప్రజల పత్రిక. సృజనను గతంలో కూడ ప్రజలే తమ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. మళ్ళీ ఒకసారి హెచ్చు సంఖ్యలో చందాలు చేర్పించడం ద్వారా, విరాళాలు సేకరించడం ద్వారా, కొత్త ప్రాంతాలలో ఏజెంట్లను కుదిర్చిపెట్టడం ద్వారా, ఏజెంట్లు సక్రమంగా బకాయిలు చెల్లిస్తున్నారో లేదో కనుక్కోవడం ద్వారా ప్రజలే సృజన జీవనానికి బాసటగా నిలవవలసి ఉన్నది. సృజనను రక్షించుకునే బాధ్యతను విప్లవ సాహిత్యోద్యమ సానుభూతిపరులు స్వచ్ఛందంగా స్వీకరించవలసి ఉన్నదని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం.

సృజన సంవత్సర చందా రు. 40, విడి ప్రతి రు. 4.

* సృజనకు విరివిగా చందాలు సేకరించండి!
* సృజనను పదికాలాల పాటు నిలిపి ఉంచేందుకు మీ వంతు కర్తవ్యం నిర్వహించండి!

SRJANA Rs. 4/-

Flat 11, Block 2,
MIG II, Baghlingampalli,
Hyderabad-500 044